


ఆకాశం ఇద్దరిది
శ్రీ ఉదయిని



## AAKASAM IDDARIDEE

(NOVEL)


*by :*

**SREE UDAYINI**



*Published with :*

**AUGUST 2006 SWATI**


**FREE GIFT**

FOR SWATI READERS


*Writer's Address :*

Smt SREE UDAYINI

G-3, Vidyaranya Apartments

C-55, Madhura Nagar

S.R. Nagar (Post)

HYDERABAD-500 038




# ఆకాశం ఇద్దరిదీ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఓ టీ.వీ. ఛానల్ నిర్వహిస్తున్న చర్చా కార్యక్రమంలో పాల్గొనటానికి స్టూడియోకి వచ్చింది చిత్కళ.

ఆ చర్చని కంపేర్‌చేసే ప్రభాకర్ ఆమెకి సీటింగ్ అరేంజ్‌మెంట్ చూపించాడు. "అందర్నీ సాధ్యమయినంత త్వరగా రమ్మనమని కోరాం!...అందరిలోకి ముందుగావచ్చినందుకు మీకో ఎడ్వాంటేజ్ ఉంది చిత్కళగారూ!...ఏ సీట్‌లో కూర్చోవాలో ఛాయిస్ మీదే!...తరువాత తరువాత వచ్చిన వారికి ఆ అవకాశం తగ్గిపోతుంటుంది"

అతను మాట్లాడిన తీరుకి ఇంప్రెస్ అయింది చిత్కళ. చర్చాకార్యక్రమాలు నిర్వహించటంలో మంచిపేరు ఉంది అతనికి..."చూడండి ప్రభాకర్! బెస్ట్ సీట్ ఏదో చెప్పేసి నాకు సాయం చేయండి" అంది.

అతను సూచించిన సీట్‌లో కూర్చుని ఆ చర్చలో పాల్గొనబోయే మిగిలినవారి పేర్లని చూడటంకోసమని లిస్ట్ అందుకుంది చిత్కళ. ఆమె కాకుండా ఓ మహిళా పారిశ్రామికవేత్త, ఓ సర్జన్, ఓ సినీ రచయిత ఉన్నారు. ఇద్దరు మగవాళ్ళు, ఇద్దరు ఆడవాళ్ళు... బాగానే బ్యాలన్స్ చేశారే అనుకుంది చిత్కళ.

ఆమె మనసులోని ఆలోచనలని ఇట్టే చదివినట్లున్నాడు ప్రభాకర్. "అనివార్య కారణాలవల్ల ఆ లిస్ట్‌లో చిన్నమార్పు వచ్చింది...." అన్నాడు.

'మార్పా?...ఎవరి బదులు ఎవరు వస్తున్నారు?...'అని అడగబోయిన చిత్కళ చివరి సెకన్‌లో ఆగిపోయింది. ఎందుకంటే అప్పుడే ఓ వ్యక్తి లోపలికి వచ్చాడు.

ఎవరా అని అటుచూసి ఆశ్చర్యంలో మునిగిపోయింది చిత్కళ...వచ్చింది చరణ్.

లోపలికి అడుగుపెడుతూనే చరణ్ చిత్కళని చూశాడు.

అయినా చూడనట్లు తలతిప్పి ప్రభాకర్‌తో అన్నాడు. "ప్రభాకర్‌గారూ! మీ కార్యక్రమాలు నేను మిస్ అవకుండా చూస్తుంటాను. ఇప్పుడు ఇలా నా ఫేవరెట్ ప్రోగ్రాంలో పాల్గొనటం నా అదృష్టంగా భావిస్తున్నాను..."

ప్రభాకర్ బదులు ఇచ్చేలోగా మిగిలిన ఇద్దరు కూడా వచ్చేశారు.

క్లుప్తంగా పరిచయాలు పూర్తిచేశాడు ప్రభాకర్.

చిత్కళవైపు ఓ దొంగచూపు పారేశాడు చరణ్. తరువాత ప్రభాకర్ వంక తిరిగి "సాధారణంగా అన్ని విషయాలలోనూ లేడీస్ ఫస్ట్ అని ముందుగా ఆడవాళ్ళకే అవకాశం ఇస్తారు. అయితే ఇది మహిళా దినోత్సవం సందర్భంగా చర్చ కాబట్టి ముందుగా మాట్లాడే ఛాన్స్ మగవాళ్ళకే ఇస్తే బాగుంటుంది అని ప్రపోజ్ చేస్తున్నాను..." అన్నాడు.

"ఈ అయిడియా ఏదో బాగానే ఉన్నట్లుందే..." సాలోచనగా అన్నాడు ప్రభాకర్.

"అంత బ్రహ్మాండమయిన అయిడియా ఇచ్చిన నాతోనే చర్చ మొదలుపెడితే ఇంకా 'బాగుంటుంది" అన్నాడు చరణ్.

అందరూ నవ్వారు కాని చిత్కళ మాత్రం నవ్వలేదు.

"నేనే ఎందుకంటే ఈ డిస్కషన్ రసవత్తరంగా సాగటానికి నా దగ్గర ఓ పవర్‌ఫుల్ ఓపెనింగ్ లైన్ ఉంది. మనం ఇప్పుడు రెండువేల పదిహేనో సంవత్సరంలో ఉన్నాం.ఇంటర్‌నెట్ ఇంకా ఎన్నో విప్లవాత్మకమయిన సాంకేతిక విజ్ఞానఫలాలవల్ల మొత్తం ప్రపంచం అంతా సో కాల్డ్ గ్లోబల్ విలేజిగా మారిపోతున్నది. అయినా ఇప్పటికీ ఈ మహిళా దినోత్సవాలు జరుపుకోవటం ఎంతవరకు సబబు... ఈ మార్చి ఎనిమిదో తారీఖుని మహిళా దినోత్సవం అంటున్నాం... అంటే సంవత్సరంలో మిగిలిన మూడువందల అరవయినాలుగు రోజులూ మగవాళ్ళవే అని మనం ఒప్పేసుకుంటున్నట్లా?..."

చిత్కళ పక్కన కూర్చున్న మహిళా పారిశ్రామికవేత్త ఆవేశంగా ఏదో చెప్పబోయింది. ప్రభాకర్ చిరునవ్వుతో ఆవిడని వారించాడు. "ప్లీజ్! ఒక్క నిముషం!...చరణ్‌గారు చాలా మంచి పాయింట్ లేవదీశారు. దానికి మీరు ఇప్పుడే ప్రతిస్పందించనక్కరలేదు ఎందుకంటే మన షూటింగ్ ఇంకా మొదలవ్వలేదు కదా! చరణ్‌గారి వ్యాఖ్యల గురించి మనసులో ఆలోచిస్తూ ఉండండి. ఈలోగా నేను రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ వివరిస్తాను. మొదటి రూల్ ఏమిటంటే... ఈ కార్యక్రమానికి ఏ రూలూ లేదు..."

అందరూ నవ్వారు. ఈసారి చిత్కళ కూడా నవ్వింది.

"...ఏ రూలూ లేదు అంటే మీ మనసులో ఉన్న భావన పైకి వ్యక్తంచేయటానికి అడ్డుగా ఏ రూలూ ఏ  నిబంధనలేదు అని అర్థం!...అయితే కొన్ని కనీస మర్యాదలని పాటించాలి. అవేమిటంటే..." ప్రభాకర్ సావధానంగా వివరించసాగాడు.

అతని మాటలు వింటూనే ఆలోచనలో పడింది చిత్కళ. తనని రెచ్చగొట్టటానికే బహుశా చరణ్ ఆ కామెంట్ చేసి ఉండాలి. అప్రయత్నంగా ఆమెకి దాదాపు పాతికేళ్ళక్రితం



తన సైన్స్ టీచర్ అన్న మాటలు గుర్తుకి వచ్చాయి. 'చూడు కళా!...స్కూల్‌లో జరిగే క్విజ్ పోటీలలో నువ్వు బాగా పెర్ఫామ్ చేస్తావు. ఐతే ఈరోజు జరిగే క్విజ్ కాంపిటీషన్ అల్లాటప్పా పోటీ కాదు. డిస్ట్రిక్ట్ లెవల్ కాంపిటీషన్...ఆడపిల్లలు నెర్వస్ అయి తత్తరపడటం చాలాసార్లు చూశాను. మన స్కూల్ టీమ్ ఈ పోటీలో నెగ్గాలనే నేనో నిర్ణయం తీసుకున్నాను. మిగిలిన ఇద్దరూ బాయ్స్. ధైర్యంగా జవాబివ్వగలరు.అందుకనే ఫైనల్ టీమ్‌లో నీకు స్థానంలేదు!'

పదమూడేళ్ళ చిత్కళకి అప్పుడు ఆ మాటలు పిడుగుపాటులాగా తోచాయి. 'నో సర్! స్పోర్ట్స్, సినిమా, హిస్టరి...అన్నింటిలోనూ బాగా ప్రిపేర్ అయ్యాను సర్! నేనేం నెర్వస్ అవను సర్. ప్లీజ్!...'

ఆ టీచర్ వేళాకోళంగా నవ్వాడు. 'అమెరికా ప్రెసిడెంట్ పదవిని ఇంతవరకూ ఎవరన్నా మహిళ చేపట్టిందా?...'

ఆయన ఆ ప్రశ్న ఏ ఉద్దేశంతో అడిగాడో పాపం ఆ చిన్న బుర్రకి తట్టలేదు.అయితే సరి అయిన జవాబు చెప్పితే టీమ్‌లోకి తీసుకుంటాడేమో అన్న ఆశతో ఆతృతగా చెప్పింది చిత్కళ 'లేదు సర్! ఇంతవరకూ అమెరికా ప్రెసిడెంట్‌గా ఆడవాళ్ళు ఎవరూ ఎన్నుకోబడలేదు సర్!...'

'కరక్ట్!...ఎందుకో తెలుసా? ఆడవాళ్ళెవరూ ఆ పదవిని సరిగా నిర్వహించలేరని ఆ దేశస్తులనమ్మకం.నాదీ అలాంటినమ్మకమే! సో యు ఆర్ నాట్ ఇన్ ది టీమ్! గో!'

అప్రయత్నంగా చిత్కళ చేయి ఛాతీపైన ఉన్న స్కూల్ బ్యాడ్జ్‌ని తాకింది. స్థాణువులాగా నిలబడిపోయింది.

అప్పుడు ఆ టీచర్ కామెంట్‌కి ఎంతగా కలవరపడిందో ఇప్పటికీ చిత్కళకి బాగా గుర్తుంది. అంతేకాదు అప్పటి తన ప్రతిస్పందనే ఆ తరువాత తన జీవితాన్ని అనూహ్యంగా ఎన్నో మలుపులు తిప్పిందనీ చిత్కళ నమ్మకం.

ప్రభాకర్‌తో మిగిలిన సభ్యులు చేస్తున్న సంభాషణ అన్యమనస్కంగా వింటూనే చిత్కళ పాత విషయాలు గుర్తుచేసుకోసాగింది.

• • •

ఇరవై మూడు సంవత్సరాల క్రితం...

అప్పుడు చిత్కళ ఎనిమిదోక్లాసు చదువుతూ ఉండేది. ఆమె తండ్రి సుధాకర్ స్టేట్ గవర్నమెంట్‌లో గెజిటెడ్ ఆఫీసర్, తల్లి రోహిణి ఎమ్ఏడి చేసినా ఉద్యోగం చేసేది కాదు. ఆ ఊరిలో మంచి పేరున్న విద్యారణ్య స్కూల్‌లో చదువుతూ ఉండేది చిత్కళ.ఇంటి దగ్గర తల్లి గైడెన్స్ ఉండటంతో చదువులో ఎప్పుడూ ఫస్ట్‌వచ్చేది. క్విజ్‌పోటీలలో బాగా రాణించేది.

అప్పుడప్పుడే టీ.వీ.తో శాటిలైట్ ఛానల్స్ రావటం మొదలయింది.అయినా చిత్కళ చదువుమీదనే శ్రద్ధ చూపించేది.

క్రిస్మస్ సెలవులలో కూడా చిత్కళ పుస్తకాలని వదలలేదు.

"అంత దీక్షగా ఆ చదువేమిటి కళా?..." పేరంటం పిలవటానికి వచ్చిన పక్కింటావిడ గట్టిగా అంది. "నేను వచ్చి రెండు నిముషాలు అయింది తెలుసా?..."

అప్పుడు తల ఎత్తింది చిత్కళ.

"రండి ఆంటీ!... రండి కూర్చోండి. అమ్మని పిలుస్తాను"

"తరువాత పిలవచ్చు కాని సెలవులలో ఏం చదువుతున్నావేమిటి?..."

"సెంట్రల్ సిలబస్‌లో సైన్స్ బాగుంటుందిట ఆంటీ!...అది చదువుతున్నాను ఇప్పుడు" అంది చిత్కళ.

ఆవిడ చిత్కళవంక మెచ్చుకోలుగా చూసింది."నా పిల్లలు కూడా నీ అంత శ్రద్ధగా చదివితే బాగుండు కళా!..."

చిత్కళ పకపకా నవ్వింది. ఆవిడకి ఆరునెలలక్రితం కవల పిల్లలు పుట్టారు. ఒక బాబు...ఒక పాప. వాళ్ళు బాగా చదవాలని ఇప్పటి నుండీ ఆవిడ ఆశిస్తున్నదన్నమాట!

"అదేంటి ఆంటీ! పాపం ఈ టెన్షన్స్, కష్టాలు పెద్దయ్యాక వాళ్ళకి ఎలాగూ తప్పవు. ఇప్పటి నుండీ ఆ ఆలోచనలు ఎందుకు?" అంది.

ఆవిడ నవ్వింది. "నువ్వు అనేది నిజమే కాని నిన్ను చూస్తుంటే ముచ్చటగా ఉంది కళా!... అన్నట్లు ఎల్లుండి నువ్వు నీ చదువుకి బ్రేక్ తీసుకోవాలి"

"ఎందుకు ఆంటీ?"

"మా ఇంట్లో ఫంక్షన్ ఉంది..." కావాలనే ఆవిడ వాక్యాన్ని సగంలో ఆపింది.

ఆవిడ ఊహించినట్లుగానే చిత్కళ అడిగింది. "ఫంక్షనా?...ఏ ఫంక్షన్ ఆంటీ?"

"అన్నప్రాశన" అన్నదావిడ.

చిత్కళ అడిగింది. "అర్చనకి అభిషేక్‌కి ఇద్దరికీనా ఆంటీ"

"లేదమ్మా!...ముందుగా అభిషేక్‌కి చేస్తున్నాం. వచ్చేనెల అర్చనకి"

"అదేంటి ఆంటీ అర్చనకి ఒక నెల లేట్‌గా ఎందుకు చేస్తున్నారు?..." విస్మయంగా అడిగింది చిత్కళ.

"అది ఓ పద్ధతి..." ఆవిడ క్లుప్తంగా చెప్పింది.

"అదేం పద్ధతి?...ఆడవాళ్ళకి ఆలస్యంగా ఆకలి వేస్తుందా?..." చిత్కళ ఆలోచించకుండా అడిగింది. అర్చన, అభిషేక్ ఇద్దరూ కొన్ని నిముషాల తేడాలో పుట్టారుట. అలాంటప్పుడు ఏ ఫంక్షన్ చేసినా వాళ్ళిద్దరికీ కలిసి చేయాలి కాని ఇలా విచక్షణ చూపటం ఏమిటో చిత్కళకి అర్థంకాలేదు.

రోహిణితోపాటు పక్కింటావిడ కూడా పగలబడి నవ్వింది "రోహిణిగారూ! చిత్కళ పెద్దయ్యాక ఫెమినిస్ట్ అవుతుంది చూస్తూ ఉండండి"

ఆవిడ బొట్టుపెట్టి ఫార్మల్‌గా పేరంటానికిఆహ్వానించి వెళ్లాక నోరువిప్పింది చిత్కళ.



అంతవరకూ ఏదో ఆలోచిస్తూనే ఉంది."అమ్మా! నవ్వకుండా నాకు సరిగా చెప్పు. అన్నప్రాశనకి ఆడామగా తేడా ఏమిటి?"

రోహిణి దగ్గర దానికి జవాబులేదు. "ఏమోనే! నాకు సరిగా తెలియదు. మగపిల్లలకి సరినెలలలోనూ ఆడపిల్లలకి బేసి నెలలలోనూ అన్నప్రాశన చేస్తారు. అది ఆనవాయితీ... ఎందుకు అని మళ్ళీ అడగకు... నేను చెప్పలేను"

చిత్కళకి సంతృప్తి కలగలేదు. సాధారణంగా చిత్కళకి వచ్చే చాలా సందేహాలకి తల్లి సమర్థవంతంగానే వివరణ ఇచ్చేది. ఇలా బ్లంట్‌గా నాకు తెలియదు అని చెప్పేదికాదు. "అర్చన, అభిషేక్ ఇద్దరూ ఒకేసారి పుట్టారు కదా. ఇలా ఒకరికి ముందుగా ఇంకొకరికి ఆలస్యంగా అన్నప్రాశన చేయటం సరికాదు కదా!"

రోహిణి నచ్చచెప్పటానికి ప్రయత్నించింది. "చూడు కళా!...ఫలాన రోజున బారసాల చేయాలని, ఉయ్యాలలో వేయాలని ఇలా ఎప్పటినుండో ఓ పద్ధతి వస్తున్నది..."

చిత్కళ వెంటనే అడిగింది. "కాని బారసాలకి ఉయ్యాలలో వేయటానికి కూడా ఆడామగా తేడా ఉంటుందా?..."

రోహిణి జవాబు ఇవ్వలేదు. చిత్కళ సందేహం మరీ కొట్టిపారేసేటట్లు కనబడలేదు ఆమెకి. అదే సమయంలో చిత్కళ లేవదీసిన అభ్యంతరం సరి అయినదే అని ఒప్పుకోవటానికి ఆమె తయారుగా లేదు.

"ఏమిటి అమ్మా?...సమాధానం చెప్పవే?"

రోహిణి లాలనగా కూతురి వంక చూసింది."లేనిపోని ధర్మసందేహాలతో ఎదుటి వారి బుర్రలు తినేయకూడదు చిత్కళా..."

తల్లి మాట తప్పిస్తున్నది అని అర్థం అయింది చిత్కళకి. ఆ తరువాత చిత్కళకి చదువుతున్న సైన్స్ పాఠం మీద ఆసక్తిపోయింది. ఆలోచిస్తూ ఉండిపోయింది.

ఆ రాత్రి భోజనాల దగ్గర తండ్రిని మళ్ళీ అదే ప్రశ్న అడిగింది చిత్కళ. ఆమెతండ్రి సుధాకర్ దృష్టి అంతా టీ.వీ పైన ఉంది. సౌత్ ఆఫ్రికాలో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం వస్తున్నది అప్పుడు. అజారుద్దీన్ త్వరగా ఔట్ అవటంతో ఆయనమూడ్ అంతబాగాలేదు. చిత్కళ ఆయన భుజంతట్టి రెండోసారి అడిగితే ఆయనకి వినబడింది. జవాబు ఏం చెప్పాలా అని ఆలోచనలోపడ్డాడు ఆయన.

రోహిణి నవ్వుతూ అంది. "అలా మౌనంగా ఉండిపోయారేమిటి?...పొద్దున నించీ నా మెదడు తినేస్తున్నది. మీరే ఎలాగయినా సరి అయిన సమాధానం ఇవ్వాలి"

అల్లాటప్పా జవాబు సరిపోదని ఆయనకి అర్థం అయింది. అందుకని కొంచెం కాంప్లికేటెడ్ అంశాన్ని ప్రస్తావించాడు ఆయన, "నాకు సరిగా తెలియదు కాని బహుశా జీర్ణాశయ వ్యవస్థలో ఏమన్నా తేడాలు ఉంటాయేమో!... అందుకనే మన పెద్దవాళ్ళు ఇలా సరినెలలో మగపిల్లలకి, బేసినెలలో ఆడపిల్లలకి అన్నప్రాశన చేయాలని నిర్ధారించి

ఉంటారు..." భార్యవంక తిరిగి సన్నగా కన్నుగీటాడు. చూశావా ఎంత తెలివిగా తప్పించుకున్నానో అన్నట్లు!

చిత్కళ అది గమనించలేదు. అందుకనే తండ్రి చెప్పినది కొంతవరకు సబబుగానే ఉంది అని తోచింది ఆమెకి.

రాత్రి పడుకునే ముందు తన దగ్గరున్నటువంటి స్టేట్ సిలబస్ సైన్స్ పుస్తకాలే కాక సెంట్రల్ సిలబస్, ఐసిఎస్ఇ సిలబస్ పుస్తకాలు కూడా తిరగేసింది. కావలసిన సమాధానం లభ్యం అవలేదు.

జనవరిలో స్కూల్ తెరవగానే లైబ్రరీలో ఇంకొన్ని పుస్తకాలు వెతికింది. ఊహూ! సమాధానం అంతుపట్టలేదు.

సైన్స్ టీచర్‌ని ఎలా అడగాలో ఆమెకి ఓ పట్టాన అర్థం అవలేదు. తర్జనభర్జనపడి చివరికి ధైర్యంచేసి ఆయనని అడిగేసింది.

అదే ప్రశ్న ఇంకొకరు అడిగిఉంటే వేళాకోళం చేయటానికి అడుగుతున్నారు అనుకునేవాడు ఆయన...కాని చిత్కళ మంచి స్టూడెంట్ అని ఆయనకి తెలుసు. ఇలా తరతరాలుగా వస్తున్న ఆచారం వెనకాల ఏదో అంతరార్థం ఉండే ఉంటుందని ఆయనకి తోచింది కాని అదేమిటో స్ఫురించలేదు.

అప్పుడు స్టాఫ్ రూమ్‌లోకి సోషల్ టీచర్ వచ్చింది. "కళా! మళ్ళీ ఏమన్నా డౌట్ వచ్చిందా?" నవ్వుతూ అడిగింది.

సైన్స్ టీచర్ అమ్మయ్యా అనుకున్నాడు. తనకి తెలియదని సూటిగా చెప్పనవసరం లేకుండా ఈ సోషల్ టీచర్‌కి బాధ్యత బదలాయిస్తే సరిపోతుంది అనుకున్నాడు. "మీ ఫేవరెట్ స్టూడెంట్‌కి భలే డౌట్ వచ్చింది మేడమ్!..." అంటూ వివరించాడు.

సోషల్ టీచర్ స్త్రీవాద రచనలు చదివి ఉత్తేజం పొందలేదు కాని ఓ ఆడదానిగా ఇటు ఉద్యోగం చేస్తూ అటు ఇంట్లో వంటావార్పూ పూర్తిగా తానేచేస్తూ పిల్లల పెంపకంలో భర్త ఇసుమంతయినా సహకరించకపోవటంతో సతమతమవుతున్న సగటు ఆడది. సహజంగానే స్త్రీవాద ఆవేశం వచ్చేసింది. "జీర్ణవ్యవస్థలో తేడాలు లేవు కాని ఇదంతా అనాదిగా మగవాళ్ళు ఆడదాన్ని తక్కువచేస్తున్నారు అనటానికి ఓ ఉదాహరణ" అంటూ మొదలుపెట్టి పెద్ద ఉపన్యాసమే ఇచ్చింది.

పాపం చిత్కళ చేసిన తప్పేం లేదుకాని ఆమెకి తెలియకుండానే ఇద్దరు టీచర్లూ పెద్ద వాదనే పెట్టుకున్నారు.

ఆ తరువాత చిత్కళ మెల్లిగా ఆ సంగతి మరచిపోయింది. అయితే సైన్స్ టీచర్ ఆ విషయాన్ని మరిచిపోలేదు. సోషల్ టీచర్ "మీలాంటి ఎమ్‌సిపిలు ఉన్నంతకాలం ఈ సమాజం బాగుపడదు..." అని అనటం ఆయన ఎలా మరిచిపోగలడు?

ఎమ్‌సిపి అంటే మేల్ చావనిస్టిక్ పిగ్ లేదా పురుషాధిక్య అహంకార వరాహం అని



ఆయనకి తెలుసు. ఆవేశంతో ఊగిపోతూ "ఏమన్నారూ?" అని సోషల్ టీచర్‌ని నిలదీశాడు.

ఆవిడ ఒక్కక్షణం తత్తరపడింది. తాను నోరుజారానని గ్రహించి వెంటనే మాట మార్చింది. "నా ఉద్దేశం మీ లాగా మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్ అంటే ఎమ్‌సిపి మాత్రమే చదివి సైన్సే చాలనుకుని స్త్రీ విచక్షణకి గురి అవుతున్నది అన్న సామాజిక సత్యాన్ని విస్మరిస్తే ఈ సమాజం ఎప్పటికీ బాగుపడదు అని..."

సైన్స్ టీచర్ ఖంగుతిన్నాడు.

ఆ తరువాత ఆ ఎమ్‌సిపి జోక్ స్టాఫ్‌రూమ్‌లో గుసగుసగా బాగా పాకింది. తానెలా ఫూల్ అయ్యాడో తలచుకున్నప్పుడల్లా సైన్స్ టీచర్‌కి ఒంటికి కారం పూసినట్లుండేది. దీనికంతా కారణం ఆ చిత్కళ కదూ?!.

రెండు నెలల తరువాత డిస్ట్రిక్ట్ లెవల్‌లో జరిగే క్విజ్‌పోటీలలో పాల్గొనేందుకు ఆ స్కూల్ తరఫున ముగ్గురిని ఎన్నికచేశారు. సుధీర్, ఆమోద్ అనే అబ్బాయిలతోపాటు చిత్కళకూడా ఆ టీమ్‌లో ఉంది.

ముందుగా టీమ్‌లో ముగ్గురు ఉండచ్చు అన్నారు కాని తీరా ఆ పోటీకి వెళ్ళాక చిన్న మార్పు వచ్చింది. టీమ్‌లో ఇద్దరు మాత్రమే ఉండాలి అన్నారు. టకటకా సమాధానాలు ఇవ్వాల్సివచ్చే రాపిడ్‌ఫైర్ రౌండ్‌లో సాధారణంగా టీమ్ నుంచి ఒకరు మాత్రమే పాల్గొంటారు. అయితే టీమ్ మెంబర్స్ అంతా రాపిడ్ ఫైర్ రౌండ్‌లో తన ప్రజ్ఞ చూపించాలి అన్న ఆలోచన వచ్చింది నిర్వాహకులకి. టీమ్‌కి ముగ్గురు ఉంటే ఇది ఆచరణలో పెట్టటం కష్టం కాబట్టి టీమ్‌లో సభ్యుల సంఖ్యని రెండుకి తగ్గించారు.

సుధీర్, ఆమోద్‌లు తొమ్మిది పది చదువుతున్నారు. వాళ్ళూ చురుకయిన వాళ్ళే. టీమ్‌లో ఎవరిని తొలగించాలి? సైన్స్ టీచర్ అప్పటికే ఓ నిర్ణయానికి వచ్చేసినా చాలాసేపు ఆలోచించినట్లు నటించి చిత్కళ వంక తిరిగాడు. "చూడు కళా!...స్కూల్‌లో జరిగే క్విజ్ పోటీలలో నువ్వు బాగా పెర్ఫామ్ చేస్తావు... అయితే ఈరోజు జరిగే క్విజ్ కాంపిటీషన్ అల్లాటప్పా పోటీకాదు. డిస్ట్రిక్ట్ లెవల్ కాంపిటీషన్! ఇక్కడ విజయం సాధించాలంటే నిముషంలో దాదాపు పది ప్రశ్నలకి సమాధానం ఇవ్వాల్సివచ్చే రాపిడ్ ఫైర్ రౌండ్‌లో ఎక్కువమార్కులు సాధించాలి. ఆడపిల్లలు నెర్వస్ అయి తత్తరపడటం చాలాసార్లు చూశాను. మన విద్యారణ్య స్కూల్ టీమ్ ఈ పోటీలో నెగ్గాలనే నేనోనిర్ణయం తీసుకున్నాను.మిగిలిన ఇద్దరూ బాయ్స్. ధైర్యంగా జవాబు ఇవ్వగలరు...అందుకే ఫైనల్ టీమ్‌లో నీకు స్థానంలేదు. నువ్వు ఇంకా ఎయిత్‌క్లాసేకదా! బెటర్‌లక్ నెక్స్ట్ టైమ్!..."

పదమూడేళ్ల చిత్కళకి అప్పుడు ఆ మాటలు పిడుగుపాటులాగా తోచాయి. చిన్నప్పటి నుండి క్విజింగ్ అంటే ఎంతో ఇష్టం ఉండేది చిత్కళకి. పైగా తల్లికూడా చిత్కళని బాగా ఎంకరేజ్ చేసేది. దాంతో మిగిలిన ఇద్దరికన్నా చిత్కళ తక్కువ క్లాస్‌లో ఉన్నా క్విజ్‌కి సంబంధించిన విషయాలలో మాత్రం మంచిపరిజ్ఞానమే ఉంది.న్యాయంగా అయితే సుధీర్‌నో

ఆమోద్‌నో తొలగించి చిత్కళకి స్థానం ఇవ్వాలి. "నో సర్! స్పోర్ట్స్, సినిమా, హిస్టరీ...అన్నింటిలోనూ బాగా ప్రిపేర్ అయ్యాను సర్! కావాలంటే సుధీర్‌ని కూడా అడగండి సర్!...వాళ్ళిద్దరికీ తెలియని చాలావాటికి నాకు సమాధానాలుతెలుసుసర్! నేనేం నెర్వస్ అవనుసర్.ప్లీజ్!"

ఆ టీచర్ వేళాకోళంగా నవ్వాడు. ఈ పిల్ల వల్లనేకదా తనని ఆ సోషల్ టీచర్ పిగ్ అని ఇన్‌డైరెక్ట్‌గా అన్నది! అయినా అసలు ప్రకృతి పరంగానే ఆడామగా తేడాలు ఉన్నాయి. వాటిని విస్మరించి మేము కూడా సమానమే ఆకాశంలో సగం మేమే అని విర్రవీగితే ఎలా? ఈ పిల్ల ఆడకాకికి మగ ఉండేలు దెబ్బ ఎలా ఉంటుందో రుచి చూపించాలి. గొంతు తగ్గించి సౌమ్యంగా అడిగాడు. "అమెరికా ప్రెసిడెంట్ పదవిని ఇంతవరకూ ఎవరన్నా మహిళ చేపట్టిందా?"

ఆయన ఆ ప్రశ్న ఏ ఉద్దేశంతో అడిగాడో పాపం ఆ చిన్న బుర్రకి తట్టలేదు. అయితే సరి అయిన జవాబు చెపితే టీమ్‌లోకి తీసుకుంటాడేమో అన్న ఆశతో ఆతృతగా చెప్పింది చిత్కళ "లేదు సర్! ఇంతవరకూ అమెరికా ప్రెసిడెంట్‌గా ఆడవాళ్ళు ఎవరూ ఎన్నుకోబడలేదు సర్..."

సైన్స్ టీచర్ సంతృప్తికరంగా నవ్వాడు. "కరక్ట్!...ఎందుకో తెలుసా?..."

చిత్కళ అయోమయంగా "తెలియదు సర్!..." అంది.

"తెలియదా?...ఆడపిల్లలకి మగపిల్లలకి అన్నప్రాశన చేసేటప్పుడు తేడా ఎందుకు చూపిస్తారో కూడా తెలియదు కదూ?..." సైన్స్ టీచర్ వ్యంగ్యంగా అన్నాడు. "ఎందుకో నేను చెబుతాను. అమెరికా ప్రెసిడెంట్ అంటే ప్రపంచంలోనే అత్యున్నత పదవి...ఆడవాళ్ళెవరూ ఆ పదవిని సరిగా నిర్వహించలేరని ఆ దేశస్తుల నమ్మకం. నాదీ అలాంటి నమ్మకమే! సో యు ఆర్ నాట్ ఇన్ ది టీమ్!...గో!"

అప్రయత్నంగా చిత్కళచేయి ఛాతీపైన ఉన్న స్కూల్ బ్యాడ్జ్‌ని తాకింది. స్థాణువులాగా నిలబడిపోయింది.

"చిన్నపిల్లలలో ఆడామగా తేడా ఎందుకు అని అప్పుడు అడిగావు గుర్తుందా?... ఆ తేడా సహజంగా ఉన్నదే. ఆడవాళ్ళు ఎంత ప్రయత్నించినా ఆ గ్యాప్‌ని దాటి మగవాళ్ళని చేరలేరు..."

ఇన్నాళ్ళశ్రమ అంతా వృధాయేనా?...అసలు ఎనిమిదోక్లాస్ విద్యార్థులు ఈ పోటీకి అర్హత సంపాదించటం అన్నది చాలా అరుదుగా జరుగుతూ ఉంటుందిట...ఇంతదూరం వచ్చాక చేతికి చిక్కినట్లే బులిపించి ఈ అవకాశం దూరమయిపోతుందా?... చిత్కళకంట సన్నగా నీరు తిరగసాగింది.

అది గమనించి సైన్స్ టీచర్ వంకరగా నవ్వాడు. "అలా కుండ బద్దలయినట్లు కన్నీళ్ళు కార్చటం ఇంకో వీక్నెస్ తెలుసా?...కన్నీళ్ళతో క్విజ్ కాంపిటీషన్ గెలవలేవు కళా!... బుర్ర కావాలి. బాయ్స్ అయితే స్థైర్యంగా స్థిరంగా ఆలోచించగలరు. అర్థమయిందా?... గో!...గో అండ్ సిట్ ఇన్ ది ఆడియన్స్ అండ్ ఎంజాయ్ ది క్విజ్ కాంపిటీషన్..."అంటూ సుధీర్ ఆమోద్‌లవంక తిరిగి వాళ్ళకి సూచనలు ఇవ్వసాగాడు.

ఆమోద్ తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు. టీమ్‌కి ఇద్దరే ఉండాలి అన్నప్పుడు తప్పకుండా తనపైనే వేటుపడుతుంది అనుకున్నాడు అతను. సైన్స్ టీచర్ ఎందుకో పాపం చిత్కళని పక్కనపెట్టాడు. టీమ్‌లో చిత్కళ లేకపోతే ఇబ్బందులు కూడా ఉన్నాయి. లిటరేచర్, స్పోర్ట్స్‌లో చిత్కళకి ఎన్నో సంగతులు తెలుసు!

టీమ్‌లో స్థానాన్ని కోల్పోవటం ఒక షాక్ అయితే దానికి సైన్స్ టీచర్ ఇచ్చిన వివరణ ఇంకా పెద్ద షాక్‌గా తోచింది చిత్కళకి!...ఆడవాళ్ళని అంత చులకనచేసి ఆయన మాట్లాడటం చిత్కళకి అసలు నచ్చలేదు.

మునిపంట పెదవిని నొక్కిపెట్టి కళ్ళనుండి ఉబికిఉబికి వస్తున్న కంటినీరు ఎవరికీ కనపడకూడదని తలవంచుకుని ఆడిటోరియంలోకి నడిచింది చిత్కళ. నిజానికి ఆ క్విజ్ కాంపిటీషన్‌కి దూరమయి ఇంటికి వెళ్ళాలని ఉంది కాని అసలు నడిచే శక్తి లేక వెనకగా ఉన్న ఓ సీట్‌లో కూలబడింది.

క్విజ్ ఇంకో అరగంటలో మొదలవబోతున్నది. మెల్లగా చిత్కళ పక్కన ఎవరెవరో వచ్చి కూర్చుంటున్నారు. చిత్కళకి అన్నీ మసకమసకగా కనబడుతున్నాయి. ఏవేవో మాటలు అస్పష్టంగా వినబడుతున్నాయి.

ఎంత సేపయిందో తెలియదు కాని ఎవరో చిత్కళ భుజం తడుతున్నారు.

"ఎస్...ఎస్..." అంది చిత్కళ ప్రశ్నార్థకంగా. తన స్కూల్ టీంలో తనకి చోటులేనప్పుడు తనతో ఇంకా ఎవరికి మాత్రం ఏ అవసరం ఉంటుంది?

సరస్వతి మందిర్ అనే స్కూల్ టీమ్‌లో ఒక్కరే వచ్చారుట. ఇంకో స్కూల్‌కి చెందిన విద్యార్థి అయినా ఆ స్కూల్ తరఫున పాల్గొనేందుకు అనుమతి ఇచ్చారు నిర్వాహకులు.

ఆ విధంగా చిత్కళ ఇంకో అమ్మాయితో కలిసి సరస్వతిమందిర్ స్కూల్ తరఫున క్విజ్ పోటీలో పాల్గొంది. ఆ పోటీలో ఆల్‌గర్ల్స్ టీమ్ అదొక్కటే!

పోటీ మొదలయ్యాక చిత్కళ మెల్లగా తేరుకోసాగింది. ప్రశ్నలకి ఉత్సాహంగా జవాబు ఇవ్వసాగింది.

చివరికి ఫైనల్‌లో విద్యారణ్య, సరస్వతి మందిర్, ఇంకో రెండు టీమ్‌లు పోటీపడ్డాయి.

పోటీ మొదలయ్యేముందు చిత్కళ సుధీర్‌కి ఆమోద్‌కి ఆల్ ది బెస్ట్ చెప్పి వచ్చి తన సీట్లో కూర్చుంది. "వాళ్ళకి ఆల్ ది బెస్ట్ చెప్పావేమిటి?... మీ స్కూల్ గెలవాలని ఉందా?" చిత్కళ పార్ట్‌నర్ అడిగింది.

స్పోర్టివ్‌గా అలా చెప్పింది కాని చిత్కళ మనసు రగిలిపోతున్నది. ఆడదనే సాకుతో తనని టీమ్‌లోంచి తీసేస్తారా? ఆడపిల్ల ఏం చేయగలదో నిరూపించాలి!

ఫైనల్ మొదలయింది.

సుధీర్, ఆమోద్‌లు కూడా చక్కగా సమాధానాలు ఇవ్వటంతో విద్యారణ్య స్కోర్ కూడా సరస్వతి మందిర్ స్కోర్‌తో సమంగానే కొనసాగింది.

"షేక్స్పియర్ రాసిన అతిచిన్న నాటకం ఏది?" ఈ ప్రశ్న విద్యారణ్య టీమ్‌కి వెళ్ళింది.

చిత్కళ బాధతో తలదించుకుంది. ఆ ప్రశ్నకి సరి అయిన సమాధానం ఏమిటో ఆమె సుధీర్‌కి ఆ క్రితం రోజునే చెప్పింది.

సుధీర్ చిత్కళ వంక చూశాడు. నిన్ననే చిత్కళ చెప్పిన ఆ నాటకం పేరేదో అతనికి చప్పున గుర్తుకిరావటంలేదు. అక్కడ సెకన్‌ముల్లు గబగబా ముందుకినడుస్తున్నది. ఇక సమయం అయిపోతుండగా "యాజ్ యు లైక్ ఇట్" అని సమాధానం ఇచ్చాడు.

"రాంగ్!...ది క్వశ్చన్ పాసెస్ టు సరస్వతి మందిర్" క్విజ్ మాస్టర్ అన్నాడు.

సుధీర్ కంగారులో తప్పు ఆన్సర్ చెప్పాడు!... చిత్కళ నమ్మలేకపోయింది. ఇప్పుడు తమకే ఆ ఛాన్స్!

"కామెడీ ఆఫ్ ఎర్రర్స్!..." చిత్కళ చెప్పింది.

"కరక్ట్! యు గెట్ బోనస్ పాయింట్స్!..." క్విజ్ మాస్టర్ అన్నాడు.

మొదటిసారిగా సరస్వతి మందిర్ అయిదు పాయింట్ల ఆధిక్యం సంపాదించింది.

తరువాతి ప్రశ్న మళ్ళీ చిత్కళ టీమ్‌కే "హెలియంతస్ యాన్నుస్ అన్న శాస్త్రీయ నామం ఏ పూవును సూచిస్తుంది?"

చిత్కళ మొహం నల్లబడింది. ఆ ప్రశ్నకి సమాధానం తెలియదు! బొటానికల్‌నేమ్స్ అన్నీ సుధీర్‌కి మంచినీళ్ళ ప్రాయం. పైగా అతను పదవతరగతి. సైన్స్ పాఠాలలో బహుశా చదివేశాడేమో కూడా...అతనికి ఆ ప్రశ్నకి సమాధానం తప్పకుండా తెలిసే ఉంటుంది.చిత్కళ తన పార్ట్‌నర్ వంక తిరిగింది. "నాకు తెలియదు..."ఆ అమ్మాయి చెప్పింది.

చిత్కళ తమ తరువాతి టీమ్‌ల వంక చూసింది. వాళ్ళకీ తెలియదు అన్న సంగతి వాళ్ళ హావభావాలవల్ల ఇట్టే తెలిసిపోతున్నది! అంటే ఈ ప్రశ్నతో సుధీర్ వాళ్ళు బోనస్ పాయింట్ సాధించి తమతో సమమవుతారు.

"ఫైవ్ సెకండ్స్ మోర్..." క్విజ్ మాస్టర్ అన్నాడు.

ఆ చివరి క్షణాలలో చిత్కళ బుర్రకి తట్టింది. "సన్‌ఫ్లవర్..." సమయం మించి పోయేలోగా చెప్పేయాలని అరిచింది.

క్విజ్ మాస్టర్ సీరియస్‌గా ఆమెవంక చూశాడు: "ఊహించి చెప్పావా?"

చిత్కళ ధైర్యం పుంజుకుంది. "ఎస్ సర్! హెలియోస్ అంటే గ్రీక్‌లో సూర్యుడు కదా..."

"దట్స్ వెరీ ఇంటెలిజెంట్‌వే ఆఫ్ గెసింగ్ చిత్కళా! యు గెట్ ఫుల్ మార్క్స్!" క్విజ్ మాస్టర్ చప్పట్లు కొడుతూ అన్నాడు.

ఆడిటోరియంలో కూడా చప్పట్లు మోగాయి.



సుధీర్ మొహం నల్లబడింది.

రాపిడ్‌ఫైర్ రౌండ్‌లో చిత్కళ తడబడకుండా దాదాపు అన్ని ప్రశ్నలకి సమాధానం ఇచ్చింది. చిత్కళ పార్ట్‌నర్ కూడా బాగానే చెప్పింది.

క్విజ్ ముగిసే సమయానికి విద్యారణ్య టీమ్, సరస్వతి మందిర్ టీమ్ సమంగా స్కోర్ చేసి ముందున్నాయి.

"మీ రెండు టీమ్‌లలో విన్నర్ ఎవరో నిర్ణయించటానికి ఇక టై బ్రేకర్ వాడక తప్పదు" క్విజ్ మాస్టర్ ప్రకటించాడు. "చివరిగా ఓ ప్రశ్న అడుగుతాను. ఎవరు ముందుగా బటన్ నొక్కుతారో వాళ్ళే సమాధానం చెప్పాలి. సరి అయిన సమాధానం చెపితే గెలుస్తారు. తప్పు ఆన్సర్ అయితే రెండో టీమ్ ఆటోమాటిక్‌గా గెలుస్తుంది. సో జాగ్రత్తగా ఉండండి. ఆల్ ది బెస్ట్ టు బోత్ ది టీమ్స్!..." ప్రశ్న చదవటానికి క్విజ్ మాస్టర్ ఆగాడు.

ఆలోచించకుండా బటన్ నొక్కేయమని సైన్స్ టీచర్ సుధీర్‌కి సంజ్ఞ చేశాడు.అర్థం అయింది అన్నట్లు సుధీర్ స్వల్పంగా తల కదిపాడు. చేయి బటన్‌పైన స్థిరంగా ఉంచాడు. ప్రశ్న సగంలోనే బటన్ నొక్కటానికి సిద్ధమయ్యాడు.

"ఇన్సులిన్ కనిపెట్టినందుకు నోబెల్ ప్రైజ్ సంపాదించింది ఎవరు?" క్విజ్ మాస్టర్ ప్రశ్న పూర్తిచేస్తూనే సుధీర్‌వంక తిరిగాడు. బటన్ ముందుగా నొక్కింది అతనే! ఆలస్యం చేసినందుకు చిత్కళ తనని తానే తిట్టుకుంది.

ఆనందాన్ని అణుచుకోలేక సుధీర్‌లేచి నుంచుని సమాధానం చెప్పాడు. "బెస్ట్ అండ్ బాంటింగ్"

"దట్స్ ది కరక్ట్ ఆన్సర్" అంటున్న క్విజ్ మాస్టర్ మాటలని మధ్యలోనే అడ్డుకుంది చిత్కళ "నో సర్! దట్స్ ది రాంగ్ ఆన్సర్" ఆమెకి తెలుసు. సాధారణంగా క్విజ్ మాస్టర్స్ డెసిషన్ ఈజ్ ఫైనల్ అని అంటుంటారు. తప్పు అని ఆ తరువాత తెలిసినా క్రికెట్‌లో అంపైర్ నిర్ణయంలాగా క్విజ్ మాస్టర్ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందే.

అందుకనే గెలిచింది ఎవరో క్విజ్ మాస్టర్ ప్రకటించేలోగానే అభ్యంతరం చెప్పాలని చకచకా చెప్పసాగింది. "ఇన్సులిన్ కనిపెట్టింది సుధీర్ చెప్పినట్లు బెస్ట్ అండ్ బాంటింగ్ సర్!...కాని ఇన్సులిన్ కనిపెట్టినందుకు నోబెల్ బహుమతిని ఇచ్చింది మాత్రం బాంటింగ్ అండ్ మెక్లాయిడ్‌కి..." గబగబా చెప్పేసి ఊపిరి బిగపట్టి క్విజ్ మాస్టర్ రియాక్షన్ కోసం ఆయన వంక తదేకంగా చూడసాగింది.

క్విజ్ మాస్టర్ అప్రతిభుడయి కొంతసేపు మాట్లాడలేకపోయాడు. ఆయన చేతిలో ఉన్న కాయితంలో ఉన్న ప్రశ్నని ఒకసారి చూసి తల ఊపాడు.

చిత్కళ చెప్పింది నూటికి నూరుపాళ్ళూ సరి అయినదే! తప్పులేమన్నా ఉన్నాయా అని ప్రతి ప్రశ్నని ఎన్నోసార్లు వెరిఫయి చేసి కూడా తామంతా విస్మరించిన ఆ చిన్న తేడాని ఈ చిన్నపిల్ల ఎంత చురుకుగా పట్టేసింది!

అతను ఆడియన్స్‌వైపు తిరిగాడు. "దాదాపు వందేళ్ళనుంచీ సాగుతున్న నోబెల్ బహుమానాల ప్రదానంలో కొన్ని అపశ్రుతులు దొర్లాయి. మహాత్మాగాంధీకి శాంతి బహుమతి రాకపోవటం నోబెల్ బహుమతులు తుడుచుకోలేని పెద్దమచ్చ! అలాగే ఇన్సులిన్ కనిపెట్టినందుకు ఇచ్చిన బహుమతి కూడా! లాబొరేటరీలో కష్టపడి ఇన్సులిన్‌ని తయారుచేసే విధానాన్ని కనిపెట్టింది మాత్రం బెస్ట్ అండ్ బాంటింగ్. అయితే నోబెల్ బహుమతి ప్రకటించింది మాత్రం బాంటింగ్‌కి మరియు మెక్లాయిడ్‌కి.

ఇంతకీ ఆ మెక్లాయిడ్ అన్న మహానుభావుడు చేసింది ఏమిటో తెలుసా? తన లేబరేటరీ వాడుకునేందుకు బెస్ట్‌కి బాంటింగ్‌కి అనుమతి ఇచ్చాడు. ఆ తరువాత బాంటింగ్ తన వాటాగా వచ్చిన బహుమతి ధనంలో సగం బెస్ట్‌కి ఇవ్వబోయాడు కాని బెస్ట్ తిరస్కరించాడు. ఈ విషయాన్ని నోబెల్ కమిటీకి చెప్పినా ఒకసారి ప్రకటించిన నిర్ణయాన్ని మార్చే ప్రసక్తిలేదు అని మొండితనం చూపించి బెస్ట్‌కి చరిత్రకి అన్యాయం చేశారు. నేనయితే ఆ పట్టుదలకి పోకుండా తప్పు ఒప్పుకుంటున్నాను. ఐ థాంక్ చిత్కళ ఫర్ కరెక్టింగ్ మీ అండ్ ఐ డిక్లేర్ హర్ టీమ్ యాస్ విన్నర్స్...గివ్ హర్ ఏ బిగ్ హ్యాండ్!"

ఆడిటోరియం చప్పట్లతో దద్దరిల్లింది.

చిత్కళ ప్రేక్షకులలో సైన్స్ టీచర్ ఎక్కడ ఉన్నాడా అని చూసింది. కనబడలేదు.

చిత్కళకి చెప్పలేనంత సంతోషంగా ఉంది... ఆడవాళ్ళని చులకనచేసి మాట్లాడినందుకు ఆ సైన్స్ టీచర్‌కి సరి అయిన శాస్తే జరిగింది. క్విజ్‌పోటీలలో తనని టీమ్‌లో ఉంచి ఉంటే తమ స్కూల్ టీమ్ సునాయాసంగా గెలిచేదే! దీనికంతా కారణం ఆ సైన్స్ టీచర్, ఆడవాళ్ళమీద ఆయనకి ఉన్న తప్పుడు అభిప్రాయాలు!

సుధీర్, ఆమోద్‌ల దగ్గరకి వెళ్ళింది చిత్కళ.

క్విజ్‌కి విద్యార్థులని తీసుకువచ్చిన సైన్స్ టీచర్‌దే తిరిగి వాళ్ళని ఇంటివద్ద దింపే బాధ్యత. ఆయనమాత్రం చిత్కళవంక చూడను కూడా చూడకుండా సుధీర్, ఆమోద్‌లతో బయటికి కదిలాడు.

చిత్కళకి కోపంతో పాటు ఉక్రోషంకూడా తన్నుకు వచ్చింది. తానేం తప్పుచేసింది? ఆ సైన్స్ టీచర్ అంత ఓవర్ యాక్షన్ ఎందుకు చేస్తున్నాడు?

ఆ క్విజ్‌కి వచ్చిన మిగిలిన స్కూల్ పిల్లలు ఎవరో పలకరించి అభినందిస్తుంటే చిత్కళ కొద్దిగా తేరుకుంది.

ఒంటరిగా ఆటోలో ఇంటికి వెడుతుంటే చిత్కళలో తిరిగి ఆవేశం పొంగసాగింది.

ఇంటిదగ్గర దిగాక చూస్తే ఆటోకి ఇవ్వాల్సినంత డబ్బులు ఆమెవద్ద లేవు. తల్లిని అడిగి ఆటో ఫేర్ చెల్లించింది.

"ఏమిటి చిత్కళా! క్విజ్‌లో ప్రైజ్ రాలేదా?...అలా ఏడుస్తున్నావు ఏమిటి?..." తల్లి అడిగింది.



తన కళ్ళంబడి నీళ్ళు వస్తున్నాయా?...చిత్కళ కళ్ళు తుడుచుకునే ప్రయత్నం చేయలేదు. మెల్లగా జరిగినదంతా రోహిణికి చెప్పింది. "కంగ్రాట్యులేషన్స్!" అంది రోహిణి కూతురిని దగ్గరగా తీసుకుని. "డాడీ కూడా ఈరోజు త్వరగా వస్తానని అన్నారు. హోటల్‌లో భోజనంచేసి సెలబ్రేట్ చేసుకుందాం"

చిత్కళ మొహం వెలిగిపోయింది.

ఆ మర్నాడు చిత్కళ స్కూల్‌కి వెళ్ళగానే ప్రిన్సిపాల్ నుండి కబురువచ్చింది.

తమ స్కూల్‌కి కప్‌వచ్చే అవకాశాన్ని చెడగొట్టినందుకు కాస్త కోపంవచ్చినా ఇప్పుడు సాధించిన కప్‌లో తనద్వారా స్కూల్‌కి కూడా వాటా ఉన్నందుకు ప్రిన్సిపాల్ శాంతిస్తుంది అని అనుకుంది చిత్కళ.

అయితే ప్రిన్సిపాల్ రూమ్‌లోకి అడుగుపెడుతూనే జరగరానిదేదో జరగనున్నది అన్న భావన చిత్కళని చుట్టుముట్టింది.

"చిత్కళా!..." ప్రిన్సిపాల్ గొంతు చాలా సీరియస్‌గా ధ్వనించింది. "వరుసగా అయిదేళ్ళ నుండి డిస్ట్రిక్ట్ లెవల్ క్విజ్ కాంపిటీషన్‌లో మన స్కూల్‌కే కప్ వస్తున్నది. ఈ ఏడాది మాత్రం మనకి దక్కలేదు. దానికి కారణం ఎవరో తెలుసా?"

'తెలుసు... సైన్స్ టీచర్' అనుకుంది చిత్కళ మనసులో. పైకిమాత్రం ఏ భావం కనబడనీయకుండా ప్రిన్సిపాల్‌నే చూస్తూ ఉండిపోయింది.

"దానికి కారణం...నువ్వే!" ప్రిన్సిపాల్ గొంతు కరుకుగా పలికింది. "మిమ్మల్ని క్విజ్‌కి కోచ్‌చేసిన టీచర్‌కి ఎవరి బలాబలాలు ఎలా ఉన్నాయో క్షుణ్ణంగా తెలుసు. ఎవరిని తీసుకోవాలో ఎవరిని వదిలేయాలో అన్న జడ్జిమెంట్ చేయగలిగింది ఆయనే! నిన్ను టీమ్‌లో తీసుకోలేదని చెప్పి ఇంకో స్కూల్ టీమ్‌లో చేరావు. ఓకే!...పార్టిసిపేట్ చేయాలన్న ఉత్సాహంతో అలా చేశావు అని అర్థం చేసుకుంటాను. చివరిలో మన స్కూల్ టీమ్ గెలుస్తుంటే అబ్జెక్షన్‌పెట్టి ఆ అవకాశం దక్కకుండా చేస్తావా?...యు హావ్ నో స్పోర్టివ్‌నెస్. యు ఆర్‌ఏ సెల్ఫిష్ ఫెలో...యు ఆర్ ఏ బ్లెమిష్ టు ది ఇమేజ్ ఆఫ్ దిస్ గ్రేట్ విద్యారణ్య స్కూల్" అంటూ ఆవిడ క్లాస్ తీసుకుంది.

చిత్కళ బుర్ర తిరగసాగింది. ప్రిన్సిపాల్ ఎంతసేపు తనని చివాట్లు వేసిందో తను ఎలా బయటికి వచ్చిందో ఆమెకి సరిగా గుర్తులేదు. క్లాస్‌లో కూర్చునే ఓపికలేక బ్యాగ్‌తీసుకుని ఇంటికి వచ్చేసింది.

ఆ మర్నాటి నుండి అసలు నరకం మొదలయింది. క్లాస్‌లో ఎవరూ చిత్కళతో మాట్లాడటంలేదు. టీచర్స్ అంతా చిత్కళని పూర్తిగా విస్మరిస్తున్నారు. అదివరకు క్లాస్‌లో ఏ చిక్కు ప్రశ్న అయినా ఏ క్లిష్టమయిన మ్యాథ్స్ ప్రాబ్లెమ్ అయినా ముందుగా చిత్కళ వంక తిరిగి ఆమెనే అడిగేవాళ్ళు. ఇప్పుడు క్లాస్‌లో మిగిలినవాళ్ళు ఎవరూ తెలియదని తెల్ల మొహాలు వేశాక, చిత్కళ తాను చెప్పగలనని సూచిస్తూ చేయి ఎత్తే ఉంచినా చిత్కళకి

అసలు అవకాశం ఇవ్వటంలేదు. రోజురోజుకి అలా క్లాస్‌లో కూర్చోవటం పెద్ద సమస్యగా తయారయింది చిత్కళకి.

ఇంట్లో తల్లి దగ్గర కుమిలిపోయింది చిత్కళ. "ఇంకొక్క పది రోజులలో ఫైనల్ పరీక్షలు మొదలవుతాయి. ఆ తరువాత సెలవులు కదా. ఈ వారం రోజులు ఓపిక పట్టు" రోహిణి ఓదార్చింది.

"మరి వచ్చే సంవత్సరమో?" చిత్కళ బేలగా అడిగింది.

"పిచ్చిపిల్లా! అప్పటికి ఇదంతా మరిచిపోతారుగాని నువ్వేంబెంగపెట్టుకోకు" రోహిణి ధైర్యం చెప్పింది కాని చిత్కళ పడుతున్న ఆవేదన గమనించాక పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని అనుకుంది.

ఆరాత్రి భర్తతో చర్చించింది రోహిణి. "ఈ వర్రీతో చిత్కళ పరీక్షలకికూడా సరిగా తయారు అవలేకపోతున్నది..."

సుధాకర్ నవ్వేశాడు. "చిత్కళ ఇంకా ప్రిపేర్ అవాల్సిన అవసరం ఏముంది?... ఇప్పటికి ఇప్పుడు వెళ్ళి పరీక్ష రాసినా ఫస్ట్ వస్తుంది!"

భర్త అంత తేలికగా తోసేయటం రోహిణికి నచ్చలేదు. విడమర్చి చెప్పటానికి ప్రయత్నించింది.

సుధాకర్ ఆలోచనలో పడ్డాడు. "ఈ ఊళ్ళో ఇదే మంచి స్కూల్. ఈ స్కూల్‌నించి మార్చటం మంచిదికాదు..."

"వచ్చే సంవత్సరం కూడా ఇదే స్కూల్ అయితే ఇలాగే ఎవరూ మాట్లాడకపోతే దానికీ నాకూ పిచ్చి ఎక్కటం ఖాయం..." ఖండితంగా చెప్పింది రోహిణి.

"ఓపని చేద్దాం..." పది నిముషాల ఆలోచన తరువాత సుధాకర్ అన్నాడు. "హైదరాబాద్‌లో ఇల్లు కట్టాక వారంరోజులు కూడా మనం అందులో ఉండలేదు కదా... ఈసారి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్‌కి ప్రయత్నిస్తాను. స్వంత ఇంట్లో ఉండచ్చు. చిత్కళకూడా నైన్త్‌కి వస్తుంది కదా!...అక్కడ ఇంతకన్నా మంచి స్కూల్‌లో ఎడ్మిషన్ దొరుకుతుంది. ఇంటర్ మంచి కాలేజీలో చదివి ప్రొఫెషనల్ కోర్స్‌లో చేరటానికి మంచి ఛాన్స్!"

రోహిణి మొహం వెలిగిపోయింది. "అలా చేయండి. బాగుంటుంది" అంతలోనే ఏదో అనుమానం వచ్చి అడిగింది "ట్రాన్స్‌ఫర్ అంత తేలికగా అవుతుందా?"

సుధాకర్ పై సంపాదన బాగా వచ్చే ఉద్యోగంలో ఉన్నాడు. హైదరాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ అంటే అంత తేలిక కాదు. బాగా ఖర్చు అవుతుంది. అయినా కూతురి కోసం ఆ మాత్రం చేయలేకపోతే ఎలా? "ఆ బాధలు నేను పడతాను. నువ్వు మాత్రం చిత్కళకి ధైర్యం చెప్పు" సుధాకర్ అన్నాడు.

రోహిణి తల ఊపింది.

తండ్రి ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నిస్తున్నాడని తెలిసి చిత్కళ శాంతించింది. తనని



వెలివేసినట్లు ఎవరూ తనతో మాట్లాడకపోవటం చిత్కళ భరించలేకపోతున్నది. పైగా ఇందులో తన తప్పేంలేదు కూడా! చేయని పాపానికి తానెందుకు శిక్ష అనుభవించాలి?

ఆ ఊరు వదిలి వెళ్ళిపోతుంటే ఎంత రాయి చేసుకున్నా చిత్కళ మనసు మూగగా రోదించింది. చాలా ఏళ్ళుగా మంచి స్నేహితులు అనుకున్న వాళ్ళు కూడా తనకి సెండాఫ్ చెప్పటానికి రాకపోవటం చిత్కళకి మనస్తాపం కలిగించింది.

కారు ఎక్కేముందు అశ్రువులు నిండిన కళ్ళతో అన్నాళ్ళూ తామున్న ఇంటినిచూస్తూ మనసులోనే బై అనుకుంది.కారు కదలబోతుంటే "డాడీ! ఒక్కక్షణం ఆగండి! నా స్నేహితులకి బై చెప్పి వస్తాను" అంది.

హడావిడిగా కారు దిగుతున్న కూతురివంక అయోమయంగా చూస్తూ "నీ స్నేహితులు ఎవరమ్మా?" అన్నాడు సుధాకర్.

పక్కింటివైపు నడుస్తూ "అభిషేక్, అర్చన..." అంది చిత్కళ.

సుధాకర్‌కి తెలియదు కాని ఇలా అనూహ్యంగా హైదరాబాద్ మకాం మార్చటానికి తద్వారా చిత్కళ భవిష్య జీవితంలో పెనుమార్పులు సంభవించటానికి ఒక రకంగా ఆ చిన్నారి కవలలే కారణం! ఏ మాత్రం సంబంధంలేని చిన్న సంఘటనల వల్ల జీవన మార్గం చిత్రమయిన మలుపులు తిరుగుతుంది!

ఆశ్చర్యంగా ఉండచ్చుకాని చిత్కళ జీవితాన్ని గాఢంగా ప్రభావితం చేసిన చిట్టి బామ్మ, చరణ్ ఇద్దరూ చిత్కళకి హైదరాబాద్‌లోనే తటస్థపడ్డారు. చిత్కళ, చరణ్ తల మునకలుగా ప్రేమలోపడే అవకాశం కలిపించింది ఆ విధంగా అభిషేక్, అర్చనలే!

సుధాకర్ హైదరాబాద్‌లో ఇల్లుకట్టి ఆరేళ్ళుఅయింది.చాలామంచి కాలనీలో ఎప్పుడో కొన్న ప్లాట్‌లో ఇల్లు కట్టినా ఉద్యోగరీత్యా వేరే ఊరిలో ఉండటంతో ఇన్నాళ్ళూ అద్దెకిచ్చాడు.

హైదరాబాద్ రావటం చిత్కళకి ఎంతో రిలీఫ్‌గా అనిపించింది. అంతవరకూ కో ఎడ్‌లో చదివినా హైదరాబాద్‌లో గర్ల్స్ స్కూల్‌లో ఎడ్మిషన్‌దొరికింది.వేసవి సెలవులు ఇంకా నెలరోజులు ఉండటంతో ఇల్లు సర్దటంలో తల్లికి సాయంచేస్తూ గడిపింది చిత్కళ.

• • •

వారం రోజులు తరువాత ఆ ఏటి పదవ తరగతి రిజల్ట్స్ వచ్చాయి.

రెండు రోజుల తరువాత ఓ మధ్యాహ్నం చిత్కళ నిద్రలేచేసరికి రోహిణి పుల్లారెడ్డి స్వీట్లు అందించింది. "ఏమిటమ్మా స్పెషల్?" చిత్కళ అడిగింది.

"మన వెనకాల ఇంట్లో మధుసూదన్ గారు అని ఎలక్ట్రిసిటీ బోర్డ్‌లో ఇంజనీర్ ఉన్నారు. వాళ్ళ అబ్బాయికి టెన్త్‌లో నైన్టీవన్ పెర్సంట్ వచ్చిందిట. అందుకనే స్వీట్లు పంచారు" అంది రోహిణి.

తల్లి మొహంలోకి సూటిగా చూసింది చిత్కళ. "నీ కూతురు కూడా అలా అన్నేసి మార్కులు తెచ్చేసుకుంటే ఇలాగే పుల్లారెడ్డి స్వీట్లు పంచాలని కలలు కంటున్నావని నాకు అనుమానంగా ఉంది అమ్మా!...అంత ఆశపెట్టుకోకు" అంది.

రోహిణి ఖంగుతిన్నది. "అదేమిటి అలా అంటావేమిటి?...మంచి స్కూల్‌లో చేరుతున్నావు. ఆ అబ్బాయిని ఆదర్శంగా తీసుకుని అతన్ని బీట్ చేయాలి..."

చిత్కళ చటుక్కున అంది. "ఆదర్శం ఏమిటమ్మా?...అతనేమన్నా మహాత్మా గాంధీనా? ఐన్‌స్టీనా?... ఆఫ్ట్రాల్ టెంత్‌లో అయిదు వందల యాభై మార్కులు కూడా తెచ్చుకోలేదు. అతన్ని మోడల్‌గా ఉంచుకోవాలా? అయినా అతనెవరినన్నా కాపీ కొట్టాడేమో? లేకపోతే పేపర్లు దిద్దేవాళ్ళకి లంచం ఇచ్చాడేమో!?... అవన్నీ తెలియకుండా ఆదర్శంగా తీసుకోమంటావేమిటి?"

"ష్! గట్టిగా అనకు...వాళ్ళకు వినబడితే బాగుండదు" అంది రోహిణి.

తల్లితో వాదన కోసమని ఏవేవో అన్నది కాని మనసులో చిత్కళకి ఆ మధుసూదన్‌గారి తనయుడు గట్టిపిండమే అనుకుంది. "ఇంతకీ ఆ ఆదర్శ విద్యార్థి పేరు ఏమిటి?" చిత్కళ అడిగింది.

"చరణ్. పూర్తిపేరు శ్రీ చరణ్ అనుకుంటాను"

ఆ మర్నాటి పేపర్‌లో చరణ్ ఫోటో చూపించింది రోహిణి. "చూడు...మొహంలో తెలివితేటలు స్పష్టంగా కనబడుతున్నాయి"

తల్లి అన్నమాటలు చిత్కళలో ఆసక్తి కలిగించాయి. తమ ఇంటి పెరటివైపు వెళ్ళినప్పుడల్లా చరణ్ కోసం చూసేది. అతను ఎప్పుడూ కనబడలేదు. ఇంటర్‌లో చేరకుండానే అప్పటికే అతను ఐఐటి కోసం కోచింగ్‌లో చేరాడుట.ఎప్పుడు కోచింగ్‌కి వెడతాడో ఎప్పుడు వస్తాడో ఎక్కడ చదువుకుంటాడో చిత్కళకి అంతుపట్టలేదు.

ఆ సమయంలోనే ఆ కాలనీ వెల్‌ఫేర్ అసోసియేషన్‌కి ఎన్నికలు జరిగాయి. కీలకమయిన గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తుండటంతో చిత్కళ తండ్రిని ఆ ఎన్నికలలో నిలబడమని అడిగారు. అతను ఒప్పుకున్నాడు...గెలిచాడు కూడా.

నెలరోజులు గడిచాయి. చిత్కళ స్కూల్ తెరిచారు. కొత్త స్కూల్, కొత్త స్నేహాలతో చిత్కళ చరణ్ గురించి మరిచిపోయింది.అప్పుడప్పుడు రోహిణి కూతురికి అతని కబుర్లు చెప్పేది. తమ వెనకాల ఇంట్లో ఉన్న అబ్బాయి బాగా చదువుతుంటే కూతురికి ఇన్‌స్పిరేషన్‌గా ఉంటుందని భావించింది ఆమె.

"చరణ్ అసలు టీ.వీ. చూడడుట...ఇంకోవ్యాపకంలేకుండా చదువుకుంటాడుట"

"అమ్మా! జీవించటంకోసం చదవాలి కాని చదవటంకోసం జీవించకూడదనిపాపం అతనికి ఎవరూ చెప్పలేదా?..." తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో అంది చిత్కళ. పైకి అలా అన్నది కాని చరణ్‌ని చూడాలని ఆమెకీ కుతూహలంగానే ఉంది. పధ్నాలుగు దాటి పదిహేనులోకి అడుగుపెట్టబోతున్న చిత్కళ శరీరం అందాలని ఒంపులని సంతరించుకుంటుంటే అదేక్రమంలో మనసుకూడా కొంటె కోరికలకి గూడుకట్టసాగింది.

అందుకనే కాబోలు అప్పుడప్పుడు పెరటివైపు వెళ్ళి ఆ చరణ్ కనిపిస్తాడేమో అని



దొంగచూపులుచూసేది.ఆ చరణ్ అన్న కుర్రాడెప్పుడూ కనబడలేదు కాని దాదాపు చిత్కళ వయసే ఉన్న ఓ అమ్మాయి డాబాపైన తిరుగుతూ ఉండటం చాలాసార్లు చిత్కళ గమనించింది. బహుశా చరణ్‌చెల్లెలు కాబోలు అనుకుంది. ఆ అమ్మాయి కూడా చిత్కళని చూసి పలకరింపుగా నవ్వేది. అలా నాలుగయిదుసార్లు అయ్యాక ఆ అమ్మాయే చిత్కళని ఏ స్కూల్, పేరేమిటి అన్న వివరాలు అడిగింది.

ఆ అమ్మాయి సెవెంత్ చదువుతున్నదిట. పేరు అరవిందట. ఓహో చరణారవిందాలు అన్న సమాసం నుండి అన్నాచెల్లెళ్ళ పేర్లు పెట్టారు కాబోలు అనుకుంది చిత్కళ.

రెండు నెలలు గడిచినా చరణ్‌ని చూడలేకపోయింది చిత్కళ. ఎప్పుడన్నా చరణ్ గురించి కూపీలాగటానికి ఇంటి వెనకకి వెడితే కొన్నిసార్లు అరవింద కనబడేది. కావాలని పెదవులు సాగదీసి బలవంతపు నవ్వు మొహానికి అతికించి రెండు మాటలు మాట్లాడి వెనక్కి వచ్చేది. ఛీ! నాకు బుద్ధిలేదు. అతనేదో అమీర్‌ఖాన్ అయినట్లు అతన్ని చూడటానికి వెంపర్లాడిపోతున్నానేమిటి అనుకునేది.

మెల్లగా చిత్కళ చదువు రంధిలో పడింది.

ఓ రోజున టెలిగ్రాం వచ్చింది. సుధాకర్‌కి బాబాయి వరస అయ్యే ఆయన పోయాడుట. సుధాకర్ సెలవుపెట్టి ఊరు వెళ్ళాడు. పదిహేను రోజుల తరువాత చిట్టిబామ్మతో తిరిగి వచ్చాడు. పిల్లలులేని ఆవిడ మొగుడుపోయేసరికి ఒంటరిదయింది. ఆమె ఆస్తి వ్యవహారాలు సెటిల్ చేసి ఆవిడని హైదరాబాద్ తీసుకువచ్చాడు సుధాకర్.

బామ్మ వచ్చాక చిత్కళ గారాం ఇంకా పెరిగింది. రోహిణి "అత్తయ్యా! అంతగా గారాంచేస్తే అది చెడిపోతుంది జాగ్రత్త!..." అని నవ్వుతూ అన్నా ఆవిడ లెక్క పెట్టేది కాదు. "కొన్ని రోజులలో పెళ్ళి అయి ఇంకో ఇంటికి వెళ్ళాల్సిన అమ్మాయి...అక్కడ ఎలా ఉంటుందో ఏమిటో...ఇక్కడ ఉన్నన్నాళ్ళూ హాయిగా ఉండనీ..." అనేది బామ్మ.

ఆవిడ వచ్చి వంటపనులు మిగిలిన ఇంటి పనులు చూస్తున్నదని రోహిణి కాలనీలో ఉన్న స్కూల్‌లో ఉద్యోగంలో చేరింది. దాంతో చిత్కళ బామ్మతో ఎక్కువ సమయం గడిపేది. అలా ఇద్దరూ బాగా దగ్గరయ్యారు. సున్నుండలు, కజ్జికాయలు, చేగోడీలు లాంటివి ఆవిడ చాలా రుచిగా చేసేది. చిత్కళ స్కూల్ నుండి వచ్చేసరికి ఏదో కొత్త వంటకంతో ఆమె తయారుగా ఉండేది. బామ్మ వచ్చాక చిత్కళ చరణ్ గురించి దాదాపు మరిచిపోయింది.

ఓ రోజున బామ్మ "రేపు అట్లతద్దె!" అంది.

"అంటే?" అడిగింది చిత్కళ.

"అయ్యో తల్లీ! అట్లతద్దె తెలియదా?...[illegible] మీ అమ్మకి అయినా అది గుర్తు ఉందా?..." అన్నదామె.

"ఇక్కడ అవన్నీ ఎలా కుదురుతాయి అత్తయ్యా?! అయినా ఇక్కడ హోలీ అనీ రాఖీ అనీ వేరేవేరే పండుగలు చేసుకుంటాం కదా..." అంది రోహిణి స్తోత్రం చెబుతున్నట్లు.

అయితే బామ్మకి పాఠం వినటంకంటే చిత్కళకి అట్లతద్దె డిమాన్‌స్ట్రేషన్ ఇవ్వాలన్న ఉబలాటం ఉంది. దొడ్లో మామిడిచెట్టుకి ఉయ్యాల కట్టించింది. రాత్రి గోరింటాకు స్వయంగా రుబ్బి చిత్కళకి పెట్టింది.

"బామ్మా! నాకు చాలా హోమ్‌వర్క్ ఉంది. చేతులకి గోరింటాకు ఉంటే ఎలా చేయాలి?" అంటూ గోలచేసింది చిత్కళ.

"మర్నాడు అట్లతద్దె పెట్టుకుని అంతలేసి హోమ్ వర్క్ ఇవ్వటానికి మీ టీచర్‌కి బుద్ధిజ్ఞానం లేవా?..." బామ్మ నిలదీసింది.

చిత్కళనవ్వింది. "మాది క్రిస్టియన్ నన్స్ నడిపే స్కూల్ బామ్మా!...ఇలాంటి పండుగల గురించి వాళ్ళకేం తెలుస్తాయి?"

తెల్లవారుఝామున నాలుగు గంటలకి లేచి పొట్లకాయ కూర, గోంగూర పచ్చడి, పెరుగుతో అన్నం తినటం ఆ తరువాత ఉయ్యాల ఊగటం గమ్మత్తుగా అనిపించింది చిత్కళకి. అలా తెల్లవారుఝామున లేచినప్పుడు...లేచినందుకే...కనబడ్డాడు చరణ్.

• • •

మంకీ క్యాప్ ఫుల్ స్వెటర్‌తో ఆస్ట్రోనాట్‌లాగా తయారయిన చరణ్‌ని అతని తండ్రి అయిదు గంటలకి స్కూటర్‌పైన కోచింగ్‌కి తీసుకువెడుతున్నాడు. అయిదునుండి తొమ్మిది వరకూ కోచింగ్...ఆ తరువాత కాలేజ్. కాలేజ్‌నుండి వచ్చి భోజనంచేసి కొంతసేపు పడుకుని మళ్ళీ రూమ్ కదలకుండా చదవటం...తిరిగి బయటి ప్రపంచం చూసేది తెల్లవారుఝామునే...ఇదీ చరణ్ దినచర్య.

అందుకనే అతని దర్శనం అంతవరకూ చిత్కళకి కలగలేదు.

మామిడిచెట్టు బాగా ఎత్తుగా ఉండటంతో ఉయ్యాలలో ఈ చివరి నుంచి ఆచివరి వరకు ఊగగలిగింది చిత్కళ. ఇంటికి ఓ మూలగా ఉన్న మెట్లగదిలో చరణ్ చదువుకు ఏర్పాటు చేశారు. చల్లగా ఉంటుందని డిస్టర్బెన్స్ ఉండదని. ఆ గదికి ఓ కిటికీ ఉంది కాని అది చిత్కళ వాళ్ళ పెరడులో గులాబీ చెట్లకి అవతలగా ఉన్న జామచెట్టువైపు ఉంది.చిత్కళ ఎప్పుడూ గులాబీచెట్లు దాటి వెళ్ళకపోవటంతో ఆ కిటికీలోంచి చూడలేదు.

ఉయ్యాలలో ఊగుతున్నప్పుడు చిత్కళకి ఆ కిటికీలోంచి చరణ్ స్టడీరూమ్ స్పష్టంగా కనబడింది. అంతే కాదు ఉయ్యాల బాగా పైకివెళ్ళినప్పుడు చరణ్ ఇంటిముందున్న గేట్‌కూడా చిత్కళ దృష్టిపథంలోకి వచ్చింది. చరణ్‌ని అతని తండ్రి స్కూటర్‌పైన తీసుకు వెళ్ళటం అలా చూసింది చిత్కళ. అక్టోబర్ చలికి అతను ధరించిన మంకీక్యాప్‌నే అతనికి ముద్దుపేరుగా పెట్టుకుంది చిత్కళ.

అతన్ని మళ్ళీ చూడాలని కొంత, ఉయ్యాల ఊగాలని కొంత ఆ మర్నాడు కూడా తెల్లవారుఝామున లేచింది చిత్కళ.

ఉయ్యాల టైంపాస్‌గా మారింది.అంతేకాదు ఉయ్యాల ఊగుతూ చదవటం మహా



గొప్పగా ఉంటుందని పరిశోధించి తెలుసుకుంది.

ఊగుతూ తింటే జంతికలు ఇంకా రుచిగా ఉంటాయని కూడా తెలుసుకుంది.

అలా ఓ ఆదివారం నాడు హిస్టరీ చదువుతూ వేగంగా ఊగుతున్నప్పుడు చరణ్‌ని మంకీ క్యాప్ లేకుండా మొదటిసారి చూసింది.

ఉయ్యాల కొద్దిగా పైకి వెళ్ళినప్పుడు స్టడీరూమ్ కిటికీలోంచి దీక్షగా చదువుతున్న చరణ్ ఫ్లాష్‌లాగా కనబడ్డాడు. ఆ తరువాత ఉయ్యాల కిందకి రావటంతో ఆ సీన్ మాయమయిపోయింది. అతన్ని సరిగా పరికించే విధంగా ఊగటం ఎలా అని కనుక్కోవటానికి ఆమె కొంత శ్రమపడాల్సి వచ్చింది. అతను ఎక్కువసేపు కనబడాలంటే ఎంత వేగంగా ఊగాలో కొన్ని ప్రయోగాల తరువాత కాని ఆమెకి పట్టుపడలేదు.

చిత్కళ అప్పుడు తెలుసుకున్న విషయాలు ఆమెని ఆశ్చర్యపరిచాయి.

ఆమె గమనించినంతసేపు అంటే దాదాపు రెండున్నర గంటలసేపు అతను కుర్చీలోంచి కదలకుండా రాసుకోవటంలోనూ చదువుకోవటంలోనూ నిమగ్నమయివున్నాడు. చిత్కళ అయితే అరగంట చదివితే పదినిముషాలు బ్రేక్ తీసుకుంటుంది మరి. అమ్మో! ఇంత బాగా చదువుతాడు కాబట్టే టెంత్‌లో మంచి ర్యాంక్ వచ్చింది. ఈ లెక్కన ఐఐటిలో కూడా సీట్ సాధిస్తాడు. మంకీ క్యాప్ మంచిబాలుడే! అనుకుంది. అతన్ని అలా చూడటం చిత్కళకి సరదా అయిపోయింది.

ఓ వారం పదిరోజులు గడిచాయి. ఒకనాడు చరణ్ ఉయ్యాల ఊగుతున్న చిత్కళని చూశాడు.అంతేకాదు ఆఅమ్మాయి తననిచూడటానికే ఊగుతున్నదని గమనించాడు.

ఒకప్పుడు సైన్స్‌పాఠంలో భూమి గుండ్రంగా ఉంది అని చెప్పటానికి ఉదాహరణగా... సముద్రపు ఒడ్డుకి వెళ్ళుము దూరము నుండి వచ్చుచున్న ఓడని చూడుము ముందుగా పొగ, పిమ్మట పొగగొట్టం, ఆ తరువాత తెరచాప, చివరగా ఓడ అంతా కనిపిస్తుంది. అని రాసినట్లు ఆమె ఊగుతున్నప్పుడు ముందుగా నెయిల్ పాలిష్ వేసుకున్న గోళ్ళతో ఆకర్షణీయంగా ఉన్న ఆమె తెల్లటి పాదాలు ఆ తరువాత పిక్కలపైకి వెడుతున్న వెండి పట్టీలు, ఆ తరువాత నడుం భాగం చివరిగా చూస్తున్నట్లు తెలియకూడదు కాబట్టి ఓరగా చూడటంతో విశాలమయిన కళ్ళతో అందంగా ఉన్న ఆమె వదనం. వరసగా కనపడటం అతన్ని ఎంతగానో ఆకర్షించింది.

ఈక్వేషన్స్ బట్టీపట్టటం కంటే చిత్కళని చూడటం బెటర్ అన్న కుతూహలం పెరిగింది. దాంతో చదివే సమయంలో కొంతసేపు ఆమెని చూడటానికి కేటాయించాడు.

చరణ్ తనని చూస్తున్నాడని చిత్కళ వెంటనే పసికట్టింది. చిక్కు ఏమిటంటే అతను తనలాగా పక్కచూపులూ, ఓరచూపులూ చూడటంలేదు.సూటిగా ఆబగా చూస్తున్నాడు! తనేమో ఎప్పుడో ఏడాది క్రితం కొనుక్కున్న చుడీదారుని- ఇస్త్రీ లేక నలిగిఉన్న చుడీదారుని వేసుకుని తల అయినా సరిగా దువ్వుకోకుండా ఉయ్యాల ఎక్కింది! ఛా!

ఆ మర్నాడు కొత్త డ్రెస్ వేసుకుని చక్కగా తయారయి ఉయ్యాల ఎక్కింది.

ఆ తరువాతి రోజు చేతిగోళ్ళకీ కాలి గోళ్ళకీ నెయిల్ పాలిష్ చక్కగా పూసుకుని, తల్లి వాడే లిప్‌స్టిక్ పలచగా అద్దుకుని మరీ ఉయ్యాల ఎక్కింది.

అలా ప్రతిదినం కొత్త మేకప్ చేసుకోసాగింది.

నాలుగయిదు రోజులు గడిచాక ఆమెకి ఓ విషయం తట్టింది. తనని అతను గమనించటం, దాన్ని తను గమనించటం అది ఇద్దరూ గమనించి చాటుగా ఓరగా చిరునవ్వులు విసురుకోవటం అన్నీ బాగానే వున్నాయి. ఈ రెండు రోజులలో తన హాఫ్ ఇయర్లీ పరీక్షల ప్రిపరేషన్ కుంటుపడింది. చేతిలో పుస్తకం పెట్టుకున్నా ఊగినంతసేపు ధ్యాస చదువుపైన ఉండటంలేదు. ఈ లెక్కన ర్యాంక్ వస్తుంది అని అందరూ భావిస్తున్న చరణ్ చదువుకూడా దెబ్బతినే అవకాశం ఉంది కదా!

ఆ ఆలోచన వచ్చాక చిత్కళ ఉయ్యాల ఎక్కలేదు. ఎందుకో టీ.వీ చూడబుద్ధి అయ్యేదికాదు. బామ్మతో మాట్లాడుతున్నా ఏదో పరధ్యానంలో ఉండేది. మామూలుగా టేబుల్ ముందు కూర్చుని చదువుదామని అనుకుంటే తలకి ఎక్కేదికాదు. ఊగుతూ చదవటం అంతగా అలవాటు అయింది అనికాదు కాని చరణ్‌ని చూడటం అనే చిలిపిపని చేయకపోవటంతో మనసు మనసులో స్థిరంగాలేదు.

ప్రతిరోజూ ఉయ్యాలవరకూ వెళ్ళటం ఆ తరువాత ఛా! వద్దు...నా మూలంగా అతని ఏకాగ్రత దెబ్బతింటుంది. ఇక ఉయ్యాల ఊగను అనుకుని వెనక్కి వచ్చేసేది. ఏదో తెలియని బెంగ ఆమెని నిలువునా ఆవరించి కుదిపేయసాగింది.

ఇలా నాలుగు రోజులు అవస్థపడ్డాక జస్ట్...జస్ట్ అయిదు నిముషాలో పది నిముషాలో ఉయ్యాల ఊగుతాను చరణ్ కిటికీవైపు ఒకే ఒకసారి కన్నెత్తి చూస్తాను. ఆ తరువాత నా మానాన నేను చదువుకుంటాను...అనుకుంది. అతనివంక తను చూడకపోతే అతనూ తనని చూడడు కదా!

అనుకున్నట్లుగానే అతని కిటికీ వంక ఒక్కసారే చూసింది. మొదటి నిముషంలో! కిటికీలోంచి రూమ్ సరిగా కనబడలేదు. ఒక్కసారే చూస్తాను అనుకున్నాను కదా అని తల తిప్పుకుని ఊగసాగింది. మూడో నిముషంలో మనసు పీకింది. ఇంకోసారి కిటికీవైపు చూడకుండా నిగ్రహించుకోలేకపోయింది. ఈసారి స్పష్టంగాకనబడింది. చరణ్ స్టడీరూమ్‌లో లేడు. కుర్చీ ఖాళీగా ఉంది. బల్లపైన మాత్రం పుస్తకాలు ఉన్నాయి.

అదే మొదటిసారి చరణ్ లేకుండా ఆ రూముని కుర్చీని ఆమె చూడటం. బల్లపైన ఉన్న అన్నిపుస్తకాలు మూసి ఉంటే అతను చాలాసేపటి వరకు మళ్ళీ స్టడీరూమ్‌లోకి రాడు కాబోలు అనుకుంది. ఒక్క పుస్తకం మధ్యకి మడిచి ఉన్నట్లుంది కదా అన్న సందేహం కలిగింది. ఒక్క పుస్తకమన్నా తెరిచి ఉందా లేదా అన్న విషయం రూఢి చేసుకోవటానికి ఆమె ఇంకో నాలుగయిదు సార్లు అటు చూడాల్సి వచ్చింది.



నిజమే...ఒక్క పుస్తకం తెరిచే ఉంది! అది దాదాపు వెయ్యి పేజీలు ఉన్న లావాటి ఫిజిక్స్ పుస్తకం.

అంతేకాదు పెన్‌క్యాప్ తీసి ఉంది అని ఇంకో రెండు నిముషాల తరువాత పసికట్టింది. అంటే అతను దగ్గరలోనే ఉన్నాడన్నమాట. ఏ క్షణాన అయినా అతను రూమ్‌లోకి వచ్చే అవకాశం ఉందన్నమాట!

అతనికోసం ఎదురుచూస్తూ చిత్కళ అలా ఊగుతూనే ఉంది. చేతిలో అంతవరకూ అలంకారప్రాయంగా ఉన్న ఇంగ్లీష్‌పుస్తకం ఒళ్ళోంచి జారి కిందపడటం చిత్కళకి తెలియదు.

ఎంతకీ చరణ్ కనబడకపోయేటప్పటికి చిత్కళకి ఏదో పోగొట్టుకున్నట్లుగా ఉంది.

ఎలాగూ మాట తప్పటం జరిగింది కాబట్టి ఆమె ఊగుతూనే ఉంది.

ఈరోజు చరణ్‌కి ఏమయింది? ఎందుకు కనబడటంలేదు?

తదేకంగా అతని రూమ్ వైపే చూస్తున్న చిత్కళ హఠాత్తుగా గమనించింది. వాళ్ళ కాంపౌండ్ గోడ అనుకుని నిలబడి చరణ్ తనవంకే చూస్తున్నాడు.

ఆమెకి ఉవ్వెత్తున సిగ్గు ముంచుకు వచ్చింది.

తను అలా అతని గదిలోకి చాలాసార్లు తొంగితొంగి చూడటం అతనికంటపడింది అన్నమాట!...ఇంకేముంది? తన బండారం బట్టబయలయింది అనుకుంది.

ఒక్క ఉదుటున ఉయ్యాల నుండి దూకింది.

కంగారులో ఉయ్యాల వేగాన్ని పట్టించుకోకపోవటంతో చిత్కళ బలంగా నేలపైకి పడింది.

అసలే చిత్కళకి తలమునకలయ్యే సిగ్గుగా ఉంది. మామూలుగా ఉయ్యాల దిగి ఉంటే తల ఎత్తకుండా చరణ్ వంక చూడకుండా గబగబా ఇంట్లోకి వెళ్ళిపోయేది.

కాని తొందరపాటుతో దూకటంతో చిత్కళ కాలు బెణికింది. వెంటనే లేచి నిలబడలేకపోయింది.

తలవంచుకుని నేలమీదనే కూర్చున్నా అతను కదలలేదని ఇంకా అక్కడే నుంచుని ఉన్నాడని ఆమెకి అనిపించింది. దాంతో సిగ్గు ఇంకా పెరిగింది. ఇదేమిటి? ఇతనికి ఇలా దొరికిపోయానేమిటి? అనుకుంది.

ఇంతలో ధైర్యం వచ్చింది. అసలు తనెందుకు తల ఒంచుకోవాలి? తానేం తప్పు చేయలేదు కదా? లేవటానికి సపోర్ట్ కోసం వెతుకుతున్న నెపంతో అటూ ఇటూ చూసింది.

కాంపౌండ్ వాల్ పైన ఒక చేయి ఆనించి, ఇంకో చేతితో గడ్డం నిమురుకుంటూ నిలబడి ఉన్నాడు చరణ్ చిత్కళనే కాదు ఆమె ఇంటిని ఆ చుట్టుపక్కల ఉన్న పరిసరాలని వేటినీ పట్టించుకోకుండా ఏదో ఆలోచనలో ఉన్నట్లు పోజ్‌పెట్టాడు.

ఆపిల్ కింద పడటం చూసిన న్యూటన్ కూడా ఇంత గొప్పగా పోజ్‌పెట్టి ఉండడు అనుకుని నవ్వుకుంది చిత్కళ.

ఆమె మెల్లగా లేవబోతుంటే చరణ్ ఆమెవంక తిరిగాడు.

అతని మొహంపైన చిరునవ్వు మెరిసింది. చరణ్ చేతిలో ఓ కాయితం ఉంది.

కాయితాన్ని ఉండగా చేసి చరణ్ యథాలాపంగా తమ దొడ్లోకి జారవదలటం చిత్కళ చూసింది.

ఆమె తేరుకునేలోగా చరణ్ వెళ్ళిపోయాడు.

చిత్కళ అటూ ఇటూ చూసింది. ఎవ్వరూలేరు. చరణ్ వాళ్ళ డాబాపైన కూడా ఎవరన్నా ఉన్న జాడలేదు. అరవింద ఉండి ఉంటే తన పరువు పోయేదే! చిత్కళ అప్రయత్నంగా గుండెలపైన చేయివేసుకుంది.

అమ్మయ్యా! అయితే ఈ వ్యవహారాన్ని ఎవరూ గమనించి ఉండరు అని మెల్లగా స్థిమితపడింది.

లేచి నుంచోగానే కాలు విలవిలలాడింది. పంటితో పెదవిని నొక్కిపెట్టి బాధని దిగమింగింది చిత్కళ.

నాలుగయిదు అడుగులు కుంటుతూనే నడిచింది.

నడుస్తుంటే నొప్పి తగ్గినట్లయింది.

ఉయ్యాలతాడు ఊతంగా పట్టుకుని కొంతసేపు నిలబడింది.

ఇంకోసారి నాలుగు వైపులా, డాబాపైకి చూపులు పాకించింది. ఎవరూ లేరు అని రూఢి చేసుకుంది.

గులాబీ మొక్క దగ్గరకి వెళ్ళి పువ్వుని పరీక్షిస్తున్న ఆడ న్యూటన్‌లాగా ఇంకో నిముషం గడిపింది.

చరణ్ పడేసిన కాయితం ఉండని చూస్తుంటే ఆమె ఊపిరి బరువయింది.

అదురుతున్న గుండెతో వెళ్ళి ఆ కాయితం ఉండ అందుకుంది. మరుక్షణం నైటీలో వక్షం వద్ద భద్రంగా దాచింది.

గరుకుగా తాకుతున్న కాయితం గుండెవేగాన్ని ఉధృతం చేసింది.

కాలి నొప్పిని విస్మరించి పరుగున తన గదిలోకి వెళ్ళింది.

గదిలో బామ్మ ఉంది. చిత్కళ చిన్నగా నిట్టూర్చింది. బామ్మ కాయితం ఆచూకీ పట్టేస్తుందా అన్న అనుమానంతో తన గుండెల వంక చూసుకుంది.

బామ్మ ఏదో ఆలోచనలో ఉంది. "కళా! దీపావళి వస్తున్నది కదా... ఏ స్వీట్ చేయమంటావు?..." అని అడిగింది.

"నీ ఇష్టం బామ్మా!..." అంది అన్యమనస్కంగా చిత్కళ.

"నాకే స్వీటూ ఇష్టం ఉండదే. ఎందుకంటే డయాబెటిస్ కదా!" అంది బామ్మ నవ్వుతూ. "నువ్వులు వేసి నేతి అరిసెలు చేస్తాను. నువ్వు ఆ వెరయిటీ ఎప్పుడూ తిని ఉండవు. ఇప్పుడే వెళ్ళి బియ్యం తడుపుతాను..."



వంటింటి వైపు వెడుతున్న బామ్మని చూస్తూ థాంక్ యూ బామ్మా అనుకుంది చిత్కళ.

తలుపు మూసి నైటీలోంచి కాయితం తీసింది.

చరణ్ తెలివి ఒక్క ర్యాంక్‌లకే పరిమితం కాలేదు. ప్రేమలేఖని గోప్యంగా రాయటంలో కూడా తెలివితేటలని ప్రదర్శించాడు.

అతను రాసుకున్న వెయ్యెన్నొక్క ఈక్వేషన్స్ ఉన్న కాయితం అది. ఒక మూలగా చిన్న బాక్స్‌లో

డియర్ ఎస్ హెచ్ ఎమ్,

నాలుగు రోజులుగా ఊగటం లేదేమిటి?

అని మాత్రం ఉంది.

అది తనని ఉద్దేశించి రాసినది అని వెంటనే చిత్కళకి అర్థం అయింది. అయితే ఎస్ హెచ్ ఎమ్ అంటే ఏమిటో తెలియలేదు.

ఆ కాయితాన్ని తాను కాకుండా ఇంకెవరో చేజిక్కించుకున్నా దొరికిపోకుండా మంచి జాగ్రత్త తీసుకున్నాడే అనుకుంది చిత్కళ.

తను కూడా తక్కువ తిన్నదా...తనూ అంత గొప్పగానూ అంత చప్పున అర్థం అవని కోడ్‌లో ఉత్తరం రాస్తుంది.

చిత్కళ పెన్ అందుకుంది.

ఎలా రాయాలా అని ఆలోచిస్తూనే కాయితం అంతా మసజసతతగ అని భరన భభరవ అనీ ఛందస్సుతో నింపింది.కొద్దిమేర మాత్రం తన సందేశం రాయటానికి అనువుగా ఖాళీగా ఉంచింది.

డియర్ ఎమ్ సి,

నాకూ ఊగాలనే ఉంది గాని నీ చదువు డిస్టర్బ్ అవుతుందని భయంగా ఉంది.

అవునూ ఎస్ హెచ్ ఎమ్ అంటే ఏమిటి?

అని రాసింది.

కాయితాన్ని ఉండగా చేసి గుప్పిటలో ఉంచుకుని రూమ్ తలుపు తీసింది.

చిత్కళని చూడగానే బామ్మ అంది "కొన్ని సొజ్జప్పాలు కూడా చేస్తానే!..."

బామ్మపైన ప్రేమ పొంగుకువచ్చింది. చిత్కళ వెళ్ళి ఆవిడని హత్తుకుని "ఐ లవ్ యూ బామ్మా..." అంది. ఉయ్యాల వేయటం అన్నది ఆవిడ ఐడియానే కదా!

పెరటిలోకి వెళ్ళి మామిడిచెట్టు బాగా ఊగేంత అదురుతో ఉయ్యాలలో కూర్చుంది. చెట్టుపైన కూర్చున్న పావురం రెక్కలు టపటపలాడిస్తూ ఎగిరింది.

చరణ్‌కి ఆ ఇండికేషన్ చాలనుకుని తృప్తిపడి ఊగటం మొదలుపెట్టింది చిత్కళ.

ఆమె ఊహించినట్లుగానే చరణ్ ఎలర్ట్ అయ్యాడు.

ఉయ్యాల ఊగుతూనే జాగ్రత్తగా ఆ కాయితం ఉండని తన ఒళ్ళో ఉంచుకుంది. కాంపౌండ్ వాల్‌ని సమీపిస్తున్నప్పుడు ఒడిలోంచి కాళ్ళమీదుగా ఆ ఉండని చరణ్ వాళ్ళ ఇంట్లో జారవిడిచింది.

అతని మొహం ఆనందంతో వెలిగిపోవటం చిత్కళ కంటపడింది.

చరణ్ ఆ ఉత్తరాన్ని అందుకునే సమయంలో తాను తప్పుకోవటం మంచిది అనుకుని, ఇంట్లోకి వెళ్ళిపోయింది చిత్కళ.

జవాబు తొందరగానే వచ్చింది.

డియర్ ఉ పా,

నాకు ఏ రకమయిన డిస్టర్బెన్స్ లేదు.

నువ్వు కనబడకపోతేనే బాగుండదు.

ప్లీజ్. ఉయ్యాల మానకు...ప్లీజ్.

ఎస్ హెచ్ ఎమ్ అంటే సింపుల్ హార్మోనిక్ మోషన్...ఒకే విధంగా ఊగే లోలకము మొదలయినవాటి చలనం గురించి చెప్పే ఫిజిక్స్ పాఠం. నువ్వు ఊగటం మొదలుపెట్టినప్పుడు నేను ఆ పాఠం చదువుతున్నాను. నిన్ను చూస్తూ చదివితే కష్టమయిన ఆ థియరీ, ఈక్వేషన్స్ అన్నీ సులువుగా నేర్చేసుకున్నాను.

ఇంతకీ ఎమ్ సి అంటే ఏమిటి?

చిత్కళ నవ్వుకుంది. అబ్బాయి అబద్ధాలు బాగా చెప్పేస్తున్నాడు. నోరు తెరుచుకుని తనని చూస్తూ కూర్చుంటే పాఠాలు బాగా అర్థం అవుతాయా?...చదువుపైన శ్రద్ధ చూపించమని మందలించాలి అనుకుంది.

చిత్కళ జవాబు త్వరగానే తయారుచేసింది.

డియర్ కు కు,

అయితే రోజుకి గంట మాత్రమే ఊగుతాను. సరేనా?

నా మూలంగా నీ మార్కులు తగ్గకూడదు. గుర్తుంచుకో.

ఎమ్ సి అంటే చెబుతాను కోపం తెచ్చుకోకు. మంకీ క్యాప్!

మరీ ఆ కలర్ క్యాప్ ఏమిటి! ఇంకో రంగు దొరకలేదా?

ఉ పా అంటే ఏమిటో రాస్తావు కదూ...

ఈసారి కాయితం ఉండని కాలి వేళ్ళకింద అదిమి పట్టుకుని చరణ్ వాళ్ళ కాంపౌండ్ వాల్ మీదుగా విసిరింది చిత్కళ.

తను వేసుకునే క్యాప్ గురించి చిత్కళ జోక్‌చేయటంతో చరణ్ కూడా ఆమెని ఏడిపించే చనువు తీసుకున్నాడు.

డియర్ ఒకాప,

ఇన్నిరోజులు మంకీ క్యాప్‌కి ఆ పేరు ఎందుకు వచ్చిందో నాకు తెలియదు.ఇప్పుడే



తట్టింది. మంకీలను ఆకట్టుకుంటాయి కాబట్టి ఆ పేరు వచ్చిందన్నమాట.

ఉపా అనగా ఉయ్యాల పాపాయి అని కనుక్కోలేకపోయావా?

కుకు అంటే పక్షి కదా! ఆ పేరుతో నన్ను ఎందుకు పిలుస్తున్నావు?

ఒకాప అంటే ముందుగానే చెబుతున్నాను...ఒక కాలికే పట్టా...నీ రెండో పట్టా ఏమయింది?

తన కాలికి ఉండాల్సిన వెండి పట్టా లేదని ఎక్కడో పడిపోయిందని అప్పుడు గమనించింది చిత్కళ.

ఎక్కడ పడిపోయింది?

చిత్కళ ఇల్లంతా వెతికింది. ఎక్కడా దొరకలేదు.

చరణ్ ముందుగా హెచ్చరించి మంచిపనే చేశాడు కాని పట్టా మాత్రం దొరకలేదు. పట్టా పోతే ఊగటం వల్లనే పోయిందని తీర్మానించి తల్లి ఉయ్యాల విప్పించటం ఖాయం! చిత్కళ గుండె ఆగినంత పని అయింది.

రూమ్‌లో మంచంకింద పడిపోయిందేమో అని చిత్కళ ఒంగుని చూస్తుంటే బామ్మ వచ్చింది. "ఏమిటి కళా! దేనికోసం వెతుకుతున్నావు?" బామ్మ అడిగింది.

అబద్ధం ఎలా చెప్పాలో వెంటనే స్ఫురించింది. "కొత్తగా అయిదు రూపాయల కాయిన్స్ వస్తున్నాయి కదా బామ్మా! అది ఎక్కడో పారేసుకున్నాను. దాని కోసం..."

"వస్తువులు కనబడాలంటే ఏం చేయాలో తెలుసా? కార్తవీర్యార్జున మంత్రం చదవాలి"

పట్టా దొరుకుతుందన్న ఆశ పోయింది చిత్కళకి. నేలపైనే బాసింపట్టు వేసుకుని కూర్చుంది. "ఆ మంత్రమే ఎందుకు బామ్మా?"

"కార్తవీర్యార్జునుడికి వేయి చేతులు...ఆయన ప్రసన్నుడయి ఆ వేయి చేతులతో వెతికి మనకు అందే ఏర్పాటు చేస్తాడు..."బామ్మ ధీమాగా అంది.

బామ్మకోసం కాసేపు నటిస్తే తప్పేముంది అనుకుంది చిత్కళ. "ఆ మంత్రమేమిటో చెప్పు బామ్మా!..."

చిత్కళ కళ్ళు మూసుకుని ఆ మంత్రాన్ని పఠించటం చూసి తృప్తిగా తల ఊపింది బామ్మ. "ఇప్పుడు వెతుకు. ఇట్టే కనబడుతుంది"

చిత్కళ మంచం కింద చూసింది...లేదు. అలమార కింద చూస్తుంటే చేతికి ఏదో గట్టిగా తగిలింది. ఒంగుని చూసింది. ఏదో తెల్లగా మెరుస్తున్నది. ఆత్రంగా దాన్ని తీసి చూసింది. ఇరవై పైసల అల్యూమినియం బిళ్ళ.

"దొరికింది కదూ?..." బామ్మ ఉత్సాహంగా అడిగింది.

ఆవిడ సంబరాన్ని పాడుచేయటం ఎందుకు అని చిత్కళ తల ఊపింది.

"ఏదీ?...నాకు చూపించు" అంది బామ్మ.

దొరికిపోయాను అనుకుంటూ బామ్మదగ్గరకి వెళ్ళింది చిత్కళ.

అందుకోవటానికి ఎడంచేయి ముందుకు తెచ్చింది బామ్మ.

ఇరవై పైసల కాయిన్‌ని చేతిలో దాచి బామ్మవేపు చాచింది చిత్కళ.

దాన్ని అందుకోకుండా కుడిచేయి గుప్పిట విప్పింది బామ్మ. అందులో తళతళ లాడుతూ వెండిపట్టా ఉంది!

ఆనందం ఉక్రోషం ఆశ్చర్యం ముప్పేటగా తన్నుకు రాగా బామ్మని అల్లుకు పోయింది చిత్కళ.

అంత కథ నడిచింది కాబట్టి ఈసారి జవాబు ఇవ్వటానికి చాలా సమయం తీసుకుంది చిత్కళ.

డియర్ మంబా,

పట్టా గురించి వార్న్ చేసినందుకు థాంక్యూ... అయినా నీకు నా కాళ్ళు చూడటం తప్ప ఇంకో పని లేదా?..ఇలా అయితే ఐఐటిలో సీట్ రావటం కష్టం కుర్రోడా!

కుకు అంటే కుర్చీలో కుర్రాడు అని... కూర్చుని కూర్చుని నీకు నడుం నొప్పి రాదా? అయినా నాకు ఎందుకులే. ఎంత నడుం నొప్పి అయితే అంత మంచి ర్యాంక్ వస్తుంది కాబోలు. ఇలాగే కష్టపడితే సీట్ గ్యారంటీ బాబూ!

అడిగితేనే మంబా గురించి చెబుతాను.

రెండురోజుల తరువాత రిప్లయి వచ్చింది.

డియర్ ఆపాము,

నువ్వు ఇంటర్‌కి వస్తే నడుం నొప్పి గురించి నీకే తెలుస్తుంది కాబట్టి నేను రాయటం లేదు.

మొన్న మూలకాల ఎలక్ట్రానిక్ కాన్ఫిగరేషన్ బట్టీ వేస్తున్నావు. అది మంచి విధానం కాదు. జాగ్రత్తగా గమనిస్తే ఒక పద్ధతి కనిపిస్తుంది. ఆ పద్ధతిని అర్థంచేసుకుంటే ఇలా బట్టీ వేయాల్సిన అవసరం ఉండదు. అలా అయితే ఎక్కువ రోజులు తప్పులేకుండా గుర్తు వుంటుంది.

నిన్న నీ హెయిర్‌స్టయిల్ అదిరింది! కాళ్ళే కాదు తల కూడా చూస్తున్నానని నీక్కు తెలిసిందా ఇప్పుడు? మంబా అంటే మంకీ బాయ్ అయితే నీతో మాట్లాడను.

చిత్కళ కూడా రెండు రోజుల తరువాత పెద్ద ఉత్తరం రాసింది.

డియర్ పిచ్చి,

అహ్హహ్హహ్హహ్హ అహహహ్హహ్హఅహ్హ...అంటే అలా నవ్వుకున్నాను అన్నమాట. ఎందుకో తెలుసా...మంబా అంటే మంచి బాలుడు అని...నువ్వు అనుకున్నది కాదు.ఇంకా నవ్వు వస్తున్నది తెలుసా?

నీ సలహా బాగా పనిచేసింది.క్లాస్‌మొత్తంమీద తప్పులేకుండా కాన్ఫిగరేషన్ గుర్తు



వుంచుకున్నది నేనే. థాంక్యూ!

మంచి బాలుడు అని సంబోధించినందుకు మంకీబాయ్ లాగా ఆడపిల్ల హెయిర్ స్టయిల్ గురించి కామెంట్ చేస్తావా?...తల, కాళ్ళు కాబట్టి ఊరుకుంటున్నాను. ఇంకా ఏమన్నా పిచ్చి కామెంట్స్ చేస్తే చంపేస్తా!

నాతో మాట్లాడనని అన్నావు. మనం ఎప్పుడు మాట్లాడుకున్నాము?...ఉత్తరాలు రాసుకోవటమే కదా!

ఆపాము అంటే నాకు తెలిసిపోయింది.ఆపాదమస్తకంకదూ? తెలుగులో మాకూ ఆ పాఠం ఉంది. నీ పరీక్షలు దగ్గరికి వస్తున్నట్లున్నాయి... బాగా చదువు. మార్కులు బాగా రాకపోతే కిటికీలోంచి రాళ్ళువేసి కొడతా జాగ్రత్త!

పిచ్చి అంటే పిచ్చి మాత్రమే...ఇంకేవీ కాదు.

• • •

ఇలా ఉత్తరాలు రాసుకుంటూ ఇద్దరూ ఎంతో దగ్గరయ్యారు. ఒకరి గురించి ఇంకొకరు తెలుసుకున్నారు. సలహాలు ఇచ్చుకున్నారు. జోక్స్ రాసుకుని నవ్వుకున్నారు...నవ్వులు పంచుకున్నారు. అయితే ఆశ్చర్యంగా ఈ గమ్మత్తయిన సంభాషణతో ఇద్దరి చదువులు ఏమాత్రం దెబ్బతినలేదు. వాళ్ళకి ఇది ఓ సరదాలాగా ఆహ్లాదకరమయిన ఆటవిడుపు లాగా ఉండి మంచి టానిక్‌లాగా పనిచేసింది.

ఓ రోజున బామ్మ కూరలు తేవటానికి షాప్‌కి వెళ్ళి వస్తూ అరవిందని వెంటపెట్టుకుని వచ్చింది.

"కళా! ఈ అమ్మాయి ఎవరో తెలుసా? మన వెనకాల ఇంట్లోనే ఉంటారు..." అంది బామ్మ పరిచయం చేస్తూ.

చిత్కళ నవ్వుకుంది. అరవింద ఎవరో నాకు తెలుసు బామ్మా చరణ్ చెల్లెలు కదా అనుకుంది గుంభనంగా...

అరవిందతో మాట్లాడుతూ "ఈ ఏడు నీకు కామన్ ఎగ్జామ్స్ అనుకుంటా...ఏమన్నా డౌట్స్ ఉంటే రా! నేను చెబుతాను..." అంది చిత్కళ.

అరవింద తడుముకోకుండా వెంటనే "మా అన్నయ్య ఉన్నాడుకదా అక్కా! అతను బాగా క్లెవర్..." అంది.

ఆ సంబోధన చిత్కళకి నచ్చలేదు. మరుక్షణం స్పందించింది.

"అరవిందా! నన్ను కళా అని పిలువు..."

ఆ తరువాత చరణ్‌కి రాసిన ఉత్తరంలో "...అరవింద ఈసారి ఏదన్నా పాఠం చెప్పమంటే నీకు టైమ్ లేదని చెప్పు..." అని కూడా చేర్చింది.

"అమ్మబాబోయ్! అలా అంటే అది నాప్రాణాలు తోడేస్తుంది..."అని చరణ్ రాశాడు.

"పిచ్చివాడా... నువ్వు చెప్పనంటే డౌట్స్ క్లారిఫై చేసుకునేందుకు నా దగ్గరకి

వస్తుంది. ఆ సాకుతో నేను మీ ఇంటికి వచ్చే ఛాన్స్ కూడా ఉంటుంది కదా...'' అని చిత్కళ రాసింది.

దానికి చరణ్ గమ్మత్తుగా జవాబు ఇచ్చాడు. "ఢాం!...ఢాం!...నువ్వు మా ఇంటికి వస్తావని అనుకుంటేనే నా గుండె ఇలా పేలిపోతున్నట్లుగా ఉంది! నేను ఆ క్షణం కోసం ఎదురుచూస్తూ ఉంటాను. ఈ రోజు నుండి అరవిందని నా రూమ్‌లోకే రానియ్యను...సరేనా?

మూడునాలుగుసార్లు అరవింద తమ ఇంటికొచ్చాక చిత్కళ చరణ్ ఇంటికెళ్ళింది.

ఆమె వచ్చిందని తెలిసి కూడా చరణ్ బయటికిరాలేకపోయాడు. హాల్‌లో చెల్లెలితో పాటు అతని తల్లి కూడా చిత్కళతో మాట్లాడుతున్నది మరి. చివరికి ధైర్యంచేసి హాల్ ముందు తచ్చాట్లాడాడు.

"అన్నయ్యకి బూస్ట్ కావాలేమో ఇవ్వు..."అని తల్లి అరవిందకి పురమాయించటంతో అతను హతాశుడయి గదిలోకి వెళ్ళి తల పట్టుకుని కూర్చున్నాడు.

చరణ్‌కి చూపించాలని కొత్త డ్రెస్ వేసుకుని వచ్చిన చిత్కళకి కూడా నిరుత్సాహంగా అనిపించింది. ఆ డ్రెస్ చరణ్ చూడకపోతే ఎలా?...వెంటనే వెళ్ళి ఉయ్యాల ఊగసాగింది.

ఆమె ఊహించినట్లుగానే చరణ్ ఉత్తరం రాశాడు.

"నువ్వు మా ఇంటికి రావటం గురించి నేనేదో ఊహించుకున్నాను. నేను అనుకున్నట్లు జరగలేదు. బాగా డిజప్పాయింట్ అయ్యాను. ఇప్పుడు న్నాకు అంత ధైర్యం లేదుకాని ఇంజనీరింగ్‌లో చేరాక కొంత ధైర్యం వస్తుందేమో... ఉద్యోగంలో చేరాక బాగా ధైర్యం వస్తుందేమో...'' అని రాశాడు.

"నిజమే! మనం ఇలా ఉత్తరాలు రాసుకోవటంలోనే ఫన్, థ్రిల్ ఉన్నట్లు తోస్తున్నది నాకు...నువ్వు అన్నట్లు ఇంకొంచెం పెద్దయ్యాక ముఖాముఖీ మాట్లాడుకునే ధైర్యం చేయగలమేమో...'' అని జవాబు రాసింది చిత్కళ.

చిత్కళ టెంత్ పరీక్షలు, చరణ్ ఇంటర్ ఫైనల్ పరీక్షలు ఒకేసారి రాశారు. ఉత్తరాలలోనే బెస్ట్ ఆఫ్ లక్ చెప్పుకున్నారు. పరీక్షలు బాగా రాయటం జరిగిందని ఉత్తరాల ద్వారానే తెలుసుకుని ఆనందించారు.

ఐఐటి ఎంట్రన్స్‌లో చరణ్‌కి మంచి ర్యాంక్ వచ్చింది.

పొద్దున్నే హిందూ పేపర్‌లో వచ్చిన రిజల్ట్స్ చూసి చరణ్ పొంగిపోయాడు. అతని తల్లిదండ్రుల ఆనందానికి అయితే హద్దులేదు.

ఈ సంగతి చిత్కళకి వెంటనే చెప్పాలి!... ఎలా?... చరణ్‌కి ఏం చేయాలో పాలుపోలేదు.

కాంపౌండ్‌వాల్ దగ్గర నుంచుని పనిమనిషితో "నాకు మంచి ర్యాంక్ వచ్చింది" అని గట్టిగా చెప్పాడు.

"ర్యాంక్ అంటే ఏమిటి సారూ?...'' అని పనిమనిషి అంది.



అసలే చిత్కళ కనబడలేదని సతమతమవుతున్న చరణ్‌కి పనిమనిషి సందేహానికి ఇంకా ఒళ్ళు మండింది.

చాటు నుండి ఇదంతా గమనిస్తున్న చిత్కళ బయటికి వచ్చింది.

"ఈ రోజు ఐఐటి ఎంట్రన్స్ రిజల్ట్స్ వస్తాయని అన్నారు. మీకు ఏ ర్యాంక్ వచ్చిందండి?...'' పావుగంటగా రిహార్సల్ వేసుకోవటంతో సూటిగా చరణ్‌ని అడిగింది.

చరణ్ ఊపిరి బిగపట్టాడు. అది చిత్కళ అతనితో మాట్లాడిన మొదటి మాటలు! తమ సంభాషణ ఎంత తీయగా మొదలయ్యింది.

గొంతు సవరించుకుని తన ర్యాంక్ చెప్పాడు.

"కంగ్రాట్యులేషన్స్!...'' అంటూ చిత్కళ అతనికి దగ్గరవసాగింది.

చరణ్ మతిపోయింది. ఇదేమిటి?...చిత్కళ అంత తెగువగా దగ్గరగా వచ్చేస్తున్నది! ఎవరన్నా చూస్తే? అతను తల ఎత్తి అటూ ఇటూ చూశాడు.

చిత్కళ గులాబీ మొక్క దగ్గర ఆగి బాగా విచ్చుకున్న ఓ పువ్వునికోసి గోడమీదుగా అతనికి అందించింది.

చరణ్ ముగ్ధుడయ్యాడు. తనని ఎంత గొప్పగా అభినందిస్తున్నది? వణుకుతున్న చేతులతో గులాబీ అందుకున్నాడు.

"చిత్కళా! ఏం చేస్తున్నావు?...'' బామ్మ గొంతు విని చరణ్‌తో పాటు చిత్కళకూడా త్రుళ్ళిపడింది.

మామిడిచెట్టు అవతల నించి బామ్మ గబగబా వచ్చింది. "ఎవరితను?'' నిలదీసింది.

చిత్కళ తేరుకుంది. "ఇతను... ఈయన అరవింద వాళ్ళ అన్నయ్య బామ్మా! ఈ రోజే రిజల్ట్స్ వచ్చాయిట. చాలా మంచి ర్యాంక్ వచ్చింది ఆయనకి. అందుకనే కంగ్రాట్స్ చెబుతున్నాను''

బామ్మ నుదురు చిట్లించింది. "కంగ్రాట్సా?...అంటే?''

"అంటే...అభినందిస్తున్నాను...'' చిత్కళ తడబడింది. భయంతో అప్రయత్నంగా కళ్ళుమూసుకుంది.

నాటకంలో తన పోర్షన్ ఏమిటో పూర్తిగా మరిచిపోయిన నటుడిలా అక్కడ శిలలాగా నిలబడిపోయాడు చరణ్.

"అందుకని పువ్వు ఇస్తున్నావా?...'' బామ్మ అడిగింది.

"అదికాదు బామ్మా!...'' ఆ తరువాత ఏం చెప్పాలో తెలియక చిత్కళ ఆగింది.

"అంత పెద్ద పరీక్షలో మంచి మార్కులు తెచ్చుకున్నాడని అంటున్నావు. ఇలా ఉట్టిగా పువ్వు ఇస్తే ఏం సరిపోతుందే పిచ్చిదానా?'' బామ్మ నవ్వింది. "ఇంత నెయ్యివేసి జీడిపప్పు పాకం చేస్తాను... తీసుకువెళ్ళి ఇవ్వు...'' అంది.

చిత్కళ సంభ్రమంతో కళ్ళు తెరిచింది. ఎంతమంచి బామ్మా అనుకుంది.

"సాయంకాలం ఇంట్లోనే ఉంటావుగా?" బామ్మ చరణ్‌ని అడిగింది. "మా చిత్కళ వచ్చి స్వీట్ ఇస్తుంది..."

"థాంక్స్ బామ్మగారూ..." అన్నాడు చరణ్. అతనికి అప్పుడు గొంతు పెగిలింది.

సాయంకాలం చిత్కళ చరణ్ వాళ్ళ ఇంటికి వెళ్ళేసరికి అక్కడ చాలా హడావిడిగా ఉంది. అరవింద చూసి చిత్కళని లోపలికి పిలిచి తల్లి దగ్గరకి తీసుకువెళ్ళింది.

"మీ అబ్బాయికి చాలా మంచి ర్యాంక్ వచ్చిందిగా ఆంటీ!...మా బామ్మ పొంగి పోయింది. రెండేళ్ళుగా ఎంత కష్టపడి చదివాడో అని మెచ్చుకుని అప్పటికప్పుడు జీడిపప్పు పాకం చేసింది. అసలు తనే వద్దామనుకుంది కాని..." స్వంత కవిత్వాన్ని ఎలా కొనసాగించాలో తెలియక ఆగింది చిత్కళ.

చరణ్ తల్లి బాగా ఇంప్రెస్ అయ్యింది. "అసలు ఆ తీయటి కబురు చెప్పి మేమే తీపిపంచాలి. హడావిడిలో కుదరలేదు.పాపం ఆ పెద్దావిడ ఎంత శ్రమ తీసుకుందో" అంది. "రా! మావాడ్ని పరిచయం చేస్తాను" అంటూ చనువుగా చిత్కళ చేయిపట్టుకుని చరణ్ రూమ్‌లోకి తీసుకువెళ్ళింది.

రూమ్‌లోకి వెళ్ళకుండానే ఓ దృశ్యం కనబడి చిత్కళ ఆగిపోయింది.

మంచంపైన అడ్డదిడ్డంగా పడుకుని వాక్‌మేన్ ఇయర్‌ఫోన్స్ చెవులకి తగిలించుకుని తల ఊపుతూ టేప్‌తో గొంతు కలిపి టేక్ ఇట్ ఈజీ పాలసీ పాట పాడుతున్నాడు చరణ్ పొద్దున... అంటే అయిదు గంటల క్రితం చిత్కళ ఇచ్చిన గులాబీ ఇంకా అతని చేతిలోనే ఉంది.

చిత్కళని అదోరకమయిన మత్తు ఆవరించినట్లయింది.

గదిలోకి తల్లితోపాటు వచ్చిన చిత్కళని చూసి ఒక్క ఉదుటున అతను మంచం దిగటం, తనకి థాంక్స్ చెబుతూ స్వీట్ అందుకోవటం...ఈలోగా అతని తండ్రి పిలిస్తే అతను హడావిడిగా వెళ్ళిపోవడం...ఇవన్నీ ఆమె స్మృతిపథంలోకి ఎక్కలేదు.

ఆ తరువాత ఎంతసేపు చరణ్ తల్లితో మాట్లాడిందో ఏం మాట్లాడిందో కూడా ఆమెకి సరిగా గుర్తులేదు. ఓ తీయని ట్రాన్స్‌లో తేలిపోయింది. మధురమయిన మత్తులో మునిగిపోయింది.

కళ్ళు మూసినా తెరిచినా ఒకటే దృశ్యం కనబడుతున్నది. అది చరణ్ తను ఇచ్చిన గులాబీ పువ్వునే అపురూపంగా పట్టుకుని ఉండటం!

అంతవరకూ కొంత చిలిపిగా సరదాగా సాగిన వాళ్ళ ఉత్తరాలలో అప్పుడే మొదటిసారిగా కాసింత సీరియస్‌నెస్ చోటుచేసుకుంది.

డియర్ చిత్కళా,

ఏమో అనుకున్నాను కాని నువ్వు చాలా డేరింగ్ !

మగవాడిని నేనే భయపడ్డాను కాని ఆడదానివయినా నువ్వు ధైర్యంచేసి నాకు



గులాబీ ఇచ్చావు! నాకు మా నాన్న, అమ్మా టైటాన్ వాచీ, ఉంగరం కొన్నారు. చెల్లెలు టీ షర్ట్ ఇచ్చింది. అవన్నీ ఇంకెన్నో రోజులు నా కళ్ళఎదుటే ఉండచ్చు...నువ్వు ఇచ్చిన పువ్వు రెండు రోజులలో ఎండిపోయి రూపుమార్చుకోవచ్చు...కాని ఇవన్నీ నాకు ఒకే రకమయిన ఆనందాన్ని ఇచ్చాయి. ఇస్తాయి...థాంక్ యూ...

దిస్ మే బి ది బెస్ట్ డే ఇన్ మై లైఫ్! థాంక్ యూ వన్స్ ఎగయిన్.

ఆ ఉత్తరం చదివిన తరువాత చిత్కళకి కోపమూ కలిగింది. సంతోషమూ వేసింది. ఆశ్చర్యమూ కలిగింది.

అంతవరకూ ఏదేదో చిలిపి పేర్లుపెట్టి ఉత్తరం రాసుకున్నారు. మొదటిసారిగా అతను చిత్కళా అని రాశాడు.అలాగే అంతవరకూ ఏవేవో ఈక్వేషన్స్ మాటునో, ఛందస్సు చాటునో తమ సందేశాలని రాసుకునేవాళ్ళు. మొదటిసారిగా అతను తెల్లకాయితంపైన ఉత్తరంరాశాడు!... ఈ రెండు కారణాలవల్ల ఆశ్చర్యం కలిగింది.

చరణ్‌కి అత్యంత ఆప్తులయిన తల్లిదండ్రులు, చెల్లెలు ఇచ్చిన బహుమతి సరసన తాను ఇచ్చిన చిరు బహుమతిని చేర్చటం ఆమెకు బాగా నచ్చింది. ఎంతో సంతోషాన్ని కలగచేసింది.

ఇక కోపం ఎందుకూ అంటే అతను మగ, ఆడా అని జెండర్ విచక్షణ చూపించి నందుకు.అయితే చిత్కళ ఆ కోపాన్ని వెంటనే ప్రదర్శించలేదు అతని ఉత్తరానికి మర్యాదగానే జవాబు ఇచ్చింది. అయితే కాయితంలో మిగిలిన చోట అంతా ఛందస్సుతోకాకుండా అతను అదివరకు రాసిన కాయితాలలోని ఈక్వేషన్స్ కాపీకొట్టి నింపింది. తెల్లకాయితాలలో ఉత్తరాలు రాస్తే వేరేవారి చేతికి చిక్కితే ప్రమాదకరం అన్న సూచనని అంతర్లీనంగా ఇచ్చింది చిత్కళ.

వారం తరువాత ఘాటుగా ఉత్తరం రాసింది.

డియర్,

శారీరకంగా స్త్రీ పురుషుడికంటే బలహీనురాలే అయి ఉండచ్చు. కాని దాన్ని ఎత్తి చూపటం తప్పు!

అయినా ఈ దేశంలో ఎంతమంది మగవాళ్ళు పి.టి ఉషతో పోటీపడి ఓడించగలరు?

అందుకనే ఆడవాళ్ళు పిరికివాళ్ళు అని అనుకోవటం పొరపాటు...సౌశీల్యం, మార్దవం స్త్రీకి సహజగుణాలు...వాటినుంచి జనించినదే ఈ బెరుకుతనం. అందుకనే ఆడదానికి ధైర్యం లేదు అని అనుకునేముందు ఫలాన మంచి లక్షణాలవల్ల స్త్రీ అలా ప్రవర్తిస్తుంది అని గుర్తిస్తే మంచిది.

ఆడా మగా తేడా లేదు అని అనను...కాని ఆ తేడాలన్నీ ప్రకృతి ద్వారానో సమాజపరంగానో సిద్ధించినవి. ఆ తేడాలవల్ల ఒకరు తక్కువ ఇంకొకరు ఎక్కువ అని అనుకోవటం మాత్రం సరికాదు.

ఈ విషయంలో నేను చాలా సెన్సిటివ్. అర్థంచేసుకుంటావని భావిస్తున్నాను.

ఆ ఉత్తరానికి వెంటనే జవాబు రాలేదు. చరణ్‌కి కోపం వచ్చింది కాబోలు అనుకుంది చిత్కళ. కోపం వస్తే మా స్నేహం ఇంతటితో ఆగిపోతుంది అంతేకదా అనుకుంది చేదుగా.

మనసుకి నచ్చచెప్పటం అనుకున్నంత తేలిక కాదని చిత్కళకి మెల్లగా అర్థం అవసాగింది. ఇంట్లోంచి పెరటివైపు ఎన్నిసార్లు వెళ్ళిందో లెక్కలేదు. ప్రతిసారీ చూపు మందార చెట్లవైపే!...సాధారణంగా చరణ్ అక్కడే ఉత్తరాలు డ్రాప్ చేస్తాడు.

మూడోరోజు కూడా అతని నుండి జవాబు రాలేదు. ఓకే!...తాను మగవాడ్ని అన్న అతని అహంకారం దెబ్బతిని ఉంటే నాకేం రిగ్రెట్స్ లేవు అనుకుంది చిత్కళ. అలాంటి భావాలు ఉన్నవాడితో తాను స్నేహం చేయలేదు. సరదాగా సాగిన ఈ అల్లరి ఆగిపోవాల్సి నందుకే తన బాధ అంతా! సైన్స్ టీచర్ అస్ఫాల్ ఆడదానివి అన్నవిధంగా మాట్లాడినందుకు రెండేళ్ళ క్రితం తాను స్పందించిన విధం తప్పు అని ఎలా అనుకోలేదో అలాగే చరణ్‌కి గుడ్‌బై చెప్పటం కూడా అనుకుంది చిత్కళ. అలా ఎంత సరిపుచ్చుకుందామనుకున్నా ఆమె స్థిమితపడలేకపోయింది.

ఇక అతని నుండి ఉత్తరం రాదు అన్న చేదు నిజానికి అలవాటు పడాలి అనుకుంది కాని ఆశ ఆమెని అతలాకుతలం చేసింది. వద్దు వద్దు అనుకుంటూనే గంటకి ఓసారి మందారచెట్లవైపు చూసేది. చూసిన ప్రతిసారీ నాకు బుద్ధిలేదు అనుకునేది.

నాలుగో రోజుకి ఆమె మనసు రాయి చేసుకుంది. ఇక ఉయ్యాల ఊగేది లేదు కదా అనుకుంటూ రెండేళ్ళపాటు ఫన్‌ని థ్రిల్‌ని కలిగించిన ఉయ్యాల తాళ్ళ వంక ఆప్యాయంగా చూస్తూ వాటిని ప్రేమగా తాకింది.

"కళా!ఇక్కడున్నావా?"బామ్మ భుజంపైన చేయివేసి అడిగింది."కాఫీ తాగావా?"

చిత్కళసమాధానం ఇవ్వలేదు. కాఫీ కాదు అమృతం పైనకూడా ఆమెకి కోరికలేదు.

"చూడు! పనిమనిషికి బద్ధకం ఎక్కువయింది. సరిగా ఊడవటం లేదు"

పనిమనిషిసరిగా పని చేయకపోయినా ఆర్థికమంత్రి దేశాన్ని దివాలా తీయిస్తున్నా పట్టించుకునే స్థితిలోలేదు చిత్కళ. స్తబ్దుగా ఉండిపోయింది.

"ఆ మందార చెట్ల దగ్గర చూడు ఎన్ని కాయితాలు ఉన్నాయో!?..."

గిరుక్కున వెనక్కి తిరిగింది చిత్కళ. బామ్మ చివరి నిముషంలో ఉయ్యాలతాళ్ళని పట్టుకుంది కాని లేకపోతే చిత్కళ తిరిగిన ఫోర్స్‌కి కిందపడేదే!

బామ్మ అన్నట్లు మందార చెట్లదగ్గర ఎన్నో కాయితాలు లేవు. ఒక్కటే కాయితం ఉంది! అది నిస్సందేహంగా చరణ్ రాసిందే!

అప్పుడు చలనం వచ్చింది చిత్కళలో. "బామ్మా! నేను శుభ్రం చేస్తాను కాని నాకు వేడిగా కాఫీ ఇవ్వవా?...తల పగిలిపోతున్నది" తల పగిలిపోవటం శుద్ధ అబద్ధమయినా ఆ ముక్క చెప్పకపోతే బామ్మ త్వరగా కదలదని అనుకుంది చిత్కళ.



చిత్కళ ఊహించినట్లుగానే బామ్మ నిముషంలో కాఫీ తెస్తాను అంటూ లోపలికి వెళ్ళింది.

ప్రపంచంలో ఉన్న జనాభా అంతా తానుచేస్తున్న పనిని చూసినా ఖాతరు లేనంత తెగువతో ఏం పట్టించుకోకుండా గబగబా వెళ్ళి ఆ కాయితం ఉండని అందుకుంది.

చరణ్ నుండి ఉత్తరం వచ్చింది! అది చాలు. అతను తప్పకుండా తన భావాలని అర్థంచేసుకునే ఉంటాడు. ఆ కాయితాన్ని విప్పి చదవకపోయినా అందులో ఏముందో పూర్తిగా అవగతమయినట్లు అనిపించింది ఆమెకి. దుమ్ము అంటి ఉంటుందన్న సంగతిని విస్మరించి పెదవులకి ఆనించుకుని ఆ కాయితాన్ని తన గుండెకి దగ్గరగా దాచుకుంది.

ఉత్తరం తరువాత తీరికగా చదువుతుంది. ముందు చేయాల్సిన పని ఇంకోటి ఉంది. పాపం బామ్మ అక్కడ ఎంత కంగారుపడుతున్నదో!

దిష్టితీసి కాని కాఫీ ఇవ్వలేదు బామ్మ.

"కొంతసేపు కళ్ళు మూసుకుని పడుకుంటాను బామ్మా!..." అని చెప్పి గదిలోకి వెళ్ళి తలుపుమూసింది చిత్కళ.

చరణ్ నుండి జవాబు రావటానికి అంత ఆలస్యం ఎందుకు అయిందో చిత్కళకి కాయితం విప్పగానే తెలిసిపోయింది.

కాయితం నిండా ఈక్వేషన్స్ లేవు... సారీ...సారీ...సారీ అని రాశాడు. అదీ ఒక పద్ధతి ప్రకారం ఎంతో శ్రద్ధగా రామకోటి రాసినట్లు ముత్యాలలాంటి అక్షరాలతో కాయితాన్ని నింపాడు. దూరం నించి చూస్తే అది ఒక డిజైన్‌లాగా కనబడుతున్నది. అతనెంత చిన్న అక్షరాలని ఉపయోగించాడు అంటే ఎంత లేదన్నా అయిదారువేల సారీలు ఆ పేజీలో పట్టి ఉంటాయి.

డియర్ ఇంపి!

తప్పు ఒప్పుకోవటం ఇంత హాయిగా ఉంటుందని ఇప్పుడే తెలిసింది. అది తప్పే కాని తెలిసి చేసింది కాదు. భవిష్యత్తులో చేయను అని కూడా ప్రామిస్ చేస్తున్నాను.

నువ్వురాసిన వాక్యాలు చాలా బాగున్నాయి. ఓ టెంత్‌క్లాస్ అమ్మాయి ఇంజనీరింగ్‌లో చేరబోయే అబ్బాయిని ఉద్దేశించి అంత బాగా రాస్తే ఆ అబ్బాయి అర్జంట్‌గా తెలుగులో ట్యూషన్ పెట్టుకోవాలి. చాలా గొప్పగా రాశావు. అందుకనే నాకో డౌట్!...ఎప్పుడో ఎస్సే కాంపిటీషన్‌లోనో డిబేట్‌లోనో వాడిన వాక్యాలనే నాపైన ప్రయోగించావా?

అంతవరకూ చదివి చిత్కళ నవ్వుకుంది. చరణ్ భలే కనిపెట్టాడే అనుకుంది.మహిళా దినోత్సవం సందర్భంగా స్కూల్‌లో జరిగిన డిబేట్ కోసమని చిత్కళ బాగానే ప్రిపేర్ అయింది. ఆనాటిశ్రమ ఫలితమే చరణ్‌కి ఆమె చేసిన బోధ. తిరిగి ఉత్తరం చదవసాగింది.

నువ్వు కూడా ఐఐటిలో చేరితే ఎంత బాగుంటుంది?

నో ఛాన్స్! అనుకుంది చిత్కళ. నీలాగా అంత కష్టపడలేను నాయనా అనుకుంది.

ఇంతకీ ఇంపి అంటే ఏమిటో తెలుసా?...ఇంగ్లీష్‌లో ఇంప్ అంటే బుల్లి దయ్యం అని అర్థం. తెలుగులోలాగా దానికి ఇ కారం కలిపి స్త్రీ లింగంగా మారిస్తే ఇంపి అవుతుంది కాని నా ఉద్దేశం అదికాదు. ఇంపయిన పిల్ల అని కూడా కాదు. ఆ మాట నిజమయినా నేనా రకంగా రాయలేదు. ఎందుకంటే ఏమన్నా పిచ్చి కామెంట్స్ చేస్తే చంపేస్తానని ఆల్రెడీ వార్నింగ్ ఇచ్చావుగా!...ఇంతకీ ఇంపి అంటే ఇంటర్ చదివే పిల్ల అని అర్థం.

మూడు రోజులుగా అనుభవించిన వేదన దూదిపింజలాగా ఎగిరిపోయింది.చరణ్ సరదా మాటలు సూటిగా హృదయాన్ని తాకి గిలిగింతలు రేపాయి. వరుసగా పాతిక ముప్పైసార్లు మళ్ళీ మళ్ళీ చదివినా ఇంకా అసంతృప్తిగా అనిపించింది.

దాదాపు గంట తరువాత గదిలోంచి నవ్వుతూ బయటకి వచ్చిన మనవరాలినిచూసి బామ్మ అంది "చూశావా దిష్టితీస్తే తలనొప్పి ఎలా పారిపోయిందో?" అని.

"బామ్మా! యు ఆర్ వెరీ స్వీట్ బామ్మా..."

"స్వీట్ అంటే గుర్తుకి వచ్చింది. మొన్న జీడిపప్పు పాకం అంతా ఆ పిల్లాడికి ఇచ్చేశావుగా...నీకోసం మళ్ళీ చేస్తాను" అంది బామ్మ.

• • •

చరణ్ మద్రాస్ ఐఐటిలో చేరేంతవరకూ ఇద్దరి మధ్యా ఇలాగే ఉత్తరాలు సాగాయి. తండ్రి కోరిక మీద చిత్కళ ఇంటర్ బైపిసి తీసుకుంది.

ఆ విషయం తెలిసి చరణ్ కొంత నిరుత్సాహం చెందాడు. "ఎమ్‌పిసి కాకుండా నువ్వేమిటీ బైపిసి గ్రూప్ తీసుకున్నావు? ఇద్దరం ఒకే బ్రాంచ్‌లో ఇంజనీరింగ్ చదివి ఉంటే బాగుండేది కదా! ఆగు...ఆగు...ఆన్ సెకండ్ థాట్స్...ఇదే బాగున్నట్లు ఉంది. నాకు అర్థం కాని చదువు నువ్వు, నీకు అసలు తెలియని చదువు నేనూ చదివితేనే కాపురం సరదాగా ఉంటుందేమో కదా!...ఏమంటావు?" అని రాశాడు.

'ఏమంటాను?...అబ్బాయి ఆలోచనలు చాలాదూరం వెడుతున్నాయే అంటాను' అనుకుంది చిత్కళ. అప్పుడెప్పుడో ఓ ఉత్తరంలో రాసినట్లు ఇంజనీరింగ్‌లో చేరుతుంటేనే ఈ అబ్బాయికి బాగా ధైర్యం వస్తున్నది. కాపురంట కాపురం!

నిజమే మరి! చదువు అవకుండానే క్యాంపస్‌కి వచ్చి మరీ ఉద్యోగాలని ఆఫర్‌చేసే సదుపాయం ఉన్న మంచి ఇన్‌స్టిట్యూట్‌లో చేరబోయేవాడికి ధైర్యం రాదా?

అతను మద్రాస్ వెళ్ళాక ఒక్కసారిగా శూన్యం ఆవరించినట్లయింది చిత్కళకి.ఏ పని చేయబుద్ధి అయ్యేది కాదు. చదువుపైన కాన్‌సెన్‌ట్రేట్ చేయలేకపోయేది. దిగులుగా నిస్సత్తువగా అనిపించేది. టీ.వీ. చూడబుద్ధి అయ్యేదికాదు.

క్రికెట్‌లో ఇండియా గెలుస్తున్నా నిర్లిప్తంగా చూసేది.బామ్మ ఎన్నిసార్లు దిష్టితీసినా ప్రయోజనం లేకపోయింది. ఇంటర్‌లో లావణ్య పరిచయం అయ్యాక మెల్లగా చిత్కళ మనసు స్థిమితపడసాగింది.

• • •



తండ్రి చరణ్‌ని హాస్టల్‌లో చేర్పించి వెళ్ళిపోయాడు.

ఎక్కువగా కాదు కాని రాగింగ్ చేస్తూనే ఉన్నారు. ఆ రాగింగ్ నించి తప్పించుకునేందుకు కొంత, ఇల్లు వదిలి ఇదే మొదటిసారి అవటంవల్ల కలిగిన బెరుకువల్ల కొంత, తల్లిదండ్రుల పైన ఉన్న బెంగవల్ల కొంత, చిత్కళ జ్ఞాపకాలు సతాయిస్తుంటే కొంత రూమ్‌లోనే ఒంటరిగా ఉండటం బెస్ట్ అనుకునేవాడు చరణ్ మొదట్లో.

రెండేళ్ళు అహోరాత్రాలు నిర్విరామంగా శ్రమించి కావలసిన ఫలితం అందుకున్నాక ఏర్పడే ఓ స్తబ్దతకన్నా హైదరాబాద్‌లో ఉంటే ఈ పాటికి అమ్మచేతి వంట తిని చిత్కళకి చాటుగా ఓ ఉత్తరం రాసో లేకపోతే రహస్యంగా ఆమె నుంచి ఓ ఉత్తరాన్ని అందుకునో ఉండేవాడిని కదా అన్న ఆలోచన అతన్ని ఇంకా ఇబ్బంది పెట్టింది.

రెండేళ్ళపాటు ఇంట్లోని స్టడీరూమ్, కోచింగ్ సెంటర్‌లో, కాలేజీలో క్లాస్‌రూమ్‌లు తప్ప అతను బయట ప్రపంచం చూడలేదు. ఏ మాత్రం ఆటవిడుపు అయినా తప్పనిసరిగా అరగంటసేపు చదివే దినపత్రికవల్లా, ఉయ్యాల ఊగుతూ మురిపించిన చిత్కళవల్లా లభించేది!

దినపత్రికలో రోజువారీ వార్తలకన్నా అతను వ్యాఖ్యలకి, విశ్లేషణలకి, ఆర్టికల్స్‌కి, ఉత్తరాలకి ప్రాధాన్యం ఇచ్చేవాడు. ఆ విధంగా అతనికి జెండర్ విచక్షణ గురించి కొంచెం అవగాహన అప్పటికే ఏర్పడింది.

రాబోయే ఎలక్షన్లని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎంసెట్‌లో ఆడపిల్లలకి ముప్పై శాతం రిజర్వేషన్ ప్రకటించింది. అప్లికేషన్లతో పాటు ఇచ్చిన నియమావళిలో ఆ ప్రసక్తి లేదు. పరీక్ష తేదీ ప్రకటించినప్పుడు కూడా రిజర్వేషన్ గురించి చెప్పలేదు. అసెంబ్లీ ఎలక్షన్లు దగ్గరవటంతో హఠాత్తుగా ఆ నిర్ణయం ప్రకటించటంతో మగపిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందారు.

ఆ సమయంలో ఓ రాత్రి భోజనాల వద్ద చరణ్ ఇంట్లో ఈ విషయంపైన సంభాషణ నడిచింది.

"చరణ్! చూడు...ఎంసెట్‌లో ఈ సంవత్సరం నుండి రిజర్వేషన్స్ వచ్చాక అందులో బాయ్స్‌కి మిగిలే సీట్లు తగ్గిపోతాయి కదా...నువ్వు ఐఐటి మీద ఇంకా ఎక్కువ ఎఫర్ట్ పెట్టాలి..." చరణ్ తల్లి అంది.

"అన్నయ్య ఏం చేస్తాడో నాకు తెలియదు కాని ఇది చాలా గుడ్ న్యూస్...నేనయితే అన్నయ్య అంత కష్టపడనక్కరలేదు" అంది అరవింద.

"అవును తల్లీ! నువ్వు ఎంసెట్ రాసేటప్పుడు మీకు ఎనభై శాతం రిజర్వేషన్ పెడతారులే... ఎంసెట్ రాస్తే చాలు సీట్ గ్యారంటీ!..." కచ్చగా అన్నాడు చరణ్.

"చూస్తుంటే రేపు జాబ్స్‌కి కూడా రిజర్వేషన్స్ వచ్చేలాగా ఉన్నాయి..."అప్పటికే ఆ సంగతి చరణ్, అతని స్నేహితులు చర్చించుకుని ఆడపిల్లలకి రిజర్వేషన్లు అన్యాయం

అన్న నిర్ణయానికి వచ్చారు. అతను ఐఐటికి కోచింగ్ తీసుకుంటున్నది హైదరాబాద్‌లోనే కాక రాష్ట్రం అంతా బాగా ప్రసిద్ధిపొందిన కోచింగ్ సెంటర్‌లో...ఐఐటి ఎంట్రన్స్‌లో నెగ్గుకు వచ్చే తెలివితేటలు, నైపుణ్యం ఆడపిల్లలకి లేవని ఆ నిర్వాహకుల అప్రకటిత అభిప్రాయం.

తన క్లాస్‌లో గర్ల్స్‌ని టీచర్స్ ఎలా గేళిచేస్తారో స్వయంగా చూసిన చరణ్‌కి కూడా ఆడపిల్లల తెలివితేటలపైన తేలిక భావమే ఉంది.

వార్తాపత్రికలలో కథనాలు చదివినప్పుడు అయ్యో పాపం ఆడవాళ్ళు అన్యాయంగా వివక్షణకి గురి అవుతున్నారు అనుకున్నా రిజర్వేషన్ వల్ల సీట్లు తగ్గుతాయనేసరికి అన్యాయంగా దోచుకుంటున్నారు అన్న భావం కలిగింది అతనికి. సగటు మగ లక్షణం కాబోలు!

అందుకనే చిత్కళ రాసిన ఘాటయిన ఉత్తరం చూశాక అతనికి స్వల్పంగా కోపం వచ్చింది. ఏమనుకుంటున్నది చిత్కళ?...సహజంగానే ఆడవాళ్ళు మగవారికన్నా అన్నివిధాలా తక్కువవాళ్ళు. ఆ నిజాన్ని కప్పిపుచ్చి సమానత్వం ఆశించటం ఎంతవరకు సబబు?...చిత్కళ ఉత్తరానికి జవాబు ఇవ్వకూడదు అనుకున్నాడు చరణ్.

రెండోరోజు రాత్రి పడుకుంటుంటే అతనికి చిత్కళ ఉత్తరంలో రాసిన '...అయినా ఈ దేశంలో ఎంతమంది మగవాళ్ళు పి.టి ఉషతో పోటీపడి ఓడించగలరు?' అన్న వాక్యం గుర్తుకి వచ్చింది.

పక్కపై నుండి లేచాడు. ఆ వాక్యాన్ని విశ్లేషించాడు. మనోరమ ఇయర్ బుక్ తీసి జాతీయ రికార్డులు ఎలా ఉన్నాయో సరిచూశాడు. ఉజ్జాయింపు లెక్కలు వేశాడు. ప్రతి రాష్ట్రంలో ఓ యాభయిమంది కన్నా ఎక్కువమంది ఉషతో పోటీ పడలేరని తేలింది. తన లెక్క అంత సరికాకున్నా మహా అయితే వందమంది!...ఆ లెక్కన మొత్తం భారతదేశంలో ఉన్న పురుషులలో దాదాపు రెండు వేలమందిని మినహాయిస్తే మిగిలినవాళ్ళంతా ఉషకన్నా తక్కువే అన్నమాట!

వివిధ రంగాలలో రాణిస్తున్న స్త్రీలని పరిగణనలోకి తీసుకుని ఆలోచిస్తే ఆడవాళ్ళు అన్నిటా అసమర్థులు అన్న కామెంట్ హోల్‌సేల్‌గా చేయటం సరికాదు కదా!

ఆ రాత్రి అతను నిద్రపోలేదు...సారీ...సారీ...సారీ అని రాస్తూ ఉండిపోయాడు.

ఆ విధంగా తన దృక్పథాన్ని మార్చిన చిత్కళపట్ల అతనికి ఎనలేని కృతజ్ఞతాభావం నిలిచిపోయింది.

ఆమెకి దూరమయి ఐఐటిలో చేరిన కొత్తలలో అతనికి అందుకనే దిగులుగా ఉండేది. ఇంటిమీద బెంగ అయితే తల్లిదండ్రులతో ఫోన్‌చేసి మాట్లాడచ్చు. ఉత్తరాలు రాయచ్చు. కాని చిత్కళతో ఉత్తరప్రత్యుత్తరాలు నడిపే సావకాశం లేదు కదా!

రెండు నెలల తరువాత వరుసగా అయిదు రోజులు సెలవులు వచ్చాయని చరణ్ హైదరాబాద్ వచ్చాడు.

అతను ఇల్లు చేరేసరికి అరవింద స్కూల్‌కి వెళ్ళిపోయింది. తండ్రి ఆఫీస్‌కి వెళ్ళటానికి తయారవుతున్నాడు. ఆ లెక్కన చిత్కళ కూడా కాలేజీకి వెళ్ళి ఉంటుంది అనుకున్నాడు అతను నిరాశగా. తన స్టడీరూమ్‌కి వెళ్ళి కూర్చున్నాడు. మళ్ళీ చిత్కళ గురించిన స్మృతులు అతన్ని చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేశాయి. సాయంకాలం వరకూ చిత్కళని చూడలేడు కదా...అప్పుడయినా తను వచ్చినట్లు ఆమెకి ఎలా తెలుస్తుంది?

బయటికి వచ్చి కాంపౌండ్ వాల్ దగ్గర తచ్చట్లాడాడు...మామిడిచెట్టుకి ఇంకా ఉయ్యాల అలాగే ఉంది! గులాబీలు విరగబూస్తున్నాయి. మందారచెట్లు ఏపుగా పెరిగి గోడ దాటి తమ దొడ్లోకి వచ్చేస్తున్నాయి. అంతా బాగానే ఉంది కాని చిత్కళ జాడలేదు.

చరణ్ మూడోసారి వచ్చినప్పుడు బామ్మ కనబడింది.

అప్పటికి చరణ్ చాలా డెస్పరేట్‌గా ఉన్నాడు. అందుకనే తెగించి "నమస్కారం బామ్మగారూ!..." అన్నాడు.

ఆవిడ తల ఎత్తి అతనివంక చూసింది. "నువ్వా నాయనా! బాగున్నావా? ఏదోఊర్లో చదువుతున్నావుట కదా!" అంది.

"అవును బామ్మగారూ!...చెన్నైలో చదువుతున్నాను"

"ఏదో కొత్తపేరులాగా ఉందే!...బాగా దూరమా?"

చరణ్ నవ్వాడు "చెన్నై అంటే మద్రాసు బామ్మగారు" అన్నాడు.

అతను ఈ మధ్యనే పేరు మార్చారు అని చెప్పేలోగా బామ్మ అందుకుంది. "మద్రాసా?...మరి ఆ మాట చెప్పకుండా చెయి చెయి అంటావే?..." అంది.

చరణ్ బుర్ర గోక్కున్నాడు. ఏం చెప్పాలో అతనికి అర్థం అవలేదు. "ఉంటాను బామ్మగారూ..." అంటూ తప్పుకున్నాడు.

"ఎవరితోరా మాట్లాడుతున్నావు?" తల్లి అడిగింది.

"ఆ బామ్మగారున్నారుగా...ఆవిడ నన్ను చూసి చెన్నై నుంచి ఎప్పుడు వచ్చావు బాబూ అని అడిగింది..." తడుముకోకుండా చెప్పాడు చరణ్.

"ఎంతయినా నువ్వు బాగా మారిపోయావురా!" తల్లి అంది. "అదివరకు ఎవరితో మాట్లాడకుండా ముభావంగా ఉండేవాడివి. ఇప్పుడు ఆ బెరుకుతనం పోయింది"

తన కొడుకు ఇంకా ఎన్ని రకాలుగా మారిపోయాడో తెలిస్తే అమ్మ గుండె ఆగిపోతుంది అనుకుని చరణ్ నవ్వుకున్నాడు.

అదే సమయానికి చిత్కళ కూడా నవ్వుతున్నది.

ప్రతి విద్యార్థికి ఇంటర్ చదివే రెండు సంవత్సరాలు ఎంత కీలకమయినవో సుదీర్ఘంగా వివరిస్తూ సంస్కృతం లెక్చరర్ "చదవాల్సిన ఈ సమయంలో ప్రేమా గీమా అని తప్పుతోవ తొక్కుతుంటారు...జాగ్రత్త!..." అని హెచ్చరించాడు.

"అవును ఇంటర్‌లో ప్రేమలో పడకూడదు" అంది చిత్కళ సీరియస్‌గా.

లావణ్య గిల్లింది. "కరక్టేగా! సార్ టెంత్ సంగతి చెప్పలేదు కదా!... కాని చరణ్

గారు ఇంటర్‌లోనే జారి ప్రేమలో పడ్డారు కదా?" అమాయకంగా అంది.

నొప్పిని మరిచిపోయి స్నేహితురాలితో కలిసి నవ్వింది చిత్కళ. నెల రోజులలోనే లావణ్యతో బాగా క్లోజ్ అయింది చిత్కళ. చరణ్ గురించి ఎవరికో ఒకరికి చెప్పుకోకపోతే రగులుతున్న మనసుకి సాంత్వన ఉండదని తోచి పూర్తి కథ లావణ్యకి చెప్పేసింది.

"అయినా ఐఐటిలో సీట్ తెచ్చుకున్నాడు. నాకూ టెంత్‌లో ఎయిటీ ఎయిట్ పర్సంట్ వచ్చింది తెలుసా?"

"ఓకే యు ఆర్ గ్రేట్!...ఇంతకీ చరణ్ సంగతులు ఏమిటి?" కెమిస్ట్రీ నోట్స్ రాసుకుంటూనే గుసగుసగా అడిగింది లావణ్య.

"రోజూ ఇలా అడుగుతావేమిటి?... ఇంకోసారి అడిగితే చంపేస్తాను..." పెదవులు ఎక్కువగా కదపకుండా అనటానికి ప్రయత్నించింది చిత్కళ.

లావణ్య మళ్ళీ నోరువిప్పబోయింది.

"షటప్!..." మెత్తగా అంది చిత్కళ. "నేను ఇప్పటికి చరణ్‌ని మరిచిపోయి హైడ్రోజన్ బాండ్ గురించి కాన్‌సెన్‌ట్రేట్ చేస్తాను. సరేనా?"

లావణ్య మూతి తిప్పింది.

చిత్కళ ఇంటికెళ్ళేసరికి బామ్మ "ఈరోజు నీకోసం ఉల్లిపాయపకోడి చేశానే" అంది.

చిత్కళ నిట్టూర్చింది. ఇంటర్‌లోకి వచ్చాక బామ్మ గారాం మరీ ఎక్కువయింది. ఆవిడ చేసినవన్నీ తింటుంటే చరణ్ చూసి ఏమిటి ఇంత లావు అయ్యావేమిటి? అని నవ్వుతాడని భయంగా ఉంది. తినకపోతే బామ్మ నొచ్చుకుంటుంది. కొంచెమే తిని మానేయాలంటే జిహ్వ నొచ్చుకుంటుంది...ఎలా?

చిత్కళ మొహం కడుక్కుని వచ్చేసరికి బామ్మ పకోడిప్లేట్‌తో తయారుగా ఉంది. "బామ్మా! ఇన్ని తినలేను..." అంది చిత్కళ సగానికిపైగా ఇంకో ప్లేట్‌లో వేసేస్తూ.

బామ్మ మొహం చిన్నబోవటం చూసి మళ్ళీ ప్లేట్ నింపుకుంది చిత్కళ. చరణ్ గుర్తుకి రావటంతో కొన్ని తీసేసింది.

"ఆ కూడికలూ తీసివేతలూ ఏమిటే?" అంది బామ్మ. "బాగా చదివి డాక్టర్ అవాలంటే బాగా తినాలి"

ఆ ప్రేమకి చిత్కళ కరిగిపోయింది. రెండు పకోడీలు వేసుకుంది. "ఇలా తింటే నేను డాక్టర్‌ని అవను...పేషెంట్‌ని అవుతాను" అంది నవ్వుతూ.

"అవునూ! ఆ అరవిందావాళ్ళ అన్నయ్యకి కాస్త స్ప్రూ లూజా?..." చూపుడువేలు కణత దగ్గర పెట్టుకుని తిప్పుతూ అడిగింది బామ్మ.

చరణ్ ప్రసక్తి రావటంతో ఓ పకోడి తీసేసింది చిత్కళ. నిజమే! స్క్రూ లూజే!... లేకపోతే ఎలాగో ఒకలాగా తనకి ఉత్తరం రాసే ప్రయత్నం చేయవచ్చు కదా!..."ఎందుకలా అంటున్నావు బామ్మా?" యథాలాపంగా అడిగింది.



పకోడీలు చాలా బాగున్నాయి.నోట్లో వేసుకుంటే కరిగిపోతున్నాయి. పాపం బామ్మ కష్టపడి చేస్తే తినకపోతే బాగుండదు. మూడు పకోడీలు వడ్డించుకుంది చిత్కళ.

"చదివేది మద్రాసులోకదా...చెయి చెయి అని ఏదో కొత్తపేరు చెబుతున్నాడు"

చెయి చెయి అని బామ్మ అన్న విధానానికి చిత్కళ నవ్వింది. "అది మద్రాసుకి కొత్తపేరు బామ్మా!...చెయి చెయి కాదు చెన్నై..."మంచినీళ్ళ గ్లాస్ అందుకుంది చిత్కళ. "అయినా ఈ విషయం నీకు ఎప్పుడు చెప్పాడు?"

"ఎప్పుడో అయితే ఇప్పుడు ఎందుకు చెబుతానే? పొద్దున్నే కనబడ్డాడు... ఊరినించి అప్పుడే వచ్చాడుట..."

నోటి ద్వారా గొంతులోంచి లోపలికి వెళ్ళాల్సిన నీళ్ళు గొంతుపైన పడ్డాయి.చరణ్ వచ్చాడా?...ఇప్పుడు తనకి కొద్ది అడుగుల దూరంలో ఉన్నాడా?...చిత్కళ ఉక్కిరిబిక్కిరి అయింది.

"ఆ హడావిడి ఏమిటే?" బామ్మ తీయగా విసుక్కుంది. "అయ్యో! అదేమిటి? పకోడీ ప్లేట్ అలా దూరంగా నెట్టేస్తున్నావేమిటి?"

'ఇప్పటికే లావు అయ్యానని అనుమానంగా ఉంది బామ్మా. ఇప్పుడు ఆ పకోడీలు తింటే చరణ్ నన్ను ఆటపట్టించటం ఖాయం' అనుకుంది చిత్కళ.

చరణ్‌ని కలవటం ఎలా? అతను ఆల్రెడీ తనకి ఉత్తరం రాయలేదుకదా? చిత్కళ పరుగున వెళ్ళి మందారచెట్ల వంక చూసింది. కాయితాలు లేవు. చరణ్ తొందరపాటుతో కాయితం పడేస్తే పనిమనిషి చెత్తకాయితం అనుకుని చెత్తతొట్టెలో వేసెయ్యలేదు కదా? ఎలా? ఎలా?...ఎలా అతన్ని కలవటం?...చిత్కళకి అంతుపట్టలేదు.

ఉయ్యాల తాళ్ళు పట్టుకుని ఆలోచించింది. చెట్టంతా కదిలేటట్లు ఆ తాళ్ళని బలంగా లాగింది. ఆమాత్రం సంకేతం చాలనుకుని ఊగసాగింది. ఇంటర్‌లోకి వచ్చాక... కాదు కాదు చరణ్ మద్రాసు వెళ్ళాక ఇదే మొదటిసారి ఊగటం అనుకుంది.

చరణ్ స్టడీరూమ్ కిటికీ మూసి ఉంది!

నిరాశతో ఉయ్యాల ఆపి దిగింది.

ఆలోచిస్తూనే ఇంట్లోకి నడిచింది. బామ్మ కనబడలేదు కాని డైనింగ్ టేబుల్‌పైన నిండుగా పకోడీ ప్లేట్ కనబడింది.

పరధ్యానంగా ప్లేట్‌కి ఎదురుగా కూర్చుంది.

అంతదూరం నించి ఇన్నాళ్ళ తరువాత చరణ్ వచ్చాక కూడా అతన్ని ఇంకా చూడలేకపోవటం ఎంత దురదృష్టం! ఏం చేయాలి?

ఖాళీగా ఉన్న బుర్రకి ఏ ఆలోచనా తట్టటంలేదుకానీ ఆ ఖాళీబుర్రనిండా బోలెడు అనుమానాలు పుట్టుకువస్తున్నాయి. ఎన్ని రోజులు ఉంటాడో?...వెళ్ళిపోయేలోగా ఒక్కసారి మాట్లాడే అవకాశం దొరుకుతుందా?

టెలిఫోన్ మోగింది. అరనిముషం సేపు పట్టించుకోలేదు చిత్కళ. ఆ తరువాత విసుక్కుంటూ వెళ్ళి రిసీవర్ తీసింది.

"హలో! చూశావా...అన్నట్లుగానే సరిగ్గా గంటతరువాత ఫోన్ చేశాను" అటునించి లావణ్య అంటున్నది.

"అయితే ఏమిటిటా?" అంది చిత్కళ చిరాకు నిరభ్యంతరంగా ప్రదర్శిస్తూ.

"ఈ గంటలో నువ్వు హైడ్రోజన్ బాండ్ గురించి క్షుణ్ణంగా చదివేసి నా డౌట్స్ తీరుస్తానని అన్నావు కదా?!..."

చిత్కళ ఆ సంగతే మరిచిపోయింది. "నేనేం చేయనే! ఏం చదవలేదు..."

"ఏం ఎందుకు?..." డబాయించింది లావణ్య.

అటూ ఇటూ చూసి ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుని గొంతు తగ్గించి చెప్పింది "చరణ్ వచ్చాడుట..." అని.

లావణ్య ఊరుకోలేదు. "చరణ్‌ని మరిచిపోయి హైడ్రోజన్ బాండ్‌పైన కాన్‌సెన్ట్రేట్ చేస్తానని అన్నావుగా?!..."

చిత్కళ సహనం కోల్పోయింది. "నిన్ను చంపేస్తానే..." అంది.

ఇంకోసారి మామిడిచెట్టుని, ఉయ్యాలని, మందారపూలని గులాబీ బాలలని పలకరించింది చిత్కళ... చరణ్ జాడలేదు!

నిరాశగా లోపలికి నడిచింది.

స్కూల్ నుంచి తల్లి అప్పుడే వచ్చింది. బామ్మ ఇంటి దగ్గర బాధ్యతలు అన్నీ చూసుకోవటంతో రోహిణి ఇంకొన్ని స్కూల్ బాధ్యతలు తలకెత్తుకుంది.

చరణ్ చరణ్ అని గట్టిగా అరవాలి అన్నంతగా అనిపించింది చిత్కళకి... ఏం చేయాలి?

"కళా! నాకో సాయం చేస్తావా?..." బామ్మ మెల్లగా అడిగింది.

"ఏమిటి బామ్మా?"

"నువ్వు చదువుకోవటం అయిందా?... అది చెప్పు ముందు"

"ఆ! చదువులలోన మర్మమెల్ల చదివితి తల్లీ!..." చిన్నప్పుడు చదువుకున్న భాగవత పద్యాన్ని అనుకరించింది చిత్కళ.

"నీకంటికి నేను ఆడ హిరణ్యాకశిపుడిలాగా కనబడుతున్నానా?.." బామ్మ నవ్వింది. "నీకు ఈ పూట చదువు జంజాటం లేకపోతే నాతో గుడికి వస్తావా?"

గుడికి వెళ్లిన సమయంలోనే చరణ్ ఇంటికొస్తే?...అమ్మో! మళ్ళీ మర్నాటి వరకూ అతన్ని కలవటానికి కుదరదు. వద్దు...కాని కాని పాపం బామ్మ...బామ్మ ఎప్పుడో కాని ఇలా అడగదు. బామ్మకి మాత్రం కాసింత ఛేంజ్ ఉండద్దూ? గుడికి వెళ్ళి వచ్చాక ఇంకోసారి చరణ్ గురించి వెతికితే సరి! "వస్తాను బామ్మా!...కాని నీ పకోడీల మహత్యమో లేక



పోతే హైడ్రోజన్ బాండ్ ప్రభావమోకాని బద్ధకంగా ఉంది.స్నానంచేసివస్తాను...సరేనా?"

బామ్మ మొహం వెలిగిపోయింది. అంతలో ఆవిడ మొహం ప్రశ్నార్థకంగా మారింది. "అవునే...హైడ్రోజన్ బాండ్ అంటే ఏమిటే?"

చిత్కళ పకపకా నవ్వింది. రెండు చేతులూ జోడించి "బామ్మా! నమస్తే... మా లావూకి అయితే చెప్పగలను కాని హైడ్రోజన్ బాండ్ అంటే ఏమిటో నీకు ఎలా ఎక్స్‌ప్లయిన్ చేయగలను బామ్మా! నన్ను వదిలెయ్యి" అంది.

అలా హైడ్రోజన్ బాండ్ గురించి చెప్పనందుకు కాబోలు బామ్మ చాలా విధాలుగా చిత్కళని సాధించింది.

చిత్కళ స్నానానికి వెడుతుంటే "షాంపూతో తలంటుకోకూడదూ...రేపు కాలేజీకి వెళ్ళే ముందు టైమ్ కలిసి వస్తుంది" అని సలహా ఇచ్చింది.

ఈ సజెషన్ ఏదో బాగానే ఉంది అని ఇంకో టవల్ అందుకుని బాత్‌రూమ్‌లోకి దూరింది చిత్కళ.

గుడికి సింపుల్‌గా తయారవుదామని ఓ కాటన్ డ్రెస్ అందుకుంటే బామ్మ మొహం చిట్లించింది. "వద్దు! అది వద్దు"

"వద్దు అంటావేమిటీ...అది నువ్వు వేసుకునేందుకు కాదు బామ్మా! నేను ధరించటానికి" అని జోక్ చేయబోయింది చిత్కళ.

ఆవిడ వదలలేదు. గుడి, పవిత్రత, ఆధ్యాత్మికత, ప్రశాంతత గురించి నాలుగు కబుర్లు చెప్పి "లేత రంగు డ్రెస్ ఏదన్నా వేసుకో..." అంది.

బామ్మ వైఖరి చిత్కళకి అసలు అర్థంఅవలేదు.అయినా బామ్మతో వాదన ఎందుకు అని ఆవిడ సూచనలకి సరిపోయే డ్రెస్ ఎన్నుకుంది. సాధారణంగా అది పార్టీలకి మాత్రమే ధరిస్తుంది చిత్కళ.

"ఆ! ఇది బాగుంది..." అంది బామ్మ సంతృప్తిగా.

"నీ సలహాల మూలంగా అరగంట టైమ్ ఎక్కువ అయింది తెలుసా?" చిత్కళ ఫిర్యాదు చేస్తున్నట్లు అంది. పైకి అలా అన్నది కాని అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుని ఇప్పుడు చరణ్ ఎదురయితే ఎంత బాగుండును అనుకుంది. బామ్మ చెప్పినట్లు వినటం మంచిదే అనుకుంది.

గుడికి ఆటోలో వెడుతుంటే బామ్మ "నాకు ఒకే ఒక కోరిక ఉందే" అంది.

"అదేమిటో నాకుతెల్సు బామ్మా..."చిత్కళఅంది."ఆమాత్రం నేనూ ఊహించగలను. నా పెళ్ళి చూడాలనో లేకపోతే నా మనవడి అన్నప్రాశన చూడాలనో ఉంది కదూ?"

"వెటకారాలు బాగానేనేర్చావు.నాకు అంతలేసి కోరికలు లేవు తల్లీ! ఇప్పుడు నువ్వు చదువుతున్న చదువులో బాగా విజయం సాధించి అదేదో యమసెట్టో యంచెట్టో దాంట్లో చాలామంచి ర్యాంక్ సంపాదించి నువ్వు డాక్టర్ అయితే అదేచాలు నాకు. ఆ సమయానికి

నేను ఉన్నా లేకపోయినా ఫర్వాలేదు''

చిత్కళ నవ్వింది. అదే సమయానికి కంట్లో సన్నగా నీరు తిరిగింది. బామ్మ ఎంత మంచిది!

"నీకు ఏ కోరికలు ఉన్నా గుడి బయటే చెప్పుకోవాలి తెలుసా? గుళ్ళోకి వెళ్ళాక భగవంతుడి మీదనే ధ్యానం లగ్నం చేయాలి. అంతేకాని అక్కడ ఉన్న సమయం అంతా అది కావాలి ఇది కావాలి అని మారాం చేస్తే దేవుడికి కోపం వస్తుందిట''

బామ్మ ఉపదేశం కొత్తగా తోచింది చిత్కళకి.

"కళా! మరి నీకు ఏ కోరిక ఉందే తల్లి''

చిత్కళ జవాబు ఇచ్చేలోగా ఆటో గుడి ముందు ఆగింది.పర్సుతీసి ఆటో అతనికి డబ్బులు ఇచ్చింది చిత్కళ. ఇద్దరూ గుడివైపు నడవసాగారు.

కోరికలా?...నాకా?...ఈ క్షణాన అయితే చరణ్ కనబడితే చాలు అనిపిస్తున్నది. అతన్ని చూశాక నా కోరికల చిట్టా విప్పుతాను అనుకుంది చిత్కళ.

ఆ కోరికల చిట్టాలో ఏమేమి ఉంటాయి? ఎంసెట్‌లో ర్యాంక్, చరణ్‌కి మంచి ఉద్యోగం, ఆ తరువాత...ఆ తరువాత...చిత్కళ ఊహలు అంతటితో ఆగిపోయాయి. అక్కడ గుడిలోకి ప్రవేశించగానే ఎదురుగా చరణ్ కనబడ్డాడు!

• • •

అప్పటికి చరణ్ వచ్చి అరగంట అయింది. చిత్కళ రాదేమో అన్న అనుమానం బలపడుతుండగా చిత్కళ గుడిలోకి అడుగుపెట్టింది.

అమ్మయ్యా! తను గట్టిగా అన్న మాటలు చిత్కళకి వినిపించాయన్నమాట...అవి అర్థంచేసుకుని బామ్మని తీసుకుని ఇక్కడికి వచ్చేసింది! అనుకున్నాడు. అంతలోనే చిరు కోపం వచ్చింది. ఆ మాటలు విన్న వెంటనే బయటికి వచ్చి ఓసారి కనబడచ్చు కదా...ఇంత తీరికగా ముస్తాబు అయ్యి ఇంత ఆలస్యంగా దర్శనం ఇవ్వాలా?

ముస్తాబు అనుకోగానే తనపైన అతనికే కోపం వచ్చింది. కడిగిన ముత్యంలా మెరిసిపోతున్నది చిత్కళ. తనేమో హాస్టల్ అలవాటుతో మాసిన జీన్స్, నలిగిన టీషర్ట్‌తో షేవింగ్ కూడా చేసుకోకుండా ఆదరాబాదరా స్నానంచేసి డియోడరంట్ స్ప్రే చేసుకుని వచ్చేశాడు. చరణ్ పెరిగిన గడ్డాన్ని అరచేత్తో విసుగ్గా రాసుకున్నాడు.

చిత్కళ చరణ్‌ని చూసినా పక్కన బామ్మ ఉండటంతో కాబోలు తలదించుకుని ప్రదక్షిణ చేయటం మొదలుపెట్టింది.

ఆ ఇద్దరికీ కొంతదూరంలో ఉండి వాళ్ళని వెంబడించాడు చరణ్.

వేంకటేశ్వరస్వామిని రంగనాథస్వామిని, శివుడిని, గణపతిని దర్శించారు. చిత్కళని ఒక క్షణం కూడా బామ్మ వదలకపోవటం చరణ్‌కే కాదు చిత్కళకీ అసహనంగానే ఉంది.

దర్శనాలు అయ్యాక బామ్మ "ఆయనెవరో షణ్ముఖశర్మగారుట. లలితా సహస్ర



నామాలకి వ్యాఖ్యానం చెబుతాడుట. చిన్నవాడే కాని బాగా చెబుతాడుట...ఒక్క అర గంట వింటాను'' అంది.

చిత్కళ మొహం వికసించింది. ఆ ఆనందాన్ని అంతా మొహంపైన చూపెట్టటం ఎందుకు అన్నట్లు సన్నగా నుదురు చిట్లించింది. "సరే బామ్మా! మళ్ళీ నువ్వు ఇంతదూరం ఎప్పుడు వస్తావో నీ ముచ్చట కూడా తీరనియ్యి...అయితే అరగంటే వినాలి. మళ్ళీ నేను ఇంటికి వెళ్ళి చదువుకోవాలి'' బెట్టు చేసింది.

"సరే!'' అంది బామ్మ.

చిత్కళ తలతిప్పి చరణ్ ఎక్కడ ఉన్నాడో పరిశీలించింది. అతను కనబడగానే మనోజ్ఞంగా నవ్వింది. బామ్మ చూడటంలేదని నిర్ధారించుకుని కొంచెంసేపు ఆగు అన్నట్లు సంజ్ఞ చేసింది. చరణ్ దాన్ని సరిగానే అర్థంచేసుకున్నాడు.

బామ్మని మంటపం వద్ద కూర్చోపెట్టి వెనక్కి తిరిగింది చిత్కళ.

చరణ్ గణపతి గుడి అవతల నందివర్ధనం చెట్టుకింద ఉన్నాడు. అటుగా కదిలింది చిత్కళ.

ఆమె నాలుగు మెట్లు దిగిందో లేదో వెనకనుండి బామ్మ పిలిచింది. మనసులోనే విసుగుని ప్రదర్శిస్తూ తిరిగి మెట్లు ఎక్కింది చిత్కళ.

"ఈ అరగంటసేపు నువ్వు ఒంటరిగా ఎక్కడ ఉంటావు. పోకిరి పిల్లలు ఉంటారు జాగ్రత్త!'' అంది బామ్మ.

'పోకిరి పిల్లల సంగతి తెలియదు కాని ఓ పిల్లగాడు పాపం నాకోసం పడిగాపులు కాస్తున్నాడు. ప్లీజ్ బామ్మా నువ్వు వ్యాఖ్యానం విను బామ్మా...' అనుకుంది చిత్కళ.

"ఇందాక అక్కడ ఎక్కడో ఆ అరవిందా వాళ్ళ అన్నయ్య కనబడ్డాడు. పిల్లాడికి కాస్త స్క్రూ లూజే కాని బుద్ధిమంతుడు అనుకుంటా...అతన్ని నీకు కాపలాగా ఉండమని చెప్పాలనుకుని మరిచిపోయాను''

"అతను ఇక్కడే ఉన్నాడు బామ్మా!...నాకు తోడుగా ఉండమని నేను అడుగుతాను కాని నువ్వు వెళ్ళు. అక్కడ ప్రోగ్రామ్ మొదలయినట్లుంది'' అని బామ్మకి నచ్చచెప్పింది.

చిత్కళని చూడగానే చరణ్ లేచి నుంచున్నాడు..."హాయ్!'' అన్నాడు.

"హాయ్...'' అంటూ చిత్కళ ట్యూబ్‌లైట్ కాంతికి అవతలగా నీడలో కూర్చుంది.

చరణ్ ఆమెకి ఎదురుగా కూర్చున్నాడు.

చల్లటి గాలి ఆహ్లాదంగా వీస్తున్నది. ఆ గాలి తలంటిపోసుకున్న చిత్కళ కురులని పరామర్శించి పిమ్మట వక్షంపై ఉన్న చున్నీని రెపరెపలాడించి ఆ తరువాత నన్ను తాకుతున్నది అనుకున్నాడు చరణ్.

ఆ ఊహకే అతనికి చెప్పలేని పరవశం కలిగింది. గాలి మోసుకువస్తున్న పరిమళం అంతా చరణ్ వాడిన స్ప్రేవల్లనే అనుకుంది చిత్కళ.

ఓ తెల్లటి పువ్వు రాలి ఇద్దరి మధ్యా పడింది.

"చరణ్! హాస్టల్‌లో భోజనం బాగాలేదా?...నువ్వు కాస్త చిక్కావు" అంది చిత్కళ.

"నువ్వు చిక్కలేదు కాని బాగా పొడుగయ్యావు. ఆటోలోంచి నువ్వు దిగుతుంటే రెండు నెలలలో అంత పెరిగావా అని ఆశ్చర్యపోయాను..." అన్నాడు చరణ్.

చిత్కళ నవ్వింది. "టూ మిస్టేక్స్..." అంది క్లుప్తంగా.

"అంటే?..." అయోమయంగా అడిగాడు చరణ్.

"ఆడవాళ్ళతో నువ్వేం చిక్కలేదు అంటే హర్ట్ అవుతారు తెలుసా?"

"అయామ్ సారీ...మరి రెండో మిస్టేక్ ఏమిటి?"

"నేను పొడుగయ్యాను కాని బాగా కాదు.అలా కనబడటానికి హీల్స్‌కూడా సాయం చేశాయి" అంది చిత్కళ.

"ఎస్! యూ ఆర్ కరెక్ట్. ఇప్పుడే మొదటిసారి నువ్వు చెప్పులు వేసుకుని ఉండగా చూడటం" అన్నాడు చరణ్.

చరణ్ మాటలకి నవ్వింది చిత్కళ. "నేనో విషయం అడగాలనుకుంటున్నాను"

చిలిపిగా అడ్డు తగిలాడు చరణ్ "నేనయితే వెయ్యి అడగాలనుకుంటున్నాను"

"అయితే అడుగు"

చరణ్ ఖంగుతిన్నాడు. అంతలోనే తేరుకుని "లేడీస్ ఫస్ట్ అన్నారుగా.నువ్వే ముందు చెప్పు" అన్నాడు.

"సరే! నేను అడుగుతాను. ఆ తరువాత నువ్వు ఆ వెయ్యి ఏమిటో చెప్పాలి. నేను లెక్కపెడతాను. ఒక్కటి తగ్గినా ఊరుకోను. అర్థమయిందా?" బెదిరించింది చిత్కళ.

చిత్కళని అడగటానికి పదికంటే ఎక్కువ ఐటమ్స్ లేవు అతని బుర్రలో. అయినా "నో ప్రాబ్లెమ్" బింకంగా అన్నాడు చరణ్.

"నీ ధైర్యానికి మెచ్చుకోవాలి"

"ఇదేనా నువ్వు చెప్పదలచుకున్నది?"

"మిస్టర్ చరణ్! నేను ఒకటి అడగాలనుకున్నాను.చెప్పాలనుకోలేదు.అర్థమయిందా? ఇంతకీ నేను అడగాలనుకున్నది ఏమిటంటే...నువ్వు మద్రాసు వెడుతూ ఉత్తరం ఏమిటి అలా రాశావు?

వెయ్యి గురించి ఆలోచించాలంటే సమయం కావాలి కదా... అందుకనే చిత్కళని ఏదో మాటలతో దారి మళ్ళించాలని చరణ్ ప్రయత్నం. "ఏం రాశాను?"

"కాపురం అంటూ ఏవేవో ఊహించేశావు...గుర్తులేదా?"

చరణ్ తన యత్నాన్ని కొనసాగించాడు. "గుర్తు ఉంది. అందులో తప్పేమిటి?... నువ్వు ఇప్పుడు పనికట్టుకుని నన్ను నిలదీయాల్సిన అవసరం ఏముంది?"

చిత్కళ అతని ఎత్తు పసికట్టింది. అందుకనే త్వరగా అడ్డు తగిలింది. "తప్పులేక



పోవటం ఏమిటి? చూడు చరణ్! మనం ఫ్రెండ్స్‌మి. సరదాగా గమ్మత్తుగా మన స్నేహం మొదలయింది. ప్రేమా దోమా అనుకోవటానికి మనం ఇంకా చిన్నవాళ్ళమే. నా వయసు పదహారు. లీగల్‌గా కూడా పెళ్ళి గురించి ఆలోచించే అర్హత నాకు లేదు. నీ సంగతీ అంతే. అందుకనే మన స్నేహాన్ని ఇలాగే కంటిన్యూ చేద్దాం. ప్రేమా, పెళ్ళీ, కాపురాలు, సంసారాలు... ఇవన్నీ తరువాత ఆలోచిద్దాం. సరేనా?..." తన మాటలకి చరణ్ ఎలా స్పందిస్తాడా అన్న ఆతృతతో అతన్నే తదేకంగా చూడసాగింది చిత్కళ.

ఉయ్యాల ఊగటంతోనూ మసజసతతగ అన్న ఛందస్సు నిండిఉన్న కాయితంలో లేఖ రాయటంతోనూ తమ పరిచయం మొదలయింది. ప్రేమో, ఆకర్షణో, మోహమో ఏమిటో తెలియదు కాని తాము బాగా దగ్గరయ్యారు. తాము చేస్తున్న పని సబబేనా?... ఇది ఉట్టి స్నేహమేనా?... స్నేహం కంటే ఎక్కువే అయితే ఈ లేత వయసులో అలా చేయటం సరి అయినదేనా? ఇలాంటి సందేహాలు చిత్కళని చాలాసార్లు చుట్టుముట్టాయి.చరణ్ అయినా తగు విధంగా జవాబు చెబుతాడేమో అన్నట్లు ఇప్పుడు అడిగింది చిత్కళ.

చిత్కళ వంక అబ్బురంగా చూశాడు చరణ్. పదహారేళ్ళ అమ్మాయి...ఎంతబాగా ఆలోచిస్తున్నది! ఎలా ఆమెని కన్‌విన్స్ చేయాలి?

ఐఐటిలో చేరాక పాఠ్యపుస్తకాలే కాక మిగిలిన పుస్తకాలు కూడా చదవసాగాడు చరణ్. ఆ పరిజ్ఞానంతో సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశాడు. "జీవితంలో ఇంకా స్థిరపడ లేదు కాబట్టి ఆ వయసు ఇంకా రాలేదు కాబట్టి మనం పెళ్ళి గురించి ఆలోచించటం తప్పే...కాని కలలు కంటే తప్పేం లేదే!"

చిత్కళ అప్రతిభురాలయింది. ఎంత బాగా చెప్పాడు!

చరణ్ నవ్వి కొనసాగించాడు. "గుడ్డిగా కలలు కనటం తప్పే! కాని మనం ఇంత వరకూ ఏం చేసినా అది మన చదువుకో, గోల్‌కో అడ్డుకాలేదుగా!...ఎస్! మనం స్నేహితులమే. ఒప్పుకుంటాను. ఇంటర్ చదువుతూ ఐఐటిలో సీట్ రావాలని ఆశించాను. ఇప్పుడు ఐఐటిలో చదువుతూ మంచి ఉద్యోగం రావాలని ఆశిస్తున్నాను. అలాగే మన స్నేహం ఇంకా తీయగా మారాలని కోరుకుంటే తప్పేమిటి?"

ఎక్సలెంట్!...చిత్కళ మనసులోనే అతన్ని అభినందించింది.

"ఏమిటి మాట్లాడవే?..." చరణ్ అడుగుతున్నాడు.

ఏం మాట్లాడుతుంది?...చిత్కళ అతన్నే చూస్తూ ఉండిపోయింది. హఠాత్తుగా ఆమెకి గుర్తుకి వచ్చింది. "నేను అడిగాను...నువ్వు వివరించావు...బాగుంది. ఇప్పుడు నీ వంతు...ఏదీ...నువ్వు అడగాల్సిన ఆ వెయ్యి టకటకా చెప్పు బాబూ"

చరణ్ ఒకసారి చుట్టూ చూశాడు. ఆ సరికి గుడికి వచ్చేవారు తగ్గిపోయారు. అరుదుగా ఒకరిద్దరు వచ్చినా వాళ్ళున్న చోటికి వచ్చే అవకాశమేలేదు.

నోరుజారి వెయ్యి అన్నందుకు అవన్నీ చెప్పమని నిలదీస్తున్నది ఈ పిల్ల! ఇప్పుడు

చెప్పలేకపోతే పరువుపోతుంది. ఏం చేయాలి?

మైక్‌లోంచి శర్మగారి గొంతు శ్రావ్యంగా వినబడుతున్నది. 'మూడువందల యాభ య్యవ నామం...వాగ్వాదినీ...అంటే వాక్కులను చక్కగా వ్యక్తపరచుటకు ప్రేరణ ఇచ్చు పరా వాగ్దేవతా అని ఈ నామానికి అర్థం...'

నా వాక్కులకి ప్రేరణ ఇచ్చే దేవత ఎవరో కదా అనుకున్నాడు చరణ్.

"ఏం బాబూ గుటకలు మింగుతున్నావు?... చెప్పు" సవాలు చేస్తున్నట్లు అడి గింది చిత్కళ.

'మూడు వందల యాభై ఒకటో నామం...వామకేశీ. ఈ నామానికి రెండు అర్థాలు ఉన్నాయి. అందమయిన కేశ సంపద కలది అని ఒక అర్థం...'

అప్రయత్నంగా చరణ్ చూపులు చిత్కళ జుట్టువంక తిరిగాయి. రెండు గంటల క్రితమే షాంపూ చేసుకుని వదులుగా అల్లటం వల్ల కాబోలు ముంగురులు అందంగా కద లాడుతున్నాయి. అతనికో అయిడియా స్ఫురించింది. ఆ ఉత్సాహంలో వామకేశీ అన్న నామానికి ఉన్న రెండో అర్థం అతనికి వినబడలేదు.

"ఓకే! చెప్పటం మొదలుపెడతాను...విను" గొంతు సవరించుకున్నాడు. ఆమె మొహంలోకి సూటిగా చూస్తూ చెప్పసాగాడు. "మొదటిది నీ పాపిడికి కుడి పక్కన ఉన్న వెంట్రుకలలో అయిదవది పట్టుదారంలా అలా మెరిసిపోవటానికి కారణం ఏమిటి?"

"హెడ్ అండ్ షోల్డర్ షాంపూ...అయినా ఏమిటా పిచ్చి ప్రశ్న?"

"పిచ్చిదో మంచిదో నేను అడగాల్సింది అదే! ఇక రెండోది నీ పాపిడికి ఎడంపక్కనున్న వెంట్రుకలలో నాలుగవది పట్టుదారంలా అలా మెరిసిపోవటానికి కారణం ఏమిటి?"

అలా వెయ్యి అడగటానికి తయారయ్యాడని గ్రహించింది చిత్కళ. అతని ఎత్తు బాగుంది కాని పైకి విసుగు ప్రదర్శిస్తూ "కొంచెం వెరైటీ ఉండాలి బాబూ" అంది.

"అలాగంటావా?...సరే!...నీ కుడి బుగ్గని స్పర్శించటానికి ఆ వెంట్రుకల సము దాయం చేసుకున్న పుణ్యం ఏమిటి?...ఇది నేను అడగాల్సిన మూడోది..."

చరణ్ రెచ్చిపోతున్నాడని గ్రహించింది చిత్కళ.

జుట్టు వెనక్కి తోసుకుని "పుణ్యం కాదు బాబూ! పాపం!...ఆ పిచ్చిపని చేయబో యాయి కాబట్టే ఇలా చెవి మెలివేసినట్లు తిప్పి నా చెవి వెనకాల నొక్కాను వాటిని. ఇక నువ్వు ఏం చెప్పనక్కరలేదు కాని ఆపు!" అంది.

చరణ్ తేలికగా ఊపిరి పీల్చాడు. "అమ్మయ్యా! నా తప్పేంలేదు. వెయ్యీ చెప్పటా నికి నేను రెడీయే కాని వినటానికి నువ్వే అభ్యంతరం చెబుతున్నావు"

"తెలివితేటలకి సంతోషించాం కాని ఇందాక నేను చిక్కలేదు అన్నావు. లావ య్యానా?" అని అడిగింది చిత్కళ.

చరణ్ నవ్వాడు. "చెప్పను...నీకు కోపం వస్తుంది"



"ఫర్వాలేదు నిజం చెప్పు..." ఆతృతగా అడిగింది చిత్కళ.

"నేను చెప్పను అన్నా నువ్వే బలవంతం చేస్తున్నావు.నా తప్పేం లేదు సరేనా?" చరణ్ ఇంజనీరింగ్ చదివే కొంటె విద్యార్థిగా మారాడు. "ఇప్పుడు ఇంకా బాగున్నావు"

అంతవరకూ తన మొహంలోకి కళ్ళలోకి మాత్రమే చూసిన అతని చూపులు మొదటిసారిగా స్వేచ్ఛగా కదం తొక్కబోవటం గమనించింది చిత్కళ. అడ్డుకట్ట వేస్తున్నట్లు మాట మార్చింది. "ఎందుకు అడిగానో తెలుసా? మా బామ్మ రోజుకో పిండివంట వండి నన్ను టెంప్ట్ చేస్తుంది. చదువుతూ ఎంత తింటున్నానో లిమిట్ లేకుండా ఉంది"

"అదృష్టం! నేను అక్కడ మంచి తిండికి మొహం వాచి ఉన్నాను తెలుసా?" మెల్లగా అతను మద్రాసు విశేషాలు చెప్పసాగాడు.

చిత్కళ ఆసక్తిగా విన్నది.

బామ్మ అరగంటకి కాక ముప్పావు గంట తరువాత వచ్చింది. అయినా ఇంత త్వరగా వచ్చేసిందేమిటి అనుకుంది చిత్కళ.

"ఏం చదువుతున్నావు బాబూ?..." గుడి బయటికి వస్తూ బామ్మ చరణ్‌ని అడిగింది.

"ఐఐటిలో చదువుతున్నాను బామ్మగారూ..."

"అయ్యో!...అప్పుడేదో మంచి చదువు అనుకున్నాను. అయితే నీకు ఇంజనీరింగ్‌లో సీట్ రాలేదా?...ఐటిఐ కోర్స్ చేస్తున్నావా?"

చరణ్ మొహం నల్లబడింది. అందువల్లా, అనవసరంగా జీడిపప్పు పాకం చేశాను అన్న పశ్చాత్తాపం బామ్మ గొంతులో ధ్వనించటంవల్లా చిత్కళ కిలకిలా నవ్వింది."బామ్మా! చరణ్ చదివేది ఇంజనీరింగే! చాలా మంచి కాలేజీలో"

"అలాగా!...పెద్దదాన్ని నాకు సరిగా తెలియక అలా అన్నాను బాబూ...ఏం అను కోకు" అంది బామ్మ చరణ్‌తో.

బామ్మ ఆటో ఎక్కింది. చిత్కళ ఎక్కబోతూ చరణ్‌తో గుసగుసగా "ఆ వెయ్యి బాగాలేదు. ఇంకో వెయ్యి చెప్పాలి" అంది.

"ఏమిటే వెయ్యి అంటున్నావు?..." బామ్మ అడిగింది.

అంత మెల్లిగా మాట్లాడినా బామ్మకి వినబడిందా? అసాధ్యురాలు! చిత్కళ చప్పున తేరుకుంది."ఏంలేదు బామ్మా! లలితానామాలు వెయ్యికదా అవి నేర్చుకోమంటున్నాను"

ఆ రాత్రి చరణ్‌తో గడిపిన నలభై అయిదు నిముషాలని తీయగా నెమరువేసుకుంది చిత్కళ.అదే ప్రయత్నం చరణ్ కూడా చేశాడు. చివరిలో బామ్మతో చిత్కళ అన్న మాటలు అతనికి కొత్త ఆలోచన కలిగించాయి.

తల్లి రోజూ చదివే లలితా సహస్రనామాల పుస్తకం తీసి చదవసాగాడు.

ఏడువందల ఇరవై ఎనిమిదవ నామం చూసేసరికి అతని పెదవులపైన చిరునవ్వు ప్రత్యక్షమయింది...అది చిత్కళ.

గమ్మత్తయిన ఈ అమ్మాయికి చిత్రమయిన పేరు ఇలా వచ్చిందా అనుకున్నాడు.

అప్పటికప్పుడు ఓ ఉత్తరం రాయటం మొదలుపెట్టాడు.

డియర్ 728,

కొత్త వెయ్యి చెప్పమన్నావు. సరే!

మొత్తం పది చాప్టర్లు. ఒక్కొక్క దాంట్లోనేను అడగాల్సినవి వంద ఉంటాయి.అంటే మొత్తం వెయ్యి అవుతాయి. లెక్క సరిపోతున్నది కదా! ఆర్యూ సాటిస్‌ఫయిడ్?

మొదటి చాప్టర్ మన చదువుల గురించి. నేను ఇంజనీరింగ్ నువ్వు ఇంటర్ చదవటంతో మన చదువులు ముగియవు. ఆ తరువాత ఏమేమి చేయచ్చో నాకు వంద డౌట్స్ అన్నమాట...సరేనా?

రెండోది...ఉద్యోగాలు

మూడు...మనం కలిసి కాని విడిగా కాని చూడాల్సిన చదవాల్సిన ఏఏ సినిమాలు, పుస్తకాలు అన్న చర్చ.

నాలుగు...మనం దూరంగా ఉన్నప్పుడు ఒకరికి ఒకరు ఎలాంటి పజిల్స్, చిక్కు ప్రశ్నలు రాసుకోవాలి, దగ్గరగా ఉన్నప్పుడు ఎలా టీజ్ చేసుకోవాలి ఎట్సెట్రా...

అయిదు మన పెళ్ళి... మొత్తం మన దేశంలో ముఖ్యంగా ఏడు వందల నలభై రకాలుగా పెళ్ళిళ్ళు జరుగుతాయిట. అందులో ఏ వంద బాగుంటాయి అని నా డౌట్ అన్నమాట.

ఆరు...పెళ్ళి అయ్యాక మనం చూడాల్సిన వంద ప్రదేశాలు.

ఏడు...గాంగ్‌టాక్‌లో సూర్యోదయం, మౌంట్ అబూ పైన సూర్యాస్తమయం, కన్యాకుమారిలో అస్తమయం ఉదయం రెండూ, చిరపుంజిలో వానలు, సిమ్లాలో హిమపాతం ఇలా ఏఏ వంద ప్రకృతి దృశ్యాలు చూడాలి.

ఎనిమిది...ఈ చాప్టర్‌లో మన పిల్లల గురించి నాకు ఉన్న వంద సందేహాలు ఉంటాయన్న మాట.

తొమ్మిది...ఇందులో మనవళ్ళు, మనవరాళ్ళ గురించి.

పది...ఇది ఏ సర్టిఫికెట్ వ్యవహారం...నాకు పర్మిషన్ ఇచ్చినప్పుడు ఫేస్ టు ఫేస్ చెబుతాను.

ఆ ఉత్తరాన్ని అతను తెల్లవారుజామున డ్రాప్ చేశాడు.

అతను ఊహించిన విధంగానే అయిదు నిముషాలలోనే చిత్కళ దాన్ని చేజిక్కించుకుంది.

ఆ ఉత్తరం చిత్కళ హృదయానికి గిలిగింతలు పెట్టింది.

ఇదే బహుశా చరణ్ రాసిన బెస్ట్ లెటర్ అనుకుంటూ ఆ కాయితాన్ని గుండెలకి గట్టిగా హత్తుకుంది.



ఇంత గొప్ప ఉత్తరానికి మేమిద్దరమే పాఠకులం అనుకుంది గర్వంగా. ఈ ఉత్తరాన్ని చదవలేని ప్రపంచంలోని మిగిలిన ప్రజలంతా పాపం ఎంత దురదృష్టవంతులు అనుకుని ఏడువందల కోట్ల జనాభా పైన జాలిపడింది.

ఆ రోజు జరిగిన కెమిస్ట్రీ పరీక్షలో అన్ని ప్రశ్నలకీ జవాబు బాగా రాసింది చిత్కళ. "చాలా బాగా రాశావు! ముప్పైకి ముప్పై ఇద్దామనుకున్నాను. కాని దీనివల్ల ఓ మార్క్ తగ్గించాను. ఇది ఎందుకు రాశావు?" అంటూ లెక్చరర్ ఓ పదం వంక చూపించాడు. అది చిత్కళ తెలుగులో రాసిన వెయ్యి అన్న పదం.

ఫక్కున నవ్వబోయి తమాయించుకుంది చిత్కళ.

వెయ్యివెనకాల ఉన్న స్టోరీ చెప్పమని లావణ్య ఎంత పోరినా నోరువిప్పలేదు చిత్కళ.

'అయామ్ ఆన్ టాప్ ఆఫ్ ది వరల్డ్' అనుకునేది. మళ్ళీ ఆ ఉత్తరం చదివేది... ఇంకొంచెం ఎత్తుకి వెళ్ళిన ఫీలింగ్ కలిగేది.

ఆ తరువాతి నెలలోనే అంత ఎత్తునుండి ఢాం అంటూ నేలకూలింది.

• • •

రెండేళ్ళ తరువాత ఆ కాలనీ వెల్ఫేర్ ఎసోసియేషన్‌కి మళ్ళీ ఎన్నికలు జరిగాయి. ఈసారి చరణ్ తండ్రి మధుసూదన్ పోటీచేశాడు. క్రితంసారి కమిటీ మెంబర్లు దొంగ మార్గంలో ప్లాట్లు బయటివారికి అమ్మి లక్షలకొద్దీ తిన్నారని, అన్నీ తప్పుడులెక్కలు దొంగ అకౌంట్లు అనీ ప్రచారం చేసినవాళ్ళల్లో మధుసూదన్ కూడా ఉన్నాడు.

ఆ ప్రచారం సూటిగా ఔట్‌గోయింగ్ కమిటీ మెంబర్ అయిన చిత్కళ తండ్రి సుధాకర్‌కి తాకింది.

దాంతో మాటామాటా అనుకున్నారు.

ఒక సమావేశంలో సుధాకర్ రెచ్చిపోయి మధుసూదన్ చొక్కా కాలర్ పట్టుకున్నాడని కూడా చెప్పుకున్నారు. వాళ్ళని విడదీయటానికి చాలా కష్టపడాల్సివచ్చిందిట.

మగవాళ్ళమధ్య విరిగిన మాటలు పెరిగిన ద్వేషాలు సహజంగానే ఆడవారికీ పాకాయి.

ఈ ఇంటి చెట్టుకు ఉన్న పండు ఆ ఇంట్లో కనిపిస్తే పోట్లాట...

ఆ ఇంటి ఆకు ఇక్కడ రాలితే గొడవ.

చదువుకున్నవారు కూడా లోపల మర్యాదకోసం దాచుకున్న హేయమయిన అవలక్షణాలని బయటపెట్టటానికి చాలా చిన్న విషయం చాలని రుజువయింది.

మామిడి ఆకులు తమ దొడ్లోపడి చెత్తచెత్తగా అవుతున్నదని ఓ రోజు మధుసూదన్ గట్టిగా అరిచాడు.

సుధాకర్‌కి ఆవేశం వచ్చింది. మీ బొప్పాయి చెట్టు మా గోడపైనుండి వాలింది కదా అన్నాడు.

వెంటనే మధుసూదన్ మనుషులని పెట్టించి ఆ బొప్పాయి చెట్టు నరికించాడు.

"నాకు చీమూ నెత్తురూ పౌరుషం ఉన్నాయి కాబట్టి చెట్టు నరికించాను. ఆ లక్షణాలు లేని వాళ్ళు ఇతరులకి ఇబ్బందులు తెస్తారు" అన్నాడు.

సుధాకర్ రెచ్చిపోయాడు. రోహిణి, బామ్మ వద్దు వద్దు అని మొత్తుకుంటున్నా వినకుండా మామిడి కొమ్మలు నరికించాడు. నరికిన కొమ్మలని కట్టి తీసుకువెళ్ళటానికి ఉయ్యాల తాళ్ళనే వాడారు కూలీవాళ్ళు.

"శుభకార్యం జరిగితే మామిడి ఆకులు కట్టుకుంటాం. నిక్షేపంలాంటి చెట్టుని బోడి చేయటానికి ఎలా మనసు ఒప్పిందో?..." అని బామ్మ బాధపడింది. "పిల్ల సరదాగా ఉయ్యాల ఊగేది. ఆ ముచ్చట లేకుండా పోయింది" అని కంటనీరు పెట్టుకుంది.

చిత్కళ అయితే బిత్తరపోయింది.

డాబా మీద తిరుగుతున్న అరవింద తనని చూడగానే తల తిప్పుకుని వెళ్ళటం చిత్కళకి పిడుగుపాటే అయింది.

ఏదో చిన్న పోట్లాటలు, అపార్థాలు అంటే వేరే విషయం. పరిస్థితి ఇంత తీవ్రంగా మారాక ఇక చేసేది ఏంలేదని ఆమెకి తోచింది. శత్రువులు అయినది ఇద్దరు కమిటీ మెంబర్స్ మాత్రమే కాదని ఇక శాశ్వతంగా తమ కుటుంబాల మధ్య వైరం తప్పదని, బాంధవ్యానికి ఏమాత్రం ఆస్కారంలేదని అనుకుంది. తను, చరణ్ దగ్గరయ్యే ప్రసక్తిలేదని ఆమెకి అనిపించింది.

నాలుగేళ్ళ తరువాత వచ్చే భవితని ఇప్పుడే ఫాస్ట్ ఫార్వర్డ్‌లో చూద్దామని ఆశపడి తాను, చరణ్ చూసినది పగటి కలలు మాత్రమే అని చిత్కళకి తోచింది.

జరిగినదంతా చరణ్‌కి అసలు తెలియదు.

మరుసటి సెలవులకి ఇంటికి వచ్చిన చరణ్ మారిపోయిన పరిస్థితులు చూసి నివ్వెరపోయాడు.

రెండు ఇళ్ళ మధ్యనా ఉన్న కాంపౌండ్ వాల్ పైన అసహ్యంగా లేచిన నాలుగు అడుగుల రెయిలింగ్ అతనికి కాశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖను గుర్తుచేసింది.

లేఖల మార్పిడికి అసలు వీలు కుదరదు.

చిత్కళ కనపడలేదు. అప్పటికీ రోడ్డుమీద ఆమె ఇంటి ముందు తచ్చట్లాడాడు...ప్చ్! లాభం లేకపోయింది.

అతన్ని చూసినా చిత్కళ బయటికి రాలేదు. ఇక పెద్దలని ఎదిరించే అవకాశం లేనప్పుడు చరణ్ గురించి పూర్తిగా మరిచిపోతే మంచిదని అనుకుంది.

అది అంత తేలిక కాదని తనలాగానే చరణ్ కూడా తీవ్ర మనస్తాపానికి గురిఅయి ఉంటాడని ఆమె ఊహించింది కాని నిస్సహాయురాలుగా మూగగా ఉండిపోయింది.

ఈ వ్యవహారం ఆమె చదువుని బాగా దెబ్బతీసింది. చరణే లేనప్పుడు ఇక నాకు గమ్యాలూ, గోల్స్ ఏముంటాయి అనుకుంది.



భయంకరమయిన నిర్లిప్తత ఆమెని నిలువునా ఆవరించింది.

రెండేళ్ళు అలా చేదుగా గడిచిపోయాయి.

• • •

చరణ్ ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరంలో అడుగుపెడుతున్నప్పుడు జరిగిన ఓ సంఘటన మళ్ళీ ఇద్దరినీ దగ్గరచేసింది.

అప్పటికి అతనిలో ఉన్న నిరాసక్తత కొద్దిగా తగ్గుతున్నది. చిత్కళని మరిచిపోలేకపోయినా ఇక మనసుని రాయిచేసుకుని కెరీర్‌పైన కొంత ఇంట్రెస్ట్ చూపించాల్సిన కీలకమయిన సమయం ఇదేనని అతను గ్రహించాడు.

మెరిట్ స్టూడెంట్ అయి ఉండి ఉన్నట్లుండి చదువుని నిర్లక్ష్యంచేసి మూడీగా అయిన చిత్కళ గురించి రోహిణి బాగా కలవరపడింది. తాను నటించకపోతే ఇక తల్లి సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకువెడుతున్నదన్న భయం కలిగింది చిత్కళకి. అందుకనే లోలోపల కుమిలిపోతున్నా పైకి మామూలుగా ఉండే ప్రయత్నం చేయసాగింది చిత్కళ.

కొత్తడ్రెస్ ధరించి చిత్కళ స్నేహితులతో సినిమాహాల్ ముందు ఉండటం చరణ్ చూశాడు. హఠాత్తుగా అతనికి స్ఫురించింది. ఆ రోజున ఆమె పుట్టినరోజు అయి ఉండాలి. అతనూ టికెట్ తీసుకున్నాడు. సినిమా మొదలవబోతున్నదని అందరూ లోపలికి వెడితే అతను మాత్రం మార్కెట్‌కి వెళ్ళాడు.

గంట తరువాత...ఇంకో పది నిముషాలలో విశ్రాంతి అవుతుందనగా థియేటర్‌లోకి అడుగుపెడుతున్న అతన్ని చూసి గేట్‌కీపర్ ఆశ్చర్యపోయాడు.

చిరుచీకటిలో చిత్కళని ఆనవాలు పట్టటానికి కొంత సమయం పట్టింది చరణ్‌కి. ఆమెకి దగ్గరగా వున్న సీట్లో కూర్చుని ఊపిరి బిగపట్టి ఎదురుచూడసాగాడు.

లైట్లు వెలగగానే లేచి ఆమెని సమీపించి చేతిలోని ప్యాకెట్ చిత్కళకి అందించి "హ్యాపీ బర్త్‌డే చిత్కళా!" అనేసి దూరంగా ఖాళీగా ఉన్న ఓ సీట్‌లో కూర్చున్నాడు.

ఆ రోజున గుడిలో మాట్లాడుకున్నాక రెండేళ్ళ తరువాత మళ్ళీ ఆమెతో అతను అదే మొదటిసారిగా మాట్లాడటం.

అతన్ని అంత దగ్గరగా చూడగానే ఇన్ని రోజులుగా దూరంగా ఉన్నామన్న రోషం, ఇక దగ్గరవ్వలేమన్న నిరాశ, ఇక మిగిలిందంతా అశాంతే అన్న దుఃఖం ఒక్కసారిగా కమ్ముకుని చిత్కళని కలవరపెట్టాయి.

కళ్ళలోనీళ్ళు గిర్రున తిరిగాయి. తనచేతిలో అతనిచ్చిన ప్యాకెట్ ఉందన్న విషయం అప్పుడు గమనించింది.

దానిని విప్పకుండానే అది ఏమిటో ఆమెకి తెలిసినట్లయింది. కాలికి పట్టాలు పెట్టుకోవటం మానేసి చాలా రోజులయింది. అది చరణ్‌కి తెలిసే అవకాశంలేదు. అయితే అతను ఇప్పుడు మువ్వలు ఎక్కువగా ఉన్న వెండి పట్టాలు ఇచ్చాడని ఆమెకి తోచగానే

చటుక్కున నిలబడింది. తనని ఒకాప అని అతను నిన్ననే పిలిచినట్లు ఆ తరువాత జరిగినవన్నీ అబద్ధాలనీ మళ్ళీ ఇప్పుడు అతను తనకు ఈ బహుమతి ఇవ్వటానికే రెక్కలు కట్టుకుని వచ్చి నట్లు ఆమెకి తోచింది. తమ తండ్రుల పోట్లాటలు, పెరిగిన అడ్డుగోడలు అన్నీ అసత్యాలనీ  తమ ఇద్దరి స్నేహమే నిజమని అనిపించింది. మరునిముషం వాస్తవ పరిస్థితులు గుర్తుకి వచ్చి కూలబడింది. తన్నుకువస్తున్న దుఃఖాన్ని ఎలా కంట్రోల్ చేయాలో తెలియక రెండు చేతులలో మొహాన్ని దాచుకుంది.

"చిత్కళా! ఏమిటింత సిల్లీగా..." అంది లావణ్య ఓదారుస్తూ.

ఆ పలకరింపుతో చిత్కళ బరస్ట్ అయింది.

"నేనో సంగతి చెప్పనా?...మీ కథకి కూడా ఇంటర్వెల్ అయిపోయింది. ఇప్పుడు ధైర్యం తెచ్చుకుని మీ ఇద్దరూ సెకండ్ పార్ట్ మొదలుపెట్టాలి. లే...లేచి వెళ్ళి అతనిపక్కన కూర్చో...పాపం అతను నీకోసం ఎంత ఆశగా ఎదురుచూస్తున్నాడో తెలుసా?లే..." లావణ్య ప్రోత్సహించింది.

"లావూ! నీకు తెలియదు. మేం కలుసుకోవటం కల్ల...అంత లెవల్లో పోట్లాడుకున్నాక మా పెళ్ళికి ఎవరు ఒప్పుకుంటారు?"

లావణ్య నవ్వింది. "నేను నవ్వానని నీకు కోపంవస్తే సారీ!...మైనర్లుగా ఉన్నప్పుడు ఇద్దరూ కలిసి జీవించాలని వెయ్యి రకాలుగా ఆలోచించారు. ఇప్పుడు మీ ఇద్దరూ మేజర్లు... అతనికి ఆల్రెడీ క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం వచ్చేసింది.సంవత్సరం తర్వాత ఉద్యోగంలోచేరి తనకాళ్ళపైన తాను నిలబడగలడు. ఇక మిమ్మల్ని ఎవరు అడ్డుకోగలరు?"

చిత్కళ కళ్ళు తుడుచుకుంది. "చరణ్‌కి జాబ్ వచ్చిందా?...ఆ సంగతి నీకు ఎలా తెలుసు?"

లావణ్య నవ్వుకుంది. ఐఐటిలో చదువుతున్నవాడికి క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం వచ్చే ఉంటుంది అని లావణ్య ఊహించింది అంతే!... "మా అన్నయ్య స్నేహితుడు కూడా ఐఐటిలో ఎంటెక్ చేస్తున్నాడు..." నోటికి వచ్చిన అబద్ధం చెప్పింది. "ఇక ఆలోచించకు... నువ్వు రావటంలేదని డిజప్పాయింట్ అయి చరణ్ బయటికి వెడితే ఇక నీకు రెండో అవకాశం రాదు"

చిత్కళ దిగ్గున లేచింది.

పరుగున వెళ్ళి చరణ్ పక్కన కూర్చుంది.

అతను ఆత్రంగా ఆమె చేయి అందుకున్నాడు. చిత్కళ రెండు చేతులూ అందించింది. అతని భుజంపై తలవాల్చి కళ్ళు మూసుకుంది.

ఆమె జుట్టు నుండి వస్తున్న షాంపూ పరిమళం, అతను ఉపయోగించిన డియోడరెంట్ కలిగిస్తున్న మత్తయిన సువాసన ఇద్దర్నీ ఎప్పుడో గుడిలో కలుసుకున్న సన్నివేశంలోకి తీసుకువెళ్ళాయి. ఇద్దరూ వివశులయ్యారు. పరవశంలో తలమునకలయ్యారు.



నిజానికి ఆ గంటసేపూ వాళ్ళు మాట్లాడుకున్నది తక్కువే. ఒకరి సాన్నిధ్యాన్ని ఇంకొకరు తనివితీరా అనుభవిస్తూ తెరపైన శుభం అని కనబడగానే అసంతృప్తితో విడిపోయినుంచున్నారు.

ఆ మర్నాడు ఎక్కడ కలుసుకోవాలి?

"యూనివర్సిటీ లైబ్రరీకి వస్తావా?..." చరణ్ అడిగాడు.

"నన్ను ఎలా చేస్తారా?" అమాయకంగా అడిగింది చిత్కళ.

"నన్నూ ఎలాచేయరు...అందుకే ఎంచక్కా ఇద్దరం లాండ్‌స్కేప్ గార్డెన్స్‌లో కబుర్లు చెప్పుకోవచ్చు. మన కాలనీకి పదిహేను కిలోమీటర్లు దూరం కాబట్టి ఎవరికంటా పడం... సరేనా?..." అన్నాడు చరణ్.

చిత్కళ ఒప్పుకుంది.

ఆ మర్నాడు కలిసినప్పుడు మూగగా గడిచిన రోజులని ఒకరికి ఒకరు చెప్పుకున్నారు.

"నేనయితే ఎంసెట్ రాయనని తెగేసి చెప్పాను. ఎవరికోసం ఎంసెట్ రాయాలి ఎవరికోసం డాక్టర్ అవ్వాలి అనుకున్నాను. అమ్మ అయితే పాపం బాగా అప్‌సెట్ అయింది. ఇప్పుడు బిఎస్సీలో కూడా సరిగ్గా చదవలేకపోతున్నాను" చిత్కళ అంది.

"ఇదంతా నా వల్లనే జరిగింది. అప్పుడే నేను చక్కగా ఆలోచించి ఉంటే నీ కెరీర్ దెబ్బతినేది కాదు. ఏదోవిధంగా నీకు ధైర్యం ఇచ్చేదిపోయి నేనే అధైర్యపడి చేతులు కట్టుకుని కూర్చున్నాను. నాదే తప్పు..." చరణ్ పశ్చాత్తాపం ప్రకటించాడు.

చిత్కళ చప్పట్లు చరిచింది. "ఆహా! ఏం డైలాగ్ బాబూ! ఆ రోజుల్లో నీ వయసు ఎంత?...పద్దెనిమిది నిండి ఉండవు. నువ్వు ఇంకోలాగా ఎలా రియాక్ట్ అవగలవు? తప్పు నీది కాదు నాదీ కాదు..."

"మరి ఎవరిది?...మా నాన్నదా?...మీ డాడీదా?..."

"ఎవరిదీ కాదు బాబూ...ఎవరి తప్పూ లేకుండా ఎన్నెన్నో చిత్రాలు జరగవచ్చు... ఎన్నెన్నో కష్టాలు కలగచ్చు. ఈ జీవితం ఎంత కాంప్లెక్సో తెలుసా?...అసలు చిత్కళ అనే అమ్మాయి చరణ్ అనే అబ్బాయిని ప్రేమించటానికి కారణమేమిటో ఊహించగలవా?"

సరైన సమాధానం ఇవ్వాలని చరణ్ తీవ్రంగా ఆలోచించాడు. "ఆ! పాపం అప్పుడు గుబురుగా ఉండే ఆ మామిడిచెట్టుకి ఉన్న ఉయ్యాల మన ఇద్దర్నీ కలిపింది"

చిత్కళ క్విజ్ మాస్టర్‌లాగా "దట్స్ ఓన్లి హాఫ్ ఆఫ్ ది ఆన్సర్ మిస్టర్ చరణ్! ఐ కెనాట్ గివ్ యూ ఫుల్ మార్క్స్ ఫర్ దట్..." అంది.

"పోనీ ఆ మిగిలిన సగం ఏమిటో చెప్పు..."

చిత్కళ పెదవులపైన కొంటె నవ్వు మెరిసింది. "అభిషేక్..."

"ఏమిటీ?! నువ్వు నన్ను ప్రేమించటానికి ఒక అబ్బాయి కారణమా?..." కీచుగా అరిచాడు చరణ్.

"అవును"అంటూ తల ఊపింది చిత్కళ.అర్చన అన్న అమ్మాయి కూడా అనుకుంది.

"అతన్ని...ఆ అభిషేక్‌ని నువ్వు ఇష్టపడేదానివా?..." చరణ్ గొంతులో వినబడ్డ అసూయ చిత్కళని వినోదపరిచింది.

"అభిషేక్‌ని నేను బాగా లైక్‌చేసేదాన్ని..." చిత్కళ సిగ్గుపడ్డట్లు తలదించుకుంది. ఓరగా చరణ్‌ని చూస్తూ "ఒకసారి అయితే అతన్ని ఎంత గట్టిగా ముద్దుపెట్టుకున్నానో తెలుసా?..." అంది.

చరణ్ మొహం నల్లబడింది. "ముద్దా?...ఇదంతా ఎక్కడా?..."

"హైదరాబాద్ రాకముందు..."

చరణ్ విస్తుపోయాడు. "ఎయిత్‌క్లాస్‌లోనే ఒక అబ్బాయిని ముద్దుపెట్టేసుకున్నావా...?" అన్నాడు.

అతని మాటలు విననట్లు చెప్పుకుపోసాగింది చిత్కళ. "అంత గట్టిగా ముద్దుపెట్టుకునేసరికి గుక్కపట్టి ఏడ్చాడు కూడా..."

ఆ మాటలు అతని బుర్రలోకి ఇంకి అర్థమవటానికి కొన్ని క్షణాలు పట్టింది.కొంచెం బలంగానే చిత్కళ భుజంపైన కొట్టాడు. "దిస్ ఈజ్ టూ మచ్!...నేను ఎంత రగిలిపోయానో తెలుసా?..."

అభిషేక్, అర్చన, క్విజ్ కథ మొత్తం చెప్పింది చిత్కళ."ఆ విధంగా మేము హైదరాబాద్ వచ్చాం అన్నమాట!... మా ఇంటికి మేము వస్తేనే కదా నిన్ను చూడగలిగాను..." చిత్కళ కిలకిలా నవ్వింది. "అయినా ఇది చాప్టర్ నెంబర్ ఫోర్ నాయనా..." అంది.

"చాప్టర్ ఫోరా?...ఏమిటది?..." అయోమయంగా అడిగాడు చరణ్.

"ఇదీ..." అంటూ బ్యాగ్‌లోంచి ఓ కాయితం తీసింది చిత్కళ. అది అతను చివరిగా రాసిన ఉత్తరం. తనతో ప్రస్తావించాల్సిన వెయ్యి విషయాలు ఏమిటో ఇంకోరకంగా చెప్పమని చిత్కళసవాలుచేస్తే చరణ్ ప్రతిపాదించిన పది అధ్యాయాలు అందులో ఉన్నాయి. అందులో నాలుగో చాప్టర్. మనం దూరంగా ఉన్నప్పుడు ఒకరికి ఒకరు ఎలాంటి పజిల్స్, చిక్కుప్రశ్నలు రాసుకోవాలి, దగ్గరగా ఉన్నప్పుడు ఎలా టీజ్ చేసుకోవాలి ఎట్‌సెట్రా...

రెండున్నరేళ్ళ క్రితం రాసిన ఆ ఉత్తరాన్ని చిత్కళ ఇంకా పదిలపరచటం చూసి చరణ్ కదిలిపోయాడు."ఛా! మా నాన్న ఆ ఎలక్షన్స్‌లో నిలబడకుండా ఉంటే నేను చిత్కళని పెళ్ళిచేసుకుంటాను అని డిక్లేర్‌చేసి ఈ క్షణాన నిన్ను పెళ్ళిచేసుకునేవాడ్ని..."

జవాబు తెలిసినా చిత్కళ "అదే పని ఇప్పుడు ఎందుకు చేయలేవు?" అనడిగింది.

"ఎలా కుదురుతుంది చిత్కళా!..." అసహాయంగా అన్నాడు చరణ్. "నేను అమెరికాలో ఎమ్ఎస్ చేయాలని అనుకుంటున్నాను. అలాగే నువ్వు కూడా ప్లాన్‌చేసుకుని ఉండచ్చు. ఆ ప్లాన్స్ అన్నీ ఓ రూపుకి వచ్చిన తరువాత తెగించవచ్చు కాని ఈలోగా ఎలా కుదురుతుంది?..."



"అంటే మనం బలపడటానికో స్థిరపడటానికో మన పేరెంట్స్ నుంచి సాయం తీసుకుని ఆ తరువాత అదే పేరెంట్స్‌ని ఎదిరించటం కరక్టా..." చిత్కళ ఠక్కున అడిగింది.

చరణ్ తడబడ్డాడు. "ఎదిరించటం అంటే నచ్చచెప్పే ప్రయత్నం చేస్తాం..."

"అవన్నీ ఉట్టి కబుర్లు చరణ్! వాళ్ళు ఒప్పుకోరని మనకి తెలుసు కదా!"

"ఓకే! నువ్వు అన్నది సెంట్ పర్సెంట్ ట్రూ! మరి మనమేం చేయాలి?" చరణ్ అనుకోలేదు కాని కాసింత విసుగ్గా అడిగాడు.

"పేరెంట్స్‌తో విభేదించటానికి ఇప్పుడే సన్నద్ధమయ్యాం కాబట్టి ఇప్పటి నుండి వాళ్ళపైన ఆధారపడటం తగ్గించాలి"

చిత్కళ వంక మెచ్చుకోలుగా చూశాడు చరణ్. "నిజానికి మా ప్రొఫెసర్ నాకు టీచింగ్ ఎసిస్టెంట్‌గా ఉద్యోగం ఇస్తానని అన్నాడు. ఫైనల్ ఇయర్‌లో ఎంజాయ్ చేయకుండా ఆ పేపర్లు దిద్దటం, క్లాసులు తీసుకోవటం ఎందుకు అనుకున్నాను. ఈ రోజే ఆయనకి ఫోన్‌చేసి రిక్వెస్ట్ చేస్తాను. మరి నీ సంగతి ఏమిటి?"

పేలవంగా నవ్వింది చిత్కళ. "నా పరిస్థితి చాలా అధ్వానంగా ఉందిలే!... డిగ్రీలో మొదటి సంవత్సరం పరీక్షలు ఎంత ఘోరంగా రాశానో తెలుసా? అసలు నాకు చదువంటేనే ఇంట్రెస్ట్ పోయింది"

చరణ్ ఆమెని గట్టిగా మందలించాడు. "నువ్వు ఎమ్ఎస్సీ ఆ తరువాత పిహెచ్‌డి చేస్తాను అని నిర్ణయం తీసుకో...నీకున్న తెలివితేటలన్నీ వృధా చేసుకుంటావా? అయినా నీ జీవితం, నీ కెరీర్ ముందు ఓ అబ్బాయి నథింగ్!...నో! నువ్వు ఈ క్షణం నించి బాగా చదవాలని అనుకుంటున్నావు...దట్స్ ఆల్!

చిత్కళ ఠక్కున అడిగింది. "అలాగే నీ జీవితం, నీ కెరీర్ ముందు ఈ అమ్మాయి నథింగ్ అని అనుకుంటున్నావా?..." అని.

చరణ్ బాధపడ్డాడు. "నీకు నచ్చచెప్పటానికి అలా చెప్పాను గాని యు ఆర్ మై లైఫ్...నువ్వు లేకపోతే నా కెరీర్‌కి అర్థంలేదు"

"ఎగ్జాక్లీ!...అలా ఫీలయ్యే నేను నిర్లిప్తతకి అలవాటుపడ్డాను"

"ఓకే! ఇప్పటి నుండి అవన్నీ మరిచిపోదాం...సరేనా?..."

ముందు ముందు ఎలా కలుసుకోవాలో, ఎలా కమ్యూనికేట్ చేసుకోవాలో వివరాలు చెప్పుకున్నారు.

ఒకే బస్‌లో దిగకుండా ఈ చివర నుండి ఆ చివర వరకూ ప్రయాణం చేసి ఆ గంటన్నరా రకరకాల కబుర్లు చెప్పుకున్నారు.

ఆ మరుసటి ఏడు అతను ఎమ్ఎస్ చదవటానికి అమెరికా వెళ్ళాడు.

ఉద్యోగంలో చేరేముందు అతను ఒకసారి ఇండియా వచ్చాడు. ఉన్నది ఇరవై రోజులే కాని ఎంత లేదన్నా ఆరుసార్లు అతనూ, చిత్కళా రహస్యంగా కలుసుకున్నారు.

అప్పుడు చిత్కళ బయోటెక్నాలజీలో ఎమ్ఎస్సీ చేస్తున్నది.

ఆ సమయంలోనే వారిమధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు పెరిగాయి. 'మనలాంటివాళ్ళు ఇ మెయిల్‌కి నిజంగా థాంక్స్ చెప్పాలి...' అని మనస్ఫూర్తిగా అనేది చిత్కళ.

గోడపై నుండి కాయితాలు పడేసి సందేశాలు సులువుగా పంపుకునేవాళ్ళు.మధ్యలో ఉన్న ఖండాలనీ, మహాసముద్రాలనీ, వేల మైళ్ళనీ ఇట్టే దాటేసి నిముషాలలో కంప్యూటర్ తెరపైన ప్రత్యక్షమయ్యే ఇ మెయిల్ మళ్ళీ ఆ బంగారు రోజులని ఇద్దరికీ అనుభవంలోకి తెచ్చింది.

కాలనీలో వంద అడుగుల దూరంలో ఉన్న ఇంటర్‌నెట్ కేఫ్ చిత్కళ పాలిట దేవాలయం అయింది. వారానికి రెండుసార్లు తప్పకుండా దర్శించేది. అరగంట చరణ్‌తో చాటింగ్ లేదా మెయిల్ ఇవ్వటం ఇంకో అరగంట బయోటెక్నాలజీలో కొత్త సమాచారం సేకరించటం...ఇదీ ఆమె కార్యక్రమం. క్రమంగా చాటింగ్‌కి సమయం పెరిగి రెండో పనికి అయిదు నిముషాలు కూడా మిగిలేది కాదు. ఇంటర్‌నెట్ కేఫ్‌కి వెళ్ళటానికి ఉపయోగించేది ఆ సాకునే! అందుకనే క్రితం వారం సేకరించిన సమాచారాన్ని ఈ వారమే లభ్యమయినట్లు ఇంటికి తీసుకువెళ్ళేది చిత్కళ.

ఆ మరుసటి సంవత్సరం చిత్కళ ఎమ్ఎస్సీ అయింది. బయోటెక్నాలజీ లాబొరేటరీలో రీసెర్చ్ ఫెలోగా చేరింది. లాబ్‌లో ఇంటర్‌నెట్ సదుపాయం ఉండటంతో రోజుకి రెండుసార్లు మెయిల్ ఇవ్వటం మొదలుపెట్టింది చిత్కళ. ప్రతిరోజూ ఒకరి సమాచారం ఇంకొకరికి తెలుస్తూనే ఉండటంతో అతను ఎక్కడో దూరంగా అమెరికాలో ఉన్నాడే అన్న దిగులు దూరమయింది. ఒకసారి చరణ్ జోక్ చేశాడు...నా గురించి నీకు తెలిసినంత త్వరగా, క్షుణ్ణంగా మా పేరెంట్స్‌కి కూడా తెలియదు అని.

ఆ సమయంలోనే డాట్‌కామ్ బరస్ట్ అవటం అమెరికా ఆర్థికమాంద్యానికి గురి అవటం జరిగింది. జీతాలు తగ్గాయి. లే ఆఫ్‌ల వల్ల ఉద్యోగాలు పోయాయి. దాంతో చరణ్ ఉద్యోగంలోకూడా అస్థిరత చోటుచేసుకుంది."ప్రతిరోజుకీ ఏదో ఒక మార్పువస్తూనే ఉంది. నువ్వు సాధ్యమయినంత త్వరగా నీ పిహెచ్‌డి పూర్తిచేసుకుని పోస్ట్ డాక్టరేట్ వర్క్‌కి ఇక్కడికి రా...ఇద్దరం ఇక్కడ ఉంటే మనవాళ్ళని ఒప్పించటం చాలా ఈజీ...వాళ్ళకి ఇంత దూరంగా ఉంటే వాళ్ళేం చేయలేరు కాబట్టి తప్పక ఒప్పేసుకుంటారు" అని ఓసారి మెయిల్ ఇచ్చాడు చరణ్.

ఆ మెయిల్‌కి చిత్కళ పెద్ద సమాధానమే ఇచ్చింది.

చరణ్,

నీ మెయిల్ ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు. నేనూ అమెరికాలో నిన్ను చేరటం అన్నది రేపే జరుగుతుంది అన్నంత ధైర్యం వచ్చింది. నిజానికి నా పిహెచ్‌డి అవటానికి ఇంకో మూడు నాలుగేళ్ళు పడుతుంది. నీ మెయిల్ చదివి ఊహాలోకాలలో తేలిపోయాను.



కాని ఒక్క విషయంలో అసంతృప్తిగా ఉంది. కంప్యూటర్ ముందునించి లేచాక నువ్వు రాసిన అక్షరాలు మాయం. ఏదన్నా సందేహంవచ్చి నువ్వేం రాశావో సరిచూసుకోవాలంటే మళ్ళీ యాహూకి వెళ్ళాలి నా ఇన్‌బాక్స్ ఓపెన్ చేయాలి.అదే ఇ మెయిల్స్‌తో తంటా!

కాయితాలపైన రాసుకునే మామూలు ఉత్తరాలయితే నత్త నడకన ఆలస్యంగా వస్తాయని వాటిని స్నెయిల్ మెయిల్ అని ఎగతాళి చేసినా వాటివల్ల ఎన్నో లాభాలున్నాయి. నవ్వకు...ఐ స్టిల్ లవ్ దోజ్ లెటర్స్! ఎందుకో చెబుతాను.

పాకిస్తాన్‌పైన క్రికెట్‌లో ఇండియా గెలిచిన మర్నాడు లాబ్‌కి బస్‌లో వెడుతుంటే నా పక్క సీట్‌లో కూర్చునే డాక్టర్ కోమలి ఇక సణుగుడు మొదలుపెడుతుంది. క్రికెట్‌ని టీ.వీ.లో చూపించటంవల్ల వాళ్ళపిల్లల చదువులు ఎలా దెబ్బతింటున్నాయో ఒక్కొక్క సబ్జెక్ట్‌లో వాళ్ళకి వస్తున్న మార్కులు ఉదహరించి మరీ చెబుతుంది. ఇండియా గెలిచిందన్న ఆనందం అంతా ఆవిరి అవుతుంది.

ఆ సుత్తిని తట్టుకోవటానికి నా దగ్గర ఒకటే అస్త్రం ఉండేది. అది నీనుండి పోస్ట్‌లో వచ్చిన ఉత్తరం. ఆవిడ సణుగుతూనే ఉంటుంది నేను కామ్‌గా నా బ్యాగ్ తెరిచి నీ ఉత్తరాన్ని అలా చేత్తో ముట్టుకుంటాను. నువ్వు రాసిన ప్రతి అక్షరం నా కళ్ళముందు ప్రత్యక్షం అవుతుంది. కావాలంటే ఇంకోసారి ఆ ఉత్తరాన్ని చదవగలను. కోమలి ఆంటీ సుత్తిని విస్మరించగలను...ఇ మెయిల్‌లో ఆ సదుపాయం ఏది?

ఓ రోజున డాడీ వచ్చి ఏదో సంబంధం గురించి మాట్లాడుతారు. నేను ఇప్పుడప్పుడే పెళ్ళి వద్దు అన్న నా స్టాండర్డ్ డైలాగ్ చెబుతాను. ఆయన విసుక్కుంటారు. జాతకాలు కుదిరితే అప్పుడు పెళ్ళిచూపులకి ఏర్పాటు చేద్దాం అని రాజీమార్గం సూచిస్తుంది అమ్మ. ఆ జాతకాలు ఎక్కడ కుదిరిపోతాయో అన్న కంగారు పట్టుకుంటుంది. నాది నష్ట జాతకమో దరిద్రపు జాతకమో అయితే బాగుండు అనిపిస్తుంది.

ఆ వేదన నుండి తప్పించుకునేందుకు నా చిట్కా ఒక్కటే!...తలనొప్పిగా ఉందని చెప్పి గదిలో చీకటిలో కూర్చుని నీ ఉత్తరాన్ని గుండెలకి హత్తుకుంటాను. అమెరికా నుండి స్వయంగా నువ్వే వచ్చి నా భుజం గుండెలు కాదు తట్టి నాకు సాంత్వన కలిగించినట్లు తోస్తుంది. ఇ మెయిల్ అలా ఓదార్చగలదా?

కావలసిన సమాచారం లైబ్రరీలో దొరకనప్పుడో, ఎక్స్‌పెరిమెంట్స్ సరిగా ప్లాన్‌చేయలేదని మా గైడ్ విసుక్కున్నప్పుడో, సరి అయిన ఫలితాలు రాక ఒకే ప్రయోగం మళ్ళీ మళ్ళీ చేయాల్సివచ్చినప్పుడో, రికార్డ్ బుక్‌లో పదిలంగా దాచుకున్న నీ ఉత్తరాన్ని అలా స్పర్శిస్తే చాలు ఆ దిగుళ్ళన్నీ అమృతాంజన్ రాసినట్లు గాయబ్ అయిపోతాయి. కవరు పైన నా పేరుని అందంగా రాయటానికి నువ్వు ఇంకొంచెం జాగ్రత్త సంగతి గమనించగానే ఎంత ఆనందం కలుగుతుందో తెలుసా? ఎప్పటికైనా ఇ మెయిల్ ఆ ఆనందాన్ని ఇవ్వగలదా?

తక్షణం అందుతుంది అన్న ఒక్క ప్లస్ పాయింట్ తప్పిస్తే ఇ మెయిల్ కన్నా

మామూలు ఉత్తరాలే మేలు అని నాకు అనిపిస్తుంది.

బాగా బోర్ కొట్టానేమో నాకు తెలియదు కాని ఇక సెలవు తీసుకుంటాను.

నీ చిత్కళ.

ఆ మెయిల్ చూసి చరణ్ నవ్వుకున్నాడు. చిత్కళ ప్రాక్టికల్‌గా ఆలోచిస్తుంది. అదే సమయానికి చిన్నచిన్న అనుభూతులకి, చాలామంది విస్మరించే చిన్న చిన్న విషయాలకి, విలువనిచ్చే సెంటిమెంట్‌ని కూడా ప్రదర్శిస్తుంది.

చిత్కళ మామూలు ఉత్తరాల ప్రయోజనాలని వర్ణిస్తూ మెయిల్ ఇచ్చిన రెండు నెలలకి సదరన్ గ్రిడ్ ట్రిప్ అవటంతో హైదరాబాద్‌లో చాలాసేపు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడింది. ల్యాబ్‌లో చీటికీమాటికీ కరంట్‌పోవటంతో ఆరోజు ఏ పనీ చేయలేకపోయింది చిత్కళ.

ఆ చిరాకుతో ఇల్లు చేరేసరికి ఇంట్లో కరంట్ లేదు.

ట్రాన్‌సిస్టర్ తీసుకుని వివిధభారతి వినసాగింది. ఈ పాట చరణ్‌కి ఇష్టం, ఈ పాట ఉన్న సినిమాని మేమిద్దరం చూశాం అనుకుంటూ కొన్ని పాటలు విన్నది.

ఎనిమిది గంటలకి స్టేషన్ మార్చి న్యూస్ వింది.

అప్పటికి గంట క్రితం న్యూయార్క్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ని కొన్ని విమానాలు కూల్చేశాయి అని, వాషింగ్‌టన్ లాంటి ఇతర ప్రదేశాలపైన కూడా విమాన దాడులు జరిగాయి అని విని వణికిపోయింది. చరణ్ ఉన్నది న్యూయార్క్‌లోనే!

వెంటనే పెరటివైపు వెళ్ళి చీకటిలో చరణ్ ఇంటివైపు చూసింది. ఏ అలికిడి లేదు.

...నా గురించి నీకు తెలిసినంత త్వరగా క్షుణ్ణంగా మా పేరెంట్స్‌కి కూడా తెలియదు అని చరణ్ జోక్‌చేయటం గుర్తుకి వచ్చింది.

వెంటనే సైబర్‌కేఫ్‌కి బయల్దేరింది.

"చీకటిలో ఎక్కడికే?..." అంది రోహిణి.

"అమ్మా! చాలా అర్జంట్...ఓ మెయిల్ ఇవ్వాలి.లాబ్‌లో మరిచిపోయాను..."చెప్పులు తొడుక్కుంటూ అంది చిత్కళ.

"కరంట్ లేనప్పుడు మెయిల్ ఎలా ఇస్తావు? ఆ సైబర్ కేఫ్‌లో అయినా కరంట్ ఉండాలిగా?..." అంది రోహిణి.

అంత చిన్న విషయం తనకి తట్టనందుకు తిట్టుకుంది చిత్కళ.

కరంట్ వచ్చాక ఒక్కక్షణం ఆగలేదు.

చరణ్‌కి ఇచ్చిన మెయిల్ రెండు నిముషాల తరువాత బౌన్స్ అవటంతో చిత్కళకి మతిపోయింది.

ఇంకోసారి ప్రయత్నించింది. మళ్ళీ మెయిల్ డెలివరీ ఫెయిల్యూర్ నోటీస్ వచ్చింది. ఏమయింది?...చరణ్‌కి మెయిల్స్ ఎందుకు వెళ్ళటంలేదు?...చిత్కళకి ఏడుపు



ఒకటే తక్కువ. ఆమె చేతులు నియంత్రణ లేకుండా వణుకుతున్నాయి. అప్పుడు గమనించింది. వణుకుతున్న చేతులు ప్రతిసారీ చరణ్ పేరులో ఎక్స్ట్రాగా ఎన్ అనే అక్షరం టైప్ చేస్తున్నాయి!

చెప్పలేనంత రిలీఫ్ కలిగింది. ఈసారి సరి అయిన ఐడి టైప్ చేసింది. చరణ్‌కి మెయిల్ పంపింది. ఈలోగా చరణ్ ఆన్‌లైన్ ఉన్నాడని స్క్రీన్‌పైన సంకేతం కనబడింది.

గబగబా మెసెంజర్‌కి వెళ్ళి చాటింగ్ మొదలుపెట్టింది.

న్యూయార్క్‌లోనే ఆ ట్విన్ టవర్స్‌కి కొద్ది దూరంలోనే చరణ్ ఆఫీస్‌ట. అతను ఆఫీస్ చేరేసరికి టవర్స్ కూలిపోతున్నాయిట...సహాయక చర్యలు, రక్తదానాలు లాంటి హడావిడి అయ్యాక తనగురించి కంగారుపడుతూ ఉంటారని అతనికి స్ఫురించిందిట... వెంటనే ఆన్‌లైన్ అయ్యే ప్రయత్నం చేశాడుట.

"థాంక్ గాడ్ చరణ్! నేనెంత వర్రీ అయ్యానో తెలుసా? అన్నట్లు మీ పేరెంట్స్‌కి ఇన్ ఫర్మేషన్ ఇచ్చావా?"

"లేదు చిత్కళా! నా సెల్ నా స్నేహితుడు తీసుకువెళ్ళాడు... ఫోన్ బూతులన్నీ రద్దీగా ఉన్నాయి. మెయిల్ ఇచ్చాను కాని వాళ్ళు ఎప్పుడు చూసుకుంటారో?! మళ్ళీ ఇంకోసారి ఫోన్ చేయటానికి ప్రయత్నిస్తాను"

"చరణ్! అయితే వెంటనే ఆ పని చెయ్యి...మనం తరువాత మాట్లాడుకుందాం... పాపం ఆంటీ ఎంత కంగారుపడుతున్నారో!...ఉంటాను బై..."

చిత్కళ సైబర్ కేఫ్ బయటికి వచ్చేసరికి అరవింద కనబడింది. "కళా! అన్నయ్య న్యూయార్క్‌లోనే ఉన్నాడు. డాడీ ఫోన్‌చేయటానికి ప్రయత్నిస్తున్నారు.నేను మెయిల్ ఇవ్వాలని ఇలా వచ్చాను" అంది. ఎన్నో ఏళ్ళ తరువాత ఆ అమ్మాయి చిత్కళతో మాట్లాడింది.

చరణ్ క్షేమంగానే ఉన్నాడని చెప్పి అరవిందని ఓదార్చాలనిపించింది కాని బండారం బయటపడుతుందని నిగ్రహించుకుంది చిత్కళ."డోంట్ వర్రీ! హీ విల్ బి ఆల్‌రైట్..." అంది ధైర్యం చెబుతూ.

అరవింద చాలా నెర్వస్‌గా ఉందని గ్రహించి చిత్కళ "నేను సాయంచేయనా?" అని అడిగింది.

అరవింద తల ఊపి తన మెయిల్ ఐడి పాస్‌వర్డ్ చెప్పింది.

చిత్కళ టైప్ చేస్తుంటే అరవింద కళ్ళు మూసుకుని ఏదో ధ్యానం చేసుకోసాగింది.

కొన్ని నిముషాల క్రితం చరణ్ నుండి వచ్చిన మెయిల్‌ని క్లిక్‌చేసి అది ఓపెన్ అయ్యాక "అరవిందా! మీ అన్నయ్య మెయిల్ ఇచ్చాడు...చదువు" అంటూ కుర్చీలోంచి లేచి కాబిన్ బయటికి వచ్చింది చిత్కళ.

రెండు మూడుసార్లు చదివితేకాని అరవిందకి తృప్తి కలగలేదు.

లాగ్ ఆఫ్ కాకుండానే లేచి పక్కనే ఉన్న చిత్కళతో "కళా! అన్నయ్య సేఫ్‌గా

ఉన్నాడు..." అని చెప్పింది.

నేను చెప్పానుగా అన్నట్లు చిత్కళ ఆమెని దగ్గరగా తీసుకుంది. చిత్కళని పట్టేసుకుని అరవింద వలవలా ఏడవసాగింది.

"ఏయ్! ఏమిటా పనీ?... అందరూ మనల్నే చూస్తున్నారు తెలుసా?... అయినా ఇంట్లో అమ్మకి ఈ మంచి వార్త చెప్పాలి కాని ఇలా ఏడుస్తూ కూర్చుంటావా?" చిత్కళ మెత్తగా మందలించింది.

"కళా! నేను సరిగా నడవగలనో లేదో నాకు అనుమానంగా ఉంది...మా ఇంటివరకూ వస్తావా?" అరవింద సంశయిస్తూనే అంది. ఆ అమ్మాయి ఇంకా వణుకుతూనే ఉంది.

"నో ప్రాబ్లెమ్" అంది చిత్కళ.

చరణ్ ఇంటిముందు అతని తల్లి నుంచుని ఉంది.అరవింద దూరంనించే "మమ్మీ అన్నయ్య మెయిలిచ్చాడు" అని అరిచింది. తరువాత చిత్కళ వంక తిరిగి "థాంక్ యూ కళా! థాంక్ యూ" అంది. "అండ్ సారీ ఎబౌట్ ఆల్ దోజ్ థింగ్స్"

"ఓకే అరవిందా! బై అండ్ గుడ్‌నైట్" అంది చిత్కళ. తనతో కలిసి వచ్చినందుకు ఇప్పుడు అరవిందకి అక్షింతలు పడతాయేమో అని అనుకుంటూ వెనక్కి తిరిగింది.

"థాంక్ యూ చిత్కళా! బై..." ఆ గొంతు అరవిందది కాదు. అరవింద తల్లిది.కాదు కాదు తన చరణ్ తల్లిది!

సంభ్రమంతో చిత్కళ గిరుక్కున తిరిగింది.

అరవిందతోపాటు ఆమె తల్లి కూడా చేయి ఊపుతున్నది.

చిత్కళకి పట్టరాని సంతోషం కలిగింది. గాలిలో తేలిపోతూ ఇంటికి వెళ్ళింది.చరణ్! ఈరోజు ఆంటీ నన్ను పలకరించింది.మన కుటుంబాల మధ్య వైషమ్యాలు మెల్లగా కరిగిపోతాయేమో అంటూ మనసులోనే చరణ్‌తో సంభాషణ నడిపింది.

ఇంట్లో సుధాకర్, రోహిణి, బామ్మ టీ.వీ చూస్తున్నారు. ఒకదాని తరువాత ఇంకో విమానం వచ్చి ట్విన్ టవర్స్‌ని ఢీకొట్టటం ఆ తరువాత ఆ భవంతులు కుప్పకూలటం చూపిస్తున్నారు. అప్పటికి ఆ దృశ్యం ఎన్నోసార్లు వచ్చినా వాళ్ళంతా తగ్గని ఆశ్చర్యంతో కళ్ళార్పకుండా చూస్తున్నారు.

మొదటిసారి చూసిన చిత్కళ షాక్‌కి గురి అయింది. ఇంత ఘోర విపత్తునుంచి చరణ్ తప్పించుకున్నాడా? ఆ విమానాలు లక్ష్యం మార్చి అరమైలు అవతల ఉన్న చరణ్ ఆఫీస్‌ని ఢీకొట్టి ఉంటే?! అప్రయత్నంగా నోటికి చేయి అడ్డుపెట్టుకుని సోఫాలో కూలబడింది. మెదడు గడ్డకట్టినట్లయింది.

"ఇంటర్‌నెట్‌తో ఏమిటా అర్జంట్ పని?" సుధాకర్ అడిగాడు.

ఏం చెప్పాలో చిత్కళకి అర్థంకాలేదు. మూర్ఖత్వం మూర్తీభవించిన దుండగులు ఇంత దారుణానికి ఒడికట్టిన రోజున అలాంటి స్వల్ప విషయాల గురించి ఆచూకీ తీయటం



ఎందుకో చిత్కళకి అర్థం అవలేదు. పైగా ఆమె దగ్గర నమ్మించే జవాబుకూడా లేదు. ఏదో చెప్పాలన్నట్లు అంది. "అరవింద వాళ్ళ అన్నయ్య న్యూయార్క్‌లోనే ఉన్నాడుట... అతని ఆఫీస్ కూడా అక్కడికి చాలా దగ్గరట...అతను సేఫ్‌గానే ఉన్నాడుట"

"అయ్యో! వెరీ బ్యాడ్ న్యూస్!..." సుధాకర్ వంకరగా అన్నాడు. అంతలోనే అతని ముఖంలో చెప్పలేని మార్పు వచ్చింది. "నువ్వు ఆ అమ్మాయితో మాట్లాడావా?"

తండ్రి గెజిటెడ్ ఆఫీసర్. అన్నెం పున్నెం తెలియని ఓ వ్యక్తి చావలేదని బాధపడుతున్నాడు!...ఓ అమాయక ప్రాణం కంటే తన కక్షలూ కార్పణ్యాలే ఆయనకి ముఖ్యమా? చిత్కళకి జుగుప్స కలిగింది. ఆ భావనలోంచే తెగింపు కూడా వచ్చింది. "మాట్లాడటం కాదు పాపం ఆ పిల్ల ఏవేవో ఊహించుకుని వణికిపోతుంటే సాయం చేశాను. ఇంటిదగ్గర దింపి వస్తున్నాను"

"ఏం చేశావు?" సుధాకర్ ఆగ్రహంతో అరిచాడు.

"ఆపద వచ్చినప్పుడు అయ్యో పాపం అని చేతనయినంత సాయంచేస్తే తప్పేమిటి బాబూ?" బామ్మ అంటూనే చిత్కళ దగ్గరకి వచ్చింది. నువ్వేం మాట్లాడకు అన్నట్లు కంటితో సైగచేసింది.

ఆవేశంలో తీవ్రంగా స్పందించానని సుధాకర్ గ్రహించాడు. "చేసిన నిర్వాకంచాలు. ఇక వాళ్ళని పన్నెత్తి పలకరించనక్కరలేదు. అర్థమయిందా?"

బామ్మ ప్రోద్బలంతో తల ఊపింది చిత్కళ.

చరణ్! వీళ్ళు మారరు...అనుకుంది చేదుగా.

ఆ మర్నాడు చరణ్‌కి మెయిల్ ఇచ్చింది చిత్కళ. తన తండ్రి ఎంత వయలెంట్‌గా రియాక్ట్ అయ్యాడో దాచకుండా చరణ్‌కి తెలిపింది చిత్కళ. "...ఇంతవరకూ మామూలు ఉత్తరాలే బెటర్ అనుకున్నాను. ఓసారి నీకు క్లాస్ కూడా పీకాను కాని నిన్న అంత త్వరగా నీ నుండి మెసేజ్ రావటం అన్నది ఇ మెయిల్ వల్లనే కదా సాధ్యమైంది. సో ఇప్పుడు నేను పార్టీ మారుస్తున్నాను...ఇ మెయిల్ జిందాబాద్!" అని మెయిల్ ముగించింది.

జవాబులో రకరకాల నవ్వు మొహాలని పంపాడు చరణ్...అన్ని రకాలుగా నవ్వుకున్నాడన్నమాట!

ఇటు చిత్కళకి అటు చరణ్‌కి పెళ్ళి గురించి ఒత్తిడి పెరిగింది.చరణ్‌కి ఒక ఎడ్వాంటేజ్ ఉంది. అతను ఎక్కడో దూరంగా ఉన్నాడు, పైగా రకరకాల సాకులు చెప్పే అవకాశం ఉంది. "అమ్మా! అమెరికాలో ఇప్పుడు పరిస్థితి అసలు బాగాలేదు. ఆర్థిక మాంద్యం....సాఫ్ట్‌వేర్ రంగంలో లే ఆఫ్‌లు...ఇప్పుడు ఈ టెర్రరిజం పైన అమెరికా యుద్ధం...ఏవిధంగా చూసినా ఇవన్నీ గడ్డుదినాలు అనిపిస్తున్నది... ఏ నిముషానికి ఉద్యోగం ఊడుతుందో తెలియకుండా ఉంది. ఇలాంటప్పుడు పెళ్ళి ఎలా చేసుకుంటాను? కొన్ని రోజులు ఆగితే మంచిది" అని నమ్మబలికాడు.

పాపం చిత్కళ స్థితి వేరు.

"నీ పిహెచ్‌డి ఎన్నిరోజులు పడుతుంది?" ఓ రోజు సుధాకర్ అడిగాడు.

"ఎక్కడ డాడీ! మొదలుపెట్టి ఏడాదిన్నర అయింది. ఎంత లేదన్నా ఇంకో మూడేళ్ళు పైన పడుతుంది" కావాలని ఎక్కువ చెప్పింది చిత్కళ.

"మంచి సంబంధం అనుకుంటే పిహెచ్‌డి గురించి ఆలోచించకుండా పెళ్ళి చేసేస్తే సరి..." అంది రోహిణి.

"మనం ఆలోచించం సరే...మరి అవతలవాళ్ళు ఆలోచిస్తారుకదా" చిత్కళ అంది. "అమెరికా పెళ్ళికొడుకు అయినా, ఇండియన్ అయినా డాక్టరేట్ అమ్మాయికి మంచి ఉద్యోగం దొరుకుతుందని ఆశపడతాడు కదా!"

"నువ్వు అన్నది నిజమే" సుధాకర్ సాలోచనగా అన్నాడు. "ఇంకో ఏడాది ఆగి సం.బంధాలు చూద్దాం. కుదరటానికి ఇంకొన్ని రోజులు పడుతుంది.నీ పని కూడా అవుతూ ఉంటుంది" సుధాకర్ బేరం ఆడినట్లు అన్నాడు.

కొన్ని రోజులు పోస్ట్‌పోన్ చేయగలిగాను కదా అన్న సంతృప్తితో ఇంక వాదన పెట్టుకోలేదు చిత్కళ.

రెండు నెలలు గడిచాయో లేదో ఎవరో అమెరికా సంబంధం అనగానే జాతకాలు చూడటం మొదలుపెట్టారు.

"అదేమిటమ్మా?...ఏడాది ఆగుతాం అన్నారుకదా...మళ్ళీ ఈ గొడవ ఏమిటి?" చిత్కళ తల్లిని అడిగింది.

రోహిణి విసుక్కుంది. "శుభమా అంటూ పెళ్ళిమాట అనుకుంటుంటే గొడవ అంటావేమిటి?...వాళ్ళు మనకి బాగా తెలిసినవాళ్ళు...ఎంతో మంచి కుటుంబం"

"అది కాదమ్మా! నా పిహెచ్‌డి పూర్తయ్యే సూచన కనుచూపు మేరలో కూడా లేదు. సగంలో ఆపేసి ఇంకెక్కడో కంప్లీట్ చేసుకునే అవకాశం లేదు కదా"

"సపోజ్ ఆ అబ్బాయికి ఏ అభ్యంతరం లేదనుకో మధ్యలో నీకేమిటి?" రోహిణి అంది.

"అమ్మా! అది నా పిహెచ్‌డి. ఎలా చేయాలో నిర్ణయించుకునేది నేను కాని బయోటెక్నాలజీ అంటే తెలియని ఆ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాదు" చిత్కళ ఖండితంగా అంది.

"బాగా చెప్పావు. అలాగే నీ పెళ్ళి ఎప్పుడు చేయాలో నిర్ణయించేది, ఏది మంచో నిర్ణయించేది నిన్ను కన్నవాళ్ల కాని బయోటెక్నాలజీనే లోకం అనే భ్రమలో ఉన్న నువ్వు కాదు" రోహిణి తీసిపోకుండా సమాధానం ఇచ్చింది.

"అమ్మా! ప్లీజ్! అర్ధంచేసుకో...ఇన్ని రోజులు కష్టపడ్డాను. అది ఒక రూపు రాకుండా మధ్యలో ఎలా ఆపగలను?" చిత్కళ ప్రాధేయపడింది. "ఇప్పుడు జాతకాలు కుదిరాయి అంటున్నావు. వాళ్ళేమో పదిహేను రోజులలో పెళ్ళి చేసేయాలి అంటున్నారు. పెళ్ళయ్యాక వీసా ఆటోమాటిక్‌గా వస్తుంది అని కూడా అంటున్నారు. అలాంటప్పుడు రేపు పెళ్ళిచూపులు అయ్యాక వాళ్ళు ఒప్పేసుకున్నారు అనుకో...నా పిహెచ్‌డి ఏమవుతుంది?"

"అది ఆ అబ్బాయి ఇష్టం"

"నేను నోరుమూసుకుని అతనిష్ట ప్రకారం పోవాలి కాని నా ఇన్నేళ్ళ శ్రమ గురించి ఎవరికీ అక్కరలేదన్నమాట" తనకి కావలసినదేదో తాను చెప్పలేకపోవటమే అసలుసమస్య అని చిత్కళకి తెలుసు. ఈ విపత్కర పరిస్థితి నించి ఎలా తప్పించుకోవాలి?

తప్పక పెళ్ళిచూపులలో కూర్చుంది. పెళ్ళికొడుకు పేరు మోహన్. అతను అడిగినప్పుడు మాత్రం తనకి కెరీర్ ముఖ్యం అని ఫర్మ్‌గా చెప్పింది. ఇంకా నాలుగేళ్ళు చేస్తేకాని డాక్టరేట్ రాదని కూడా చెప్పింది.

అంతవరకూ ఆసక్తిగావిన్న అతను "అన్నిరోజులా?ఏమన్నా ప్రాబ్లెమ్ ఉందా?" అని అడిగాడు.

నువ్వే నా ప్రాబ్లెమ్ అనుకుంది చిత్కళ. "మా లాబొరేటరీలో ఆర్టిఫిషియల్ ఫ్యాట్‌ని డెవలప్ చేస్తున్నాం. మామూలు నూనె లాగానే పదార్థాలకి రుచినిస్తుంది. కాని తిన్నాక మానవుడి జీర్ణక్రియలో ఏ మార్పూ చెందకుండా వ్యర్థపదార్థంగా బయటికి వెళ్ళిపోతుంది. రక్తంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారిని, లావుగా ఉన్నవారిని నూనెలు తగ్గించమని చెబుతారు కదా...నూనె లేకపోతే రుచి రాదు. కాని ఈ కొత్త ప్రోడక్ట్‌తో రుచీ వస్తుంది దానివల్ల బరువు పెరగరు. ఇది కొలెస్ట్రాల్‌ని పెంచదు.

ఈ వర్క్‌లో కొంతభాగం పైన నా పిహెచ్‌డి బేస్ అయి ఉంది. ఇంకొన్ని రోజులలో ఆ ఫ్యాట్‌ని యానిమల్స్‌పై టెస్ట్‌చేసి ఆ తరువాత మార్కెట్ చేయాలి. నేను చేసేపనిలో యానిమల్స్ పైన టెస్ట్ చేయటం ముఖ్యమైన అంశం. ఇంకో ఏడాది తర్వాత ఆ పని మొదలెడతాం..." అంటూ సుదీర్ఘంగాచెప్పింది. జంతువులపైన ప్రయోగాలు రెండేళ్ళు కొనసాగుతాయని, ఆ తర్వాత ఇంకో ఏడాది ఫలితాల అధ్యయనం, విశ్లేషణ, ఆ తర్వాత థీసిస్ రాయటం ఉంటాయని చెప్పింది. నిజానికి ఇంకో రెండు నెలల్లో యానిమల్ టెస్టింగ్ మొదలై దాదాపు ఏడాదిపాటు సాగుతుంది. కావాలని ఎక్కువచేసి చెప్పింది చిత్కళ.

మోహన్ బాగా ఇంప్రెస్ అయ్యాడు. అతని మాటలలో ఆ సూచన కనబడేసరికి చిత్కళ గతుక్కుమంది. "ఇదంతా పూర్తి అయ్యేంతవరకూ పెళ్ళిచేసుకోవటం నాకు ఇష్టం లేదు. కాని పేరెంట్స్ బాగా బలవంతం చేశారు. మరి మీరేమనుకుంటున్నారు"

మోహన్ నవ్వాడు. "మావాళ్ళూ నా పెళ్ళిచేయాలని తొందరపడుతున్నారు.సరిగా వంట చేసుకోలేక అవస్థపడుతున్నాననుకుని రెండేళ్ళుగా అమ్మ షంటేస్తున్నది"

"నాకు వంట సరిగా రాదు" ఠక్కున చెప్పింది చిత్కళ.

మోహన్ ఎందుకో పగలబడి నవ్వాడు.

పెళ్ళివాళ్ళు వెళ్ళిన వెంటనే చిత్కళ ల్యాబ్‌కి వెళ్ళటానికి తయారవసాగింది.

"ఈ రోజంతా సెలవు పెట్టకపోయావా? సెలవులు లేవా?..." సుధాకర్ అన్నాడు.

చిత్కళ నవ్వింది. "సెలవులు కాదు నాన్నా ఇక్కడ సమస్య. ఒకరోజు వెళ్ళకపోతే నా పని ఒకరోజు ఆలస్యం అవుతుంది. అదీ లెక్క...చాలామంది రీసెర్చ్ ఫెలోస్ రోజుకి పన్నెండు గంటలకి మించి పనిచేస్తారు తెలుసా?" పైకి అలా అన్నదికాని అసలు రీజన్ వేరే ఉంది. వెంటనే చరణ్‌కి చెప్పేసుకుని బాధ తగ్గించుకోవాలి.

వారంరోజుల తరువాత పెళ్ళివారినుంచి కబురు వచ్చింది. సంబంధం అన్నివిధాలా నచ్చింది కాని పెళ్ళికి ఇంకొన్ని ఏళ్ళు ఆగలేరుట.తల్లిదండ్రి ఎదురుగా ఆ వార్తని గంభీరంగా విన్నది కాని మరునిముషం గదిలోకి వెళ్ళి తలుపు మూసుకుని గంతులు వేసింది చిత్కళ. అద్దంలో తనని తాను చూసుకుని కంగ్రాట్యులేషన్స్ చెప్పుకుంది.

యానిమల్ టెస్టింగ్ మొదలుపెట్టేముందు యానిమల్ హౌస్ ఇన్‌ఛార్జ్‌ని కలిసింది చిత్కళ. ఆయన చిత్కళకి కొన్ని జిరాక్స్ కాపీలు ఇచ్చాడు. జంతువులని శ్రద్ధగా చూసుకొనే పద్ధతులు యానిమల్ హౌస్‌లోకి వెళ్ళేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నియమాలూ ప్రొటోకాల్ ఉన్నాయి అందులో...అవన్నీ జాగ్రత్తగా చదవమని చెప్పాడు ఆయన.

"చూడు మిస్ చిత్కళా! ఆల్రెడీ మేము కొన్ని సమస్యలని ఎదుర్కొంటున్నాం.దయచేసి అన్ని విషయాల్లోనూ మాతో సహకరించాలి. అలక్ష్యంతో మీరుచేసే పొరపాట్లు చివరికి ఈ యానిమల్ హౌస్ ఉనికినే దెబ్బతీసేవిగా మారవచ్చు.అందుకే జాగ్రత్తగావుండాలి" ఆయన హెచ్చరించాడు. ఇంకొన్ని ఫారమ్‌లు ఇచ్చాడు. వాటిని నింపి ఎవరెవరి సంతకాలు తీసుకోవాలో వివరించాడు.

ఆయన అంతగా ఎందుకు చెప్పాల్సి వచ్చిందో ఆ తరువాత చిత్కళకి తెలిసింది.

జంతువులపైన జరిగే ప్రయోగాలని పర్యవేక్షణ చేయటానికి, కంట్రోల్ చేయటానికి ఒక కమిటీ ఉంది. ఒకప్పుడు ఆ కమిటీ పర్యావరణం, అడవుల మంత్రిత్వశాఖలో ఉండేది. కాని తరువాత ఓ వింత లాజిక్‌తో దాన్ని మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ కిందకు మార్చారు.

ప్రయోగాలు జరిపే పరిశోధనా సంస్థలన్నీ ఆ కమిటీతో తమ వివరాలన్నీ రిజిస్టర్ చేసుకోవాలి. చిత్కళ పనిచేస్తున్న బయోటెక్నాలజీ లాబొరేటరీలో ఉన్న యానిమల్ హౌస్ కూడా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుంది. అయితే కొత్త నిబంధనలు అమలులోకి రావటంతో రిజిస్ట్రేషన్ చేసుకునేవిధానం, ప్రొఫార్మా అన్నీ మారాయి. ఆ ఫార్మాలిటీస్ కూడా పూర్తిచేసి ఢిల్లీలో ఉన్న తమ హెడ్ ఆఫీస్ ద్వారా కొత్త రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ పంపించారు.చిత్రంగా అవి ఎక్కడో మాయమయ్యాయి. కమిటీకి గడువులోగా చేరలేదు.

తమతో రిజిస్ట్రేషన్ చేసుకోలేదు కాబట్టి బయోటెక్నాలజీ ల్యాబ్‌లో ఉన్న యానిమల్ హౌస్ పనిచేసే వీలులేదని అందులో ఉన్న జంతువులన్నిటినీ వదిలేయాల్సిందని కమిటీ నుండి ల్యాబ్‌కి తాఖీదు అందింది. చిన్నాచితకా జంతువులతో కలిపి ఎంతలేదన్నా కొన్ని వేల జంతువులపైన ప్రయోగాలు వివిధ దశలలో జరుగుతున్నాయి. వాటిని వదిలెయ్యటం



అంటే ఎలా కుదురుతుంది? హడావిడిపడుతూ ల్యాబ్ డైరెక్టర్ వెంటనే రిజిస్ట్రేషన్ పేపర్లు పూర్తిచేసి స్వయంగా పంపించాడు.

ఇన్‌ఛార్జ్ అందుకనే 'ఆల్రెడీ మేం సమస్యలని ఎదుర్కొంటున్నాం' అని అన్నాడు. రిజిస్ట్రేషన్ పూర్తి అయి పూర్తిస్థాయి ఆమోదం తిరిగి లభించేవరకూ జాగ్రత్తగా ఉండాలని ఆయన అలా చెప్పాడు.

యానిమల్ హౌస్‌కి మొదటిసారి వెళ్ళిన చిత్కళ అబ్బురపడింది.

పాదరక్షలు వదిలేసి ఎయిర్ కర్టన్ కింద నిలబడింది. ఒంటిపైన ఉండే దుమ్మూ ధూళీ అలా పోగొట్టుకుని అప్పుడు లోపలికి వెళ్ళాలన్నమాట. నోటికీ తలకీ ప్లాస్టిక్ మాస్కులు ధరించింది. మోకాళ్ళ వరకూ వచ్చే ప్లాస్టిక్ తొడుగులు కాలికి వేసుకుంది.

యానిమల్ హౌస్‌లో మొత్తం వేయివరకు రకరకాల జంతువులు ఉన్నాయి. తెల్ల ఎలుకలు, కోతులు, కుందేళ్ళు...అన్నింటినీ పరిశుభ్రమయిన వాతావరణంలో ఉంచారు. ఎయిర్ కూలర్స్, ఎయిర్ కండిషనర్స్ కూడా ఉన్నాయి.

కొన్ని వ్యాక్సిన్స్, ఇంటర్ ఫెరాన్, కొత్త ఔషధాలు, చిత్కళ గ్రూప్ పనిచేస్తున్న లో క్యాలరీ ఫ్యాట్ లాంటి కొత్త ప్రోడక్ట్స్ అక్కడ జంతువుల పైన టెస్ట్ చేస్తారు. ఒక్కొక్క బోనుకి ఓ రిజిస్టర్.అందులోని జంతువు పైన ఏ ప్రయోగం జరుగుతుందో రికార్డ్‌చేస్తారు. టెస్ట్‌కి గురి అవటంవల్ల ఆ జంతువులో ఏమన్నా మార్పు వస్తున్నదా అని పరీక్షిస్తారు.

దాదాపు ఫైవ్ స్టార్ సదుపాయాలతో జంతువులని అతిథులులాగా ట్రీట్ చేస్తున్నారు అనుకుంది చిత్కళ.

యానిమల్ హౌస్‌లో ఉన్న తెల్ల ఎలుకలని గిని పిగ్స్ అంటారు...మొదట్లో వాటిపైన టెస్టింగ్ చేయాలి.

చిత్కళ లైబ్రరీలో, ఇంటర్‌నెట్‌లో కావలసిన సమాచారం అంతా సేకరించింది.

మెల్లగా చిత్కళ పని ముందుకు సాగసాగింది.

మొదట్లో బామ్మకి చిత్రమయిన సందేహం వచ్చింది. "ఏవేవో లావాటి పుస్తకాలు చదువుతావు. ఒక్కోరోజు పనినుండి వచ్చి రాసిరాసీ నా చెయ్యి పడిపోయింది అంటావు.ఇంకో రోజు వచ్చేయగానే అబ్బా కెమికల్స్ వాసనపోవటంలేదు వెంటనే స్నానం చేయాలి అంటావు. నిన్న అయితే గ్లవ్స్ ఎక్కువసేపు వేసుకున్నాను చేతులు పొడిగా అయ్యాయిఅంటూ నూనె పట్టించావు. ఇంతకీ నువ్వు చేసే పని ఏమిటి? మీ ఆఫీస్‌ని ఏమంటారు?" అంది.

"బామ్మా! ఆఫీసు అనరు...నేను పనిచేసేది ఓ లాబొరేటరీలో..."

"లా బొ రే ట రీ నా?..." ఆవిడ అయిదు అక్షరాలు పలకటానికి కష్టపడింది.

"పోనీలే బామ్మా! పొట్టిగా లాబ్ అను చాలు"

"అంటే మొన్న నాకు దగ్గువస్తే రోహిణి రక్తపరీక్షకి తీసుకెళ్ళింది. అలాంటిదా"

చిత్కళ తల పట్టుకుంది. అలా లాభంలేదని ఆవిడకి మెల్లగా తనపని ఏమిటో

చెప్పసాగింది. ప్రతిరోజూ తానేం చేశానో వివరించటం అలా అలవాటయింది.

యానిమల్ హౌస్ చూశాక, తన పని మొదలయ్యాక అలాగే ఆ సంగతులన్నీ బామ్మకి చెప్పింది. జంతువుల మీద జరిపే ప్రయోగాలు ఆవిడ ఆసక్తిగా వింది.

తెల్లటి ఎలుకలు ఎలా ఉంటాయో అవి ఎలా ప్రతిస్పందిస్తాయో చిత్కళ వర్ణించి చెబుతుంటే ఆవిడ టీ.వీలో డైలీ సీరియల్ సంగతి కూడా మరిచిపోయి వింది.

"సరే! ఇవన్నీ చేశాక మీకేం తెలుస్తుంది?" బామ్మ ఆసక్తిగా అడిగింది.

చిత్కళ చెప్పసాగింది. "ఎలుకల పైన అయితే ఇన్ని రోజులు టెస్ట్ చేయాలి, కుందేళ్ళు అయితే ఇన్ని రోజులు అని ముందుగానే అనుకుంటారు. ఉదాహరణకి ఎలుక అనుకో...అన్ని రోజులూ అయిపోయాక ఆ ఎలుకని తీసుకువచ్చి దాన్ని డిసెక్ట్‌చేస్తారు.దాని శరీర భాగాలలో, రక్తంలో ఏమన్నా మార్పువచ్చిందా అని పరీక్షిస్తారు.

బామ్మ నిర్ఘాంతపోయింది. "ప్రయోగాలలో అంతగా ఉపయోగపడుతున్నాయి కదా వాటిని అలా చంపేయటం తప్పుకదే" అంది ఆవిడ.

చిత్కళ అలా ఎందుకు చేయక తప్పదో వివరించింది."ఇందాక నువ్వు దగ్గు అన్నావు కదా... దగ్గుకి కొత్త మందు కనుక్కుంటే ముందు దాన్ని ఇలా జంతువుల పైన ప్రయోగించి దానివల్ల చెడు ప్రభావం ఏంలేదని నిర్ధారించుకుని అప్పుడు మానవుల పైన పరీక్షిస్తారు. కొత్తకొత్త మందులు రావాలంటే రోగాలని తగ్గించాలంటే ఇలా చేయక తప్పదు బామ్మా!..."

అయినా మనకి డైరెక్ట్‌గా ఏ హానీ చేయనివాటిని ఎన్నో రోజులు ఏవేవో పరీక్షలు జరిపి చంపటం అన్నది ఆవిడకి ఎందుకో నచ్చలేదు..."పాపం కదూ" అంది.

చిత్కళ నవ్వబోయింది.

"చెంపలు వేసుకో!...మూషికం అంటే వినాయకుడి వాహనం...ఎంత తప్పు... ఎంత తప్పు" అంది బామ్మ.

ఆ మర్నాడు శనివారంనాడు బామ్మ చిత్కళని బలవంతంగా గణపతి గుడికి తీసుకువెళ్ళింది. గణపతి గుడిపక్కగా ఉన్న నందివర్ధనం చెట్టుని చూడగానే చిత్కళ మనసు ఆహ్లాదంగా మారింది. ఈ చెట్టుకిందే తాను మొదటిసారిగా మనసు విప్పి చరణ్‌తో ముఖాముఖీ మాట్లాడింది.

శిలలాగ నిలబడ్డ చిత్కళని గుడిలోకి లాక్కువెళ్ళింది బామ్మ. "తప్పు చేస్తున్నాను స్వామీ కాని తప్పదు అని వినాయకుడికి మొక్కుకో!" అంది ఆవిడ.

చిత్కళ బామ్మ చెప్పినట్లు చేసింది.

"స్వామీ! చిన్నపిల్ల. దీనికన్నా బాగా చదువుకున్నవాళ్ళు చెప్పినట్లే చేస్తున్నది కాని దీని తప్పేంలేదు...మన్నించి కాపాడు తండ్రీ!" అని ప్రార్థనచేసింది.

ఆ తరువాత గుంజిళ్ళు తీయసాగింది.



ఆరు...పన్నెండు...ఇరవై...బామ్మ ఆపటంలేదు.

"ఏమిటిది బామ్మా! ఇక చాలు...ప్లీజ్!..." అంది చిత్కళ. "కావాలంటే నేను తీస్తాను... ఆగు!" ప్రాధేయపడింది.

"వద్దు! ఆపకు...యాభై ఒక్కటి తీస్తానని మొక్కుకున్నాను. ఆపకు" ఆయాస పడుతూ ఆవిడ కొనసాగించింది.

ఆ వయసులో ఆవిడ తనకే పాపం అంటకూడదు అని దేవుడ్ని ఒప్పించటంకోసం అష్టకష్టాలు పడి అన్నేసి గుంజిళ్ళు తీయటం చూసి చిత్కళ మతిపోయింది.

"ఏమిటిది బామ్మా!" అంది కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ.

ఆ రాత్రి బామ్మ నడుముకి అమృతాంజన్ రాసి కాపడం పెడుతూ ఓ నిర్ణయానికి వచ్చింది చిత్కళ.

యానిమల్ హౌస్ నుండి బయటికివచ్చి పది అడుగులు వేశాక ఖాళీస్థలం ఉంది. అక్కడ ఓ మొక్క నాటింది చిత్కళ. ఆ మొక్క పక్కన ఇన్ మెమరీ ఆఫ్ దోజ్ యానిమల్స్... అని చిన్న బోర్డ్‌పైన రాసి ఉంచింది.

కొంతమంది నవ్వుకున్నారు. ఎగతాళి చేశారు.అయితే చిత్కళ యానిమల్ హౌస్ లోపలికి వెళ్ళిన ప్రతిసారీ తప్పనిసరిగా ఆ మొక్క దగ్గర మౌనంగా నిలబడటం అలవాటు చేసుకుంది. ఒకవేళ వెళ్ళకపోయినా వారానికి ఒకసారయినా ప్రార్థన చేసేది. క్రమంగా ఇంకొంతమంది ఆమెని అనుసరించసాగారు.

ఆ విషయం గురించి చరణ్‌కి ఇచ్చిన మెయిల్‌లో చర్చించింది. "ఆ మొక్క నాటటం దానిముందు మౌనంగా నుంచోవటం ఇదంతా చదివి నువ్వు పగలబడి నవ్వుతుంటావని నాకు తెలుసు. ఒక్క సెకండ్ ఆగు...ప్రతి విషయమూ తార్కికంగా, రేషనల్‌గా ఆలోచించే అలవాటు మనిషిని మెషిన్‌గా మారుస్తుంది. మనిషికే కాదు ఒక జీవికి బాధ కలుగుతున్నదే అని ప్రతిస్పందించటం ఎంత గొప్ప మెషిన్ అయినా ఎప్పటికీ చేయలేదు. మనిషి మాత్రమే ఇంకొకరి గురించి కన్నీరు వదలగలడు.

లాబొరేటరీలో టెస్ట్‌చేశాక ఎలుకనో, కోతినో చంపక తప్పదు అని తార్కికంగా ఆలోచించటం వేరు. అయ్యో మనవల్ల తోటి ప్రాణికి కష్టం కలిగిందే అని సానుభూతి ప్రదర్శించటం వేరు...లాజిక్ అవసరమే కాని అలాంటి ఆలోచనాక్రమంలో మనిషి ఎంతో ముఖ్యమైన సెన్సిటివిటి పోగొట్టుకోవటం తప్పుకదా?...తార్కికంగా ఆలోచించటంవల్ల ఒకనాడు మృగాలతో సమానంగా తిరిగిన మనిషి ఈనాడు ఇంత ఎదిగాడు...అయితే దయార్ద్రహృదయం లేనినాడు ఈ నాగరిక మానవుడు మృగంతో సమానం అవడా?"

జవాబుగా చరణ్ గమ్మత్తయిన మెయిల్ ఇచ్చాడు. "ఇదేం బాగాలేదు చిత్కళా! ఒక్కోసారి ఆడవాళ్ళకి అన్యాయం జరుగుతుందీ అంటావు. ఇంకోసారి మూగజీవులకీ అన్యాయం జరుగుతుంది అంటావు. ఈ లెక్కన ఈ ప్రపంచంలో ఒక్క మగాడు తప్ప

అందరూ అణచివేతకి గురి అవుతున్నారని నువ్వు భావిస్తున్నావా...ఆగు ఆగు...అంత కోపంగా కంప్యూటర్ స్క్రీన్ వంక చూడకు. ఆవేశం కాస్త తగ్గించుకో...మిగిలిన మగవాళ్ళ గురించి నువ్వు ఏం అనుకున్నా నాకు అభ్యంతరంలేదు కాని నేను చాలా మంచివాణ్ణని గ్రహించు అది చాలు...సరేనా?

అయితే ఒక మొక్క నాటటం దానిముందు మౌనంగా నుంచోవటం అన్నది కొందరి హేళనకి గురి అయినా క్రమంగా చాలామంది దాన్ని అనుసరిస్తారు చూడు! ఇక్కడ కూడా లాబొరేటరీ పరీక్షలకి అసలు జంతువులని ఉపయోగించాల్సిన అవసరం ఉందా లేదా అన్న చర్చ జరుగుతూ ఉంది.

ఫలానావిషయం మంచా చెడా అన్న రెండు వాదనలలోనూ పస ఉంటుంది.అయితే మనంగమనించాల్సింది ఏమిటంటే దేనివల్ల ఎక్కువమందికి ఎక్కువకాలం మంచి జరుగుతుంది అన్నది. ఆ దృష్టితో చూస్తే జంతువుల పైన ప్రయోగాలు చేయటంలో తప్పులేదేమో... మీ ప్రయత్నాలు ఫలించి జనావళికి ఉపయోగించే కొత్త వ్యాక్సిన్‌లు, మందులువస్తే అందులో పాల్గొన్న సైంటిస్ట్‌లతోపాటు మూగగా తమ ప్రాణాలని బలి ఇచ్చిన జీవాలకీ మనం కృతజ్ఞత చెప్పాలి. అయితే తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తినవాళ్ళని విస్మరించినట్లుగానే ఆ జీవాలనీ మనం మరిచిపోతాం...అవునా?

ఈ లెక్కన నువ్వు ఇంకో ఏడాదిలో థీసిస్ రాయటం మొదలుపెడతావేమో... అవునా? అంటే మనం వేచి చూడాల్సిన సమయం రెండు సంవత్సరాలకి తగ్గిపోయిందన్న మాట. అయామ్ వెరీ హ్యాపీ..."

ఆ మెయిల్ చదువుకుని చిత్కళ నవ్వుకుంది. చరణ్ చాలా తెలివిగలవాడు!లాబ్‌లో ఉపయోగించే జంతువుల పక్షాన వకాల్తా పుచ్చుకుంటున్నట్లు కనబడుతూనే చివర్లో తాజ్ కట్టిన కూలీలను విస్మరించినట్లుగానే వాటిని పట్టించుకోకపోవటం సహజమే కదా అన్నట్లు ముగించాడు. నిజంగా గడుసువాడు. చిత్కళ నవ్వుకుంది.

ఓ రోజు బామ్మ అడిగింది "అక్కడ అన్ని కోతులు, కుందేళ్ళు, ఎలుకలు ఉంటాయి కదా వాటికి భోజనం ఏం పెడతారే?"

"పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, పళ్ళు, కాయగూరలు, విటమిన్లు ఇలా చాలా బ్యాలన్స్‌డ్ డైట్ ఇస్తారు బామ్మా" చిత్కళ చెప్పింది.

"అయితే నువ్వు ఓ పని చేయకూడదే...ఓ గెల అరటిపళ్ళు తీసుకువెళ్ళి వాటికి పంచకూడదా?..." బామ్మ అమాయకంగా అడిగింది.

చిత్కళ పకపకా నవ్వింది. "బామ్మా! అలా మనం ఏ ఆహారం ఇవ్వకూడదు. అది తప్పు... వాటికి కావల్సినంత పుష్టికరమయిన తిండి వాళ్లే ఏర్పాటు చేస్తారు. నువ్వేం దిగులుపడకు" అంది.

బామ్మ చిన్నబుచ్చుకుంది.



చిత్కళ రహస్యంగా ఆవిడ చెవిలో చెప్పింది. "నేను ఇలా చేయటం తప్పు కాని నీకోసం చేస్తున్నాను. కావాలంటే వేరుశనగ పప్పులు గోప్యంగా తీసుకువెళ్ళి కొన్ని ఎలుకలకి కొన్ని కోతులకి అందివ్వగలను...అంతే!"

"ఆ పని చేయవే కొంచెం పాపం తగ్గుతుంది" అంది బామ్మ.

ఆ రాత్రి పడుకునే ముందు ఆ సంభాషణ ఎందుకో గుర్తుకి వచ్చింది చిత్కళకి. పాపం అన్న పదం వాడింది బామ్మ. అంటే ఆవిడ ఈ విషయం గురించి చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నది కాబోలు!

బామ్మకోసం పల్లీపప్పులు స్మగుల్‌చేసి యానిమల్ హౌస్ లోపలికి తీసుకువెళ్ళేది చిత్కళ. అలా పని ఉన్నా లేకున్నా యానిమల్ హౌస్‌కి వెళ్ళటం అలవాటైంది చిత్కళకి.

ఓ రోజున బామ్మ నడుంనొప్పితో బాధపడుతుంటే చిత్కళ ఆరాతీసింది. చిత్కళకి తెలియకుండా ఆవిడ వినాయకుడి గుడిలో గుంజిళ్ళు తీస్తూనే ఉందిట.

"బామ్మా! నువ్వు చాలా టూమచ్ చేస్తున్నావు తెలుసా... నేను లాబ్‌లోచేసే ఎక్స్‌పెరిమెంట్‌ల గురించి నువ్వు ప్రాయశ్చిత్తాలూ పాపపరిహార వ్రతాలూ చేయనక్కర లేదు" అంది చిత్కళ.

"నేనేం తప్పుచేశానే కళా! దేవుడిముందు లెంపలువేసుకుని గుంజిళ్ళుతీశాను"

"ఇప్పుడు నడుంనొప్పితో విలవిలలాడుతున్నావు..." ఠక్కున అందుకుంది చిత్కళ. "బామ్మా! ఇంకో రెండు నెలల తరువాత నేను ఆ యానిమల్ హౌస్ మొహం చూడను.నా పని అయిపోవచ్చింది. కాని నువ్వు ఇప్పటినుండి ఈ చాదస్తాలు మానెయ్యి" అంది.

వినాయక చవితి అయిన మర్నాడు చిత్కళ లాబ్‌కి వెడుతుంటే బామ్మ గుసగుసగా అడిగింది "మూషికాలకి పెట్టటానికి కొన్ని ఉండ్రాళ్ళు తీసుకువెడతావా...గోలీలాగా చిన్న చిన్నవి చేసి ఫ్రిజ్‌లో దాచాను" అని.

"బామ్మా!..." అంటూ గట్టిగా అరిచి అంతలోనే తమాయించుకుంది చిత్కళ."అలా చేస్తే నన్ను ఉద్యోగంలోంచి తీసేస్తారు తెలుసా?" ఆమాత్రం భయపెట్టకపోతే లాభంలేదనుకుంది చిత్కళ.

"పోనీలే! ఇంకో గుప్పెడు వేరుశనగలు తీసుకువెళ్ళు" అంది బామ్మ.

పాపం ఆ రోజున బామ్మ ముచ్చట తీరలేదు.

యానిమల్ హౌస్ దగ్గరకి వెళ్ళేసరికి ఆమెతో పనిచేసే రీసెర్చ్ ఫెలో చెప్పాడు."ఈ రోజు యానిమల్ హౌస్‌లోకి ఎంట్రీ రిస్ట్రిక్ట్ చేశారు"

"ఎందుకు?" అడిగింది చిత్కళ.

"ఇన్‌స్పెక్షన్ కమిటీ ఏదో వస్తున్నదిట"

తరువాత చిత్కళకి వివరాలు తెలిశాయి.

దేశం మొత్తంలో జంతువులపైన జరిగే ప్రయోగాలని పర్యవేక్షణ చేయటానికి,

కంట్రోల్ చేయటానికి ఓ హై పవర్ కమిటీ ఉంది.

యానిమల్ హౌస్ రిజిస్ట్రేషన్ పేపర్లు రూల్స్ ప్రకారం ఆఖరు తేదీకి సమర్పించలేదు కాబట్టి మధ్యంతర చర్యగా ఆ కమిటీలోని కొందరు సభ్యులు ఈ లాబ్‌లో ఉన్న యానిమల్ హౌస్‌ని ఇన్‌స్పెక్ట్ చేయటానికి వస్తున్నారుట. ఈ ఇన్‌స్పెక్షన్ సవ్యంగా అయితే రిజిస్ట్రేషన్ గురించి ఉన్న అనిశ్చితి తొలగిపోతుందిట.

అమ్మయ్యా అనుకుంది చిత్కళ. యానిమల్ హౌస్‌లో ఉన్న ఫెసిలిటీస్ చూశాక ఎవరన్నా మెచ్చుకోవాల్సిందే. అందులో సందేహంలేదు. రిజిస్ట్రేషన్ పేపర్లు సకాలంలో అందలేదు అన్న ఆరోపణ తొలగిపోతుంది అనుకుంది చిత్కళ.

ఆ సాయంకాలం బస్‌లో ఇంటికి వస్తుంటే పక్కనే ఉన్న డాక్టర్ కోమలి "చిత్కళా! గొడవ అయిందట తెలుసా?..." అంది.

ఆవిడ పిల్లల చదువు గొడవ, ఆవిడ ఉండే అపార్ట్‌మెంట్‌లో గొడవలు...ఇవి విని విని విసుగెత్తిన చిత్కళ "తెలియదు మేడమ్!" అంది.

ఆవిడ చెప్పటం మొదలుపెట్టింది. అయితే ఇది లాబ్‌లో జరిగిన గొడవ!...ఇన్‌స్పెక్షన్ సమయంలో జంతువుల పరిస్థితి చూసి దాదాపు అందరూ సంతృప్తి వ్యక్తం చేశారుట. సభ్యులతో పాటు వచ్చిన అనధికార వ్యక్తులు మాత్రం విదేశాలతో పోలిస్తే ఇక్కడి ప్రమాణాలు చాలా తక్కువగా ఉన్నాయని పెదవి విరిచారుట. కొందరు రంధ్రాన్వేషణ మొదలుపెట్టారుట. ఎయిర్ కండిషనర్స్, ఎయిర్ కూలర్స్ లాంటివి బాగానే ఉన్నా దుమ్ము ఎక్కువగా ఉంది, ఫిల్టర్‌లు సరిగా శుభ్రంచేయాలి అనీ, కూలర్‌లో వాడే నీళ్ళని పరీక్షించటంలేదని, ఇంకో ఏవో ఒకటి రెండు సదుపాయాలు సరిగా లేవు అనీ వ్యాఖ్యానించారుట. ఇంకేవో అంతగా పట్టించుకోనవసరంలేని విషయాల గురించి కూడా ప్రస్తావించారుట.

ఆ వ్యవహారం చూస్తుంటే తప్పు పట్టటానికి కంకణం కట్టుకున్నట్లు అనిపించిందిట. అంతవరకూ అయితే బాగానే ఉండేది కాని బయటికొచ్చాక కమిటీ సభ్యులతో పాటు వచ్చిన ఒకరు ఏదో సందేహం వచ్చి తిరిగి యానిమల్ హౌస్‌లోకి వెళ్ళాలని అనుకున్నప్పుడు గలాటా జరిగిందిట. నియమాల ప్రకారం ధరించాల్సిన ఫేస్ మాస్క్, హెడ్‌మాస్క్, కాళ్ళకి ధరించాల్సిన ప్లాస్టిక్ తొడుగులు లేకుండా లోపలికి వెళ్ళటంతో యానిమల్ హౌస్ అధికారులు అభ్యంతరం చెప్పారు. అతను వినిపించుకోలేదు. తనని ఆపుతున్నవారిని తోసేసి అతను లోపలికి వెళ్ళాడు. ఎయిర్ ఛాంబర్‌లో తనపైన ఉండే దుమ్ము పోగొట్టుకునే ప్రయత్నం కూడా చేయని అతన్ని చేతులు పట్టుకుని బలవంతంగా ఆపాల్సివచ్చింది.

అది కావాలని లాబొరేటరీవాళ్ళు చేసిన అవమానంగా భావించారు కమిటీసభ్యులు. జంతువులని నియమాల ప్రకారం ఉంచుతున్నారా లేదా మానిటర్ చేయాల్సిన కమిటీవారే నిబంధనలు పాటించకపోవటం చాలా తప్పు అని అలాంటి ప్రికాషన్స్, జాగ్రత్తలు తీసుకోవటం జంతువులకి మనద్వారా ఇబ్బంది కలగకుండా చూడటానికే అని ఎంత చెప్పినా



లాభంలేకపోయింది. అసలే జంతుప్రేమ ఎక్కువ ఉన్న ఆ కమిటీ సభ్యులు తీవ్రంగా ప్రతిస్పందించారుట.

"నేను విన్నది ఏమిటంటే చివరికి ఫ్యాక్ట్ కంటే ఎమోషన్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ ఇన్‌స్పెక్షన్ ముగించారుట" కోమలి అంది.

"ఏమన్నా సమస్యలు వస్తాయా మేడమ్!..." చిత్కళ ఆతృతగా అడిగింది. ఏమన్నా సమస్యలు వస్తే గోవిందా!...ఇప్పుడు యానిమల్ హౌస్ పైన ఏమన్నా చర్య తీసుకుంటే తన పని అంతా ఏడాదో ఏడాదిన్నరో వెనకబడుతుంది.

కోమలి నవ్వింది. "ఎన్నో ఏళ్ళ నించీ మన లాబ్‌లో యానిమల్ హౌస్‌ని నిర్వహిస్తున్నాం. దేశంలోనే వన్ ఆఫ్ ది బెస్ట్ అని పేరుంది. ప్రొఫార్మా మారటం, ఇచ్చిన రిజిస్ట్రేషన్ అప్లికేషన్ మాయం అవటం, ఆ తరువాత సకాలంలో వాళ్ళకి అందకపోవటం ఇవన్నీ చాలా చిన్న విషయాలు. ఈ యానిమల్ హౌస్‌కి ఏమన్నా అయితే కొన్ని కీలకమైన పరిశోధనలు దెబ్బతింటాయి. కోట్ల రూపాయలలో చెప్పలేని నష్టం కలుగుతుంది. కాబట్టి అంత తీవ్రంగా ఏం జరగదు కాని మందలిస్తూ లేఖ రాస్తారు అనుకుంటున్నాను"

చిత్కళకి కొంత ఊరటకలిగింది.అయినా మనసులో ఎక్కడో అనుమానం సూదిలాగా పొడుస్తూనే ఉంది.

ఇంటికి వెళ్ళేసరికి ఇంకో ఉపద్రవం కాచుకుని ఉంది.

దాదాపు ఏడాదిన్నర క్రితం పెళ్ళిచూపులకి వచ్చిన మోహన్ తల్లిదండ్రులనించి కబురు వచ్చిందిట, ఆ అబ్బాయికి చిత్కళ బాగా నచ్చిందిట.క్రితంసారి మిగిలిన సంబంధాలు ఏవీ నచ్చలేదని చెప్పి అమెరికా వెళ్ళిపోయాడుట. ఇప్పుడు ఏదో కంపెనీ పనిపైన ఇండియా వచ్చాడుట. ఆరునెలల తరువాత సెలవు తీసుకుని ఇంకోసారి ఇండియా వస్తాడుట. ఇప్పుడు ఊ అనుకుంటే అప్పుడు పెళ్ళి జరిపించవచ్చు అన్నది మధ్యవర్తి సూచన.

చిత్కళ గుండె ఆగిపోయింది.

"నాన్న ఏమన్నారు?" చిత్కళ తల్లిని అడిగింది.

"ఇంకో రెండు నెలల్లో నీకు యానిమల్ హౌస్‌తో పని ఉండదని మొన్న నువ్వు బామ్మతో చెబుతున్నావు కదా...దాన్నిబట్టి ఇద్దరం ఆలోచించాం. మహా అయితే ఇంకో సంవత్సరంలో నీ పిహెచ్‌డి అయిపోతుంది. నువ్వు అంటే అంత ఇష్టపడ్డ అతను పెళ్ళి అయ్యాక కొన్నినెలలు ఆగడా?" రోహిణి అంది.

అంతవరకూ తండ్రి అడిగినప్పుడల్లా ఏడాది ఎక్కువ చెప్పేది.చివరికి ఇలా దొరికిపోయానా అనుకుంది చిత్కళ.

చరణ్ ఇక్కడ ఉంటే ఎంత బాగుండేది! ఇప్పుడు తను చరణ్ గురించి చెప్పటం ఇంకా ప్రమాదకరం. ఈ సమస్యని తనే అధిగమించాలి. తప్పకపోతే ఓపని చేయచ్చు. ఆ మోహన్‌తో రహస్యంగా మాట్లాడి నన్ను వదిలెయ్యి బాబూ అని బతిమిలాడాలి.అంతే...

ఆ నిశ్చయానికి వచ్చాక చిత్కళకి కొంత ధైర్యం కలిగింది.

ఆ రాత్రి మోహన్ నుండి ఫోన్ వచ్చింది. సుధాకర్ అతనితో మాట్లాడుతుంటే రోహిణి చిత్కళని హెచ్చరించింది. "అతను నిన్ను ఇంకా ఎన్నిరోజులు నడుస్తుంది అని అడుగుతాడు...నువ్వు ఆరునెలల్లో అయిపోతుంది అని చెప్పు"

"అబద్ధమా?..."

"పెళ్ళికోసం వంద చెప్పచ్చు...మనం ఒకటే చెబుతున్నాం"

అదృష్టవశాత్తు మోహన్ ఆ ప్రసక్తి తీసుకురాలేదు. అతనికి బెంగుళూర్‌లో పని ఉందిట. వచ్చేవారం మళ్ళీ హైదరాబాద్ వస్తాడుట... అప్పుడు ఏదన్నా సినిమా చూద్దామా అని ప్రపోజల్ పెట్టాడు.

కూతురు ఏం మాట్లాడుతున్నదా అని రోహిణి ఆసక్తిగా గమనిస్తున్నది. చిత్కళ మొహంలో నవ్వు పెంచింది. "నాకు సినిమాలు అంత ఇష్టం లేదండి" అంది తీయగా... తల్లికి దొరికిపోకూడదు మరి.

"వెరీగుడ్! నాకూ సిన్మాలంటే బోర్! శిల్పారామం చూద్దాం ఉంటాను బై!"

"బై..." అని ఫోన్ పెట్టింది చిత్కళ.

"ఏమంటున్నాడు..." రోహిణి ఆత్రుతగా అడిగింది.

"వచ్చేవారం మేమిద్దరం శిల్పారామం వెడుతున్నాం" అంది చిత్కళ. అలా చెపితే తల్లికి అనుమానం రాదని, పైపెచ్చు ఆనందిస్తుందని చిత్కళకి తెలుసు.

శిల్పారామంలో అలంకరణలు చేసిన కుండలు లాంటివి దొరుకుతాయి.ఓ కుండ తీసుకుని బద్దలుకొట్టి 'నువ్వు నాకు ఇష్టం లేదురా బాబూ' అని ఆ మోహన్‌కి చెప్పాలి అనుకుంది చిత్కళ.

ఆ నాలుగు రోజులు చిత్కళకి పని ఎక్కువగా ఉంది. పైగా ఆ మోహన్ టెన్షన్ ఒకటి. తన ప్రార్థన విని అతను గప్‌చుప్‌గా అమెరికా వెళ్ళిపోతే ఫర్వాలేదు. అమ్మాయి ఎవరినో ప్రేమించింది అని చెప్పేసి చెక్కేస్తే పెద్ద గొడవ అవుతుంది. తను ఆ పరిస్థితిని ఎదుర్కోగలదా?

చరణ్ మటుకు మెయిల్ తరువాత మెయిల్ ఇచ్చి ధైర్యం ఇస్తూనే ఉన్నాడు.

ఏం చేయాలో పాలుపోనప్పుడల్లా చిత్కళ కంప్యూటర్ ముందు కూర్చుని చరణ్‌కి ఇంకో మెయిల్ ఇస్తుండేది.

ఆ రోజున అలాగే టైప్ చేస్తున్నది...ఫోన్ మోగింది. "చిత్కళా! ఉన్నావా?...అమ్మయ్యా అర్జంట్‌గా యానిమల్ హౌస్‌కి రా! ఇక్కడ పెద్దగొడవ జరుగుతున్నది...త్వరగా రా..."

ఫోన్‌చేసినవాళ్ళెవరో చిత్కళ గుర్తుపట్టలేదు "గొడవా?...గొడవ ఏమిటి?"

అవతల నుండి సమాధానం రాలేదు...ఫోన్ పెట్టేశారు. ఏమయి ఉంటుందా అన్న ఆలోచనతో మెట్లు దిగుతున్న చిత్కళ చాలామందే యానిమల్ హౌస్ వేపు వెళ్ళటం



చూసింది. కొందరైతే పరుగెడుతున్నారు. అప్రయత్నంగా చిత్కళ కూడా పరుగుతీసింది.

కమిటీ ఇన్‌స్పెక్షన్ అయిన అయిదురోజుల తరువాత ఆ లాబ్ డైరెక్టర్‌కి ఓ నోటీస్ వచ్చింది. గడువు దాటాక వచ్చిన రిజిస్ట్రేషన్‌ని పరిశీలించటానికి సమయం పడుతుంది కాబట్టి ఈలోగా యానిమల్ హౌస్‌ని రిజిస్ట్రేషన్ లేకుండా నడపటం చట్టరీత్యా కుదరదు కాబట్టి వెంటనే జంతువులని వదిలేయాలని అలా చేయకపోతే వ్యక్తిగతంగా డైరెక్టర్‌కి శిక్ష తప్పదని హెచ్చరిక ఉంది.

డైరెక్టర్ ఏంచేయాలో ఆలోచించేలోగా ఆ కమిటీకి సంబంధించినవారు, బ్లూక్రాస్ వారు దాదాపు ముట్టడిచేసినట్లు లాబ్‌పైకి దాడికి వచ్చారు. జంతువులని బ్లూక్రాస్‌కి అప్ప చెప్పమని డిమాండ్ చేశారు.

అన్ని జంతువులని సరిగా చూసుకునే సదుపాయం బ్లూక్రాస్‌కి లేదన్న లాజిక్‌గాని కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న సైంటిఫిక్ రీసెర్చ్ దెబ్బతింటుందన్న రీజన్‌గాని వారి జంతు ప్రేమని ఇసుమంత కూడా కదల్చలేకపోయింది. కొన్ని వ్యాక్సిన్‌లపైన ఇన్‌టర్ ఫెరాన్ లాంటి అతి ముఖ్యమయిన మందులపైన జరుగుతున్న పరిశోధనలు ఆగిపోయినా ఫర్వాలేదు అన్న వైఖరిలో ఉన్నారు వారు.

కమిటీ ఇన్‌స్పెక్షన్‌లో కనబడ్డ గోరంతలోపాలని కొండంతగాచేసి అసలు ఆ యానిమల్ హౌస్‌కి రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేయాలని కొందరు బ్లూక్రాస్‌వారు డిమాండ్ చేశారు.

వాదోపవాదాలు జరిగాయి. రిజిస్ట్రేషన్ లేకుండా యానిమల్ హౌస్‌ని నడపటం నేరమే!...అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల సకాలంలో రిజిస్ట్రేషన్‌కి అప్లయి చేసుకోవటం జరగలేదని చట్టాన్ని ఉల్లంఘించాలన్న ఊహ తమకి లేదని డైరెక్టర్ చేసిన వాదన బలంగానే ఉంది. ఒక్క చిన్న అంశాన్ని ఆధారంగా తీసుకుని జంతువులని అన్నింటినీ వదిలెయ్యమని అనటం సబబు కాదని పదేపదే చెప్పాడు ఆయన.

తరువాత కమిటీవారు కొంత దిగివచ్చారు. ముఖ్యమయిన పరిశోధనలలో ఉపయోగిస్తున్న జంతువులని కదల్చకుండా మిగిలిన జంతువులని తీసుకువెడతాం అన్నారు.

డైరెక్టర్ తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు. ఇంత గొడవ చేశాక కొంత విజయం సాధించామన్న తృప్తి లేకపోతే ఆ కమిటీవారు ఇంకేదో కోరచ్చు. చిన్నచిన్న పరిశోధనలు కొంత దెబ్బతిన్నా ఫరవాలేదు...సర్దుకుపోవచ్చు అనుకున్నాడు.

చిత్కళ యానిమల్ హౌస్ చుట్టూ ఉన్న జనాన్ని తోసుకుని ముందుకి వెళ్ళింది.

బ్లూ క్రాస్ సభ్యులని ఎవరో టీ.వీ ఛానెల్ వాళ్ళు అడుగుతున్నారు "మానవుడి ఆరోగ్యానికి కావలసిన పరిశోధనలకోసం కొన్ని జంతువులని వాడకతప్పదని అలా వాడకపోతే సగటు ఆయుర్దాయం ఇంత గణనీయంగా పెరిగేది కాదని శాస్త్రజ్ఞులు అంటున్నారు... దీనికి ఎలా సమాధానం చెబుతారు?" అని.

"ఈ ప్రశ్న వెనకాల అంతర్లీనంగా ఒక భావన ఉంది. అదేమిటంటే అన్ని ప్రాణుల

అతని గొంతులో వచ్చిన మార్పు చిత్కళ తేలికగానే పసికట్టింది. ఇక అతను ఫోన్ చేయడు. చిత్కళ మొహంలో చిరునవ్వు కదలాడింది.

• • •

చరణ్ పనిచేసే కంపెనీకి హాంకాంగ్‌లో ఓ సబ్సిడరీ ఉంది.అతను కొంచెం కష్టపడి అక్కడ పని పెట్టుకుని అక్కడ నుండి ఇండియాకి వచ్చే ఏర్పాటు చేసుకున్నాడు. అయితే అతనికి హైదరాబాద్‌లో ఒక రోజుకన్నా ఎక్కువ ఉండే అవకాశంలేదు. ఆ ఒక్కరోజులో తన కుటుంబంతో గడపాలి. చిత్కళని ఎవరికీ తెలియ కుండా కలుసుకోవాలి. ఇదంతా ఎలా సాధ్యపడుతుందో చిత్కళకి అంతుపట్టలేదు.

అసలు చరణ్ అంతదూరం వస్తున్నదే తనని సముదాయించటానికి. అటు వంటప్పుడు హైదరాబాద్‌లో ఉన్న అతికొద్ది సమయంలో అతని కుటుంబసభ్యులకి అనుమానం రాకుండా తనవారికి తెలియకుండా తనని ఎలా కలుసుకుంటాడో చిత్కళకి మిస్టరీలాగా తోచింది.

వచ్చేముందు ఇచ్చిన మెయిల్‌లో ఆ రహస్యం బయటపెట్టాడు. "నేను హైదరాబాద్ వస్తున్న ఫ్లైట్‌లో కాకుండా ఎనిమిది గంటల తరువాత ఉన్న ఫ్లైట్‌లో దిగుతున్నాను అని ఇంట్లో చెప్పాను. అంటే మనకి అయిదారు గంటల ఏకాంతం దొరుకుతుందన్నమాట. హైదరాబాద్‌లోనే హోటల్ తీసుకుని ఆ సమయం గడుపుదాం...ఆ తరువాత మా వాళ్ళు ఎయిర్‌పోర్ట్‌కి బయల్దేరేలోగా నేనే ఇంటికి వెళ్ళిపోతాను...సరేనా?" అని రాశాడు.

చిత్కళ మంచి ఐడియా అనుకుంది. మరి అంతకన్నా ఇంకోమార్గం ఏముంది?

అసలు చరణ్ ఇంకా రాకుండానే ఆమె బాగా తేరుకుంది. తనకోసం అతను అంత శ్రమ తీసుకుని వస్తున్నాడన్న భావనే ఆమెకి చాలా శక్తి ఇచ్చింది.

ఫ్లైట్ సమయానికే వచ్చింది. ఫార్మాలిటీస్ పూర్తిచేసుకుని చరణ్ త్వరగానే బయట పడ్డాడు. చరణ్ ఇంకా ఇంకా తెల్లబడుతున్నాడు అనుకుంది చిత్కళ అతన్ని చూడగానే. అంతా బాగానే ఉందికాని అతనుపెట్టుకున్నటై అస్సలు నచ్చలేదు ఆమెకి. అదేం రంగు? మొదటిసారి చూసినప్పుడు అతను ధరించిన మంకీక్యాప్ గుర్తుకి వచ్చింది.

చరణ్ ట్రాలీ పక్కకి తోసి ఆమె రెండు చేతులూ పట్టుకున్నాడు. అతనికి ఇంకా దగ్గర అవకుండా నిగ్రహించుకోవటానికి కష్టపడింది చిత్కళ. ఎవరన్నా తమని గమనిస్తు న్నారా అన్నట్లు చుట్టూ చూసింది. ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు.

హోటల్ రూమ్‌లోకి వెళ్ళగానే రూమ్ సర్వీస్‌కి కావలసినవి చెప్పాడు చరణ్. చిత్కళ వంక తిరిగి నవ్వుతూ "ఏ పనీ తీరికగా చేయటానికి టైమ్‌లేదు కదా!...మనకి కావలసినవి త్వరగా తెప్పించుకుంటే ఇక ఏ అవరోధం లేని ఏకాంతం దొరుకుతుంది. చాలాచాలా మాట్లాడాలని ఉంది కాని ప్లీజ్ అర్థం చేసుకో నేను రెండు క్షణాల్లో స్నానంచేసి వస్తాను. పుస్తకాలలో చెబుతారే అలా కడిగిన ముత్యంలాగా ఉన్న నిన్ను తాకాలంటే అప్పుడు కాని నాకు అర్హత రాదు...ఏమంటావు?"



అతను తయారై వచ్చేంతవరకూ న్యూస్‌పేపర్ తిప్పుతూ గడిపింది. ఆమె అందిం చిన కాఫీ కప్పు తీసుకుని చిత్కళ పక్కన కూర్చున్నాడు. ఇద్దరూ మౌనంగా కాఫీ తాగసాగారు. హఠాత్తుగా చిత్కళ కప్పు టీపాయ్ మీద పెట్టి అతని భుజంమీద తలవాల్చింది. అతనూ కప్పు పెట్టేశాడు. ఆమెని దగ్గరగా పొదువుకున్నాడు.

"చరణ్! థాంక్యూ!...నువ్వు రాకపోతే నేనేమైపోయేదాన్నో... నువ్వు వస్తున్నావు అన్న వార్తే నాకు ఇంత బలాన్ని ఇచ్చింది. ఇలా రావటం నీకు ఇబ్బంది లేదుకదా?"

"భలేదానివి!...ఇలాంటి అనుభవం దొరుకుతుందని తెలిస్తే ఎప్పుడో ఇంత ధైర్యం చేసేవాడిని...ఏమంటావు?" ఆమె చెవిలో గుసగుసగా అన్నాడు.

అతని పెదవులు ఆమె చెంపల మీదుగా పెదవుల వరకూ ప్రయాణం చేస్తూనే ఉన్నాయి. గిలిగింతల ఆ మధుర ప్రయాణం అలా అలా అనంతంగా సాగుతూనే ఉం టుందా?...ఆమె అప్రయత్నంగా కళ్ళు మూసుకుంది. అతనే నిగ్రహించుకున్నట్లు కొద్దిగా పట్టు సడలించాడు.విలువయినది ఏదో చేజారిపోతుంటే కలిగే ఆతురతతో ఆమె అతనికి దగ్గరయింది. సడలిన చేతులు సరిగా ఆమెని దగ్గరగా తీసుకునే విధాన్ని ఇట్టే అన్వేషించ టంతో ఆబగా అతని పట్టు బిగిసింది.

ఉద్వేగంవల్ల కాబోలు ఆమె గుండె వేగంగా కొట్టుకోసాగింది.అతని గుండె కూడా ప్రతిస్పందిస్తున్నట్లు వేగాన్ని పుంజుకోవటం ఆమెకి అవగతమయినట్లయింది. తనకి కుడి ఎడమ రెండు పక్కలా గుండెలున్నట్లు రెండూ ఐకమత్యంలా తీయని యుగళగీతం పాడుతున్నట్లు ఓ మనోహరమయిన భావన ఆమెని వివశురాలిని చేసింది.

మాట్లాడటం కంటే ఎంతో మధురమయిన పనులు పెదవులు చేయగలిగినప్పుడు మాట్లాడటం ఎందుకు అన్నట్లు ఇద్దరూ అల్లుకుపోయారు. కొన్ని కోట్ల మెయిల్స్‌లో కొన్ని గిగాబైట్స్‌లో చెప్పుకోలేని ఊసులని ఒకరికి ఒకరు విశదీకరించుకోవటానికి నూతన మార్గాన్ని కనుక్కోవటం ఎంతో ఉత్తేజంగా ఉంటుందన్న సంగతి సంయుక్తంగా ఆవిష్కరిం చిన తృప్తి ఇద్దర్నీ అదోరకమయిన మత్తులోకి తీసుకువెళ్ళింది.

చేసింది తప్పో ఒప్పో అన్న మీమాంసలోగాని, తర్వాత ఏమవుతుంది అన్న ఆందో ళనలోగాని సమయాన్ని వృథా చేయటంకంటే దారుణమైన తప్పిదం ఉండదు అనుకుంది చిత్కళ. అతనికి ఎంత దగ్గరయ్యానో కదా అన్న సంతృప్తికి బానిసైంది ఆమె మనసు.

ఎంతసేపు అలా ఉండిపోయారో తెలియదు గాని అతను "చిత్కళా!..." అంటూ ఏదో చెప్పబోయి ఆగిపోయాడు. అతని వంక ప్రశ్నార్థకంగా చూసింది. అతను సుతిమెత్తగా జారి పసివాడిలాగా ఆమె ఒడిలో తలవాల్చాడు. ఎవరు ముందుగా మొదలు పెట్టారో గాని కొంతసేపు తరువాత ఇద్దరిమధ్యా మాటలు మొదలయ్యాయి.

"...నాకు అయితే అప్పుడు పిచ్చిపట్టినట్లయింది. ఎంత తిక్కతిక్కగా ఉండేదంటే ఓ పిచ్చి కుక్కలాగా మారిపోయి దీనికి కారణం అయినవాళ్ళని కరిచేయాలన్నంత కచ్చ

కలిగింది. ఎందుకంటే వాళ్లకి కుక్కలంటే ఇష్టం కదా!...చిన్నపిల్లలని పాదచారులని కరుస్తూ రేబీస్‌కి గురిచేసి ఇబ్బందిపెట్టే పిచ్చికుక్కలని ఎంత దయతో పట్టుకోవాలో అన్నదిమటుకే ముఖ్యం అని భావించే వాళ్ళకి ఏం చెప్పగలం?...మేము చేసే ప్రయోగాలు ఏదో సరదాగానో, హిట్లర్‌లాగా అమానుష ఆనందం కోసమో చేయటం లేదుకదా? గుర్రపు పందాల లాగా ఇది వ్యాపారంకూడా కాదుకదా?...ఓ వ్యాక్సిన్ బయటికివచ్చి చాలామంది పసివారి ప్రాణాలని కాపాడగలిగేదేమో!...ఎందరో ఆరోగ్యం మెరుగుపడేదేమో!?

ఏవేవో అర్థంపర్థంలేని రూల్స్ అని, నిబంధనలు అనీ నాలాంటి ఎంతోమందిని ఎందుకు నిరాశపాలు చేసేస్తారో బోధపడటంలేదు. ఇటువంటి సరికాని అత్యుత్సాహం, మనుషులని మరిచి జంతువులపైన తెచ్చిపెట్టుకున్న ఆప్యాయతలవల్ల వాళ్ళు సాధించేది ఏమిటి?" చిత్కళ ఎప్పటినుండో దాచుకున్న ఆవేశాన్ని అతనిముందు వెల్లడిచేసింది.

"చిత్కళా!...నేనూ నెట్‌లో చూశాను. ఓసారి అమెరికాలో ఓ యూనివర్సిటీ యానిమల్ హౌస్ పైన యానిమల్ లవర్స్ అని చెప్పుకునేవాళ్ళు దాడిచేసి కొన్ని జంతువులని విడుదల చేశారుట. సైన్స్ పేరిట జరుగుతున్న చిత్రహింసలకి వ్యతిరేకంగా జరిగింది అని చెప్పుకున్న ఆ దాడివల్ల విడుదల అయిన ఆ జంతువులు రెండోరోజో మూడో రోజో చనిపోయాయిట..." అన్నాడు చరణ్.

"ఇప్పుడూ అలాగే అవుతుందని అంటున్నారు. మా లాబ్‌లో ప్రొటెక్టెడ్ వాతావరణంలో పెరిగిన ఆ కోతులని ఏదో అడవిలో వదిలారుట...హఠాత్తుగా జరిగిన ఈ మార్పును తట్టుకోలేక మిగిలిన జంతువులతో అలవాటులేని పోటీపడలేక అవి కూడా త్వరగానే చనిపోతాయని అంటున్నారు..." చిత్కళ కళ్ళు తుడుచుకోవటం కోసం ఆగింది.

ఆరు గంటలూ క్షణాలులాగా గడిచిపోయాయి. "ఇక నేను కదలకపోతే ఇంట్లో వాళ్ళకి అనుమానం వస్తుంది" అన్నాడు చరణ్ మూడోసారి.

చిత్కళకి బెంగగా అనిపించింది. మళ్ళీ కళ్ళనీళ్ళు పెట్టుకుంది చిత్కళ. ఆమెని ఎలా సముదాయించాలో తెలియక చరణ్ సతమతమయ్యాడు.

ఇలా వచ్చిన చరణ్ అలా వెళ్ళిపోయాడే అని చిత్కళ అనుకున్నమాట వాస్తవమే కాని రెండు రోజులలో సర్దుకుంది. తనని ఓదార్చటానికే అన్నివేల మైళ్ళని లెక్కచేయకుండా దాటి వచ్చిన వ్యక్తితో జీవితం పంచుకోగలగటం ఎంత అదృష్టం!

దానికి తోడు రీసెర్చ్ గైడ్ చిత్కళలో ఏమూలో దాగిన నిరాశని కూడా తొలగించింది. మూడు రోజులు గైడ్ కూడా నిర్విరామంగా చిత్కళతో పాటు కూర్చుంది. అంతవరకూ చేసిన పనిని కూలంకషంగా రివ్యూ చేశారు. అంతవరకూ చేసిన పనిని జంతువుల పైన ప్రయోగాలు లేకుండా ఏ విధంగా మలిస్తే బాగుంటుందో చర్చించారు. ఇంకో ఏడాది పని చేసి పిహెచ్‌డి పూర్తి చేసేవిధంగా ప్లాన్ చేశారు. అంటే చిన్న అంతరాయం కలిగింది కాని చిత్కళ పిహెచ్‌డి మరీ ఆలస్యం అవదన్నమాట!



వెంటనే చిత్కళ ఈ శుభవార్తని తెలియచేస్తూ చరణ్‌కి మెయిల్ ఇచ్చింది.

అయితే ఆ విషయం చిత్కళ తండ్రికి చెప్పదల్చుకోలేదు. డాక్టరేట్ అంత త్వరగా వస్తుందని ఆయనకి తెలిస్తే ఏవేవో సంబంధాలు అని ఇబ్బందిపెడతాడని చిత్కళ భయం.

చిత్కళ రెట్టించిన ఉత్సాహంతో పనిచేయసాగింది. ఇక ఏ విధమయిన సమస్యా లేకుండా పని పూర్తి చేయాలని చిత్కళ లాబ్‌లో ఎక్కువ సమయం గడపసాగింది. ఇంటికి కూడా కాయితాలు తెచ్చుకుని రాసుకుంటూ ఉండేది.

బహుశా అలా పనే లోకంగా గడపటం వల్లనే కాబోలు బామ్మకి అనారోగ్యంగా ఉందన్న సంగతి చిత్కళ వెంటనే గమనించలేదు.

అలసిపోయేలాగా పని పని పని... అన్న దినచర్యవల్ల మంచంపైన పడుకోగానే ఒళ్ళు తెలియని నిద్ర కమ్ముకువచ్చేది ఆమెకి.

ఓ రాత్రి ఎందుకో మెలకువ వచ్చింది. పక్కన ఉన్న మంచంపై బామ్మ పడుకుంటుంది. బామ్మ ఎక్కువ శబ్దం చేస్తూ ఊపిరి పీలుస్తున్నది.

చిత్కళ వెంటనే లైట్‌వేసి చూసింది. శ్వాస అందక బామ్మ ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. హడావిడిగా ఆమెని హాస్పిటల్‌లో చేర్చారు.

తరువాత తెలిసింది. వారం పదిరోజులనించీ రాత్రిపూట బాగా ఆయాసంగా ఉంటున్నదిట. ఆ సంగతి బామ్మ ఎవరికీ చెప్పలేదు. ఏ మందులు వాడలేదు. తనకి తెలిసిన చిట్కావైద్యాన్ని ఉపయోగించింది. అలా రోగం బాగా ముదిరింది. లంగ్స్‌లో తీవ్రంగా ఇన్‌ఫెక్షన్ సోకిందిట. యాంటీబయాటిక్స్ వాడటం ఆక్సిజన్ పెట్టటంతో బామ్మ పరిస్థితి కొంత మెరుగయింది.

ప్రతి సాయంకాలం లాబ్ నుంచి వస్తూ హాస్పిటల్‌లో బామ్మని చూసేది చిత్కళ. రోహిణి కాని సుధాకర్ కాని రాత్రిపూట బామ్మకి తోడుగా ఉండేవాళ్ళు.

ఓ రాత్రి చిత్కళ పడుకుంది.

చిత్కళని చూసి బామ్మ కళ్ళు మెరిశాయి. ఐనా పైకి "నువ్వు ఎందుకు వచ్చావే? మళ్ళీ రేపంతా లాబ్‌లో కష్టపడతావు" అంది.

చిత్కళ మంచంపైన కూర్చుని బామ్మచేయి అందుకుంది.చర్మం వదులయిమెత్తగా ఉంది. "డాక్టర్లు అంతా మమ్మల్ని తిడుతున్నారు బామ్మా! ఆవిడకి ఒంట్లో బాగాలేకపోతే ఇంత ఆలస్యం చేశారేమిటి అని అంటున్నారు. నువ్వయినా ఎందుకు చెప్పలేదు?"

ఆవిడ నవ్వింది. "చెప్పేంత అసౌకర్యంగా అనిపించలేదు. రాత్రి సరిగా నిద్రపట్టేది కాదు...అదే సర్దుకుంటుంది అనుకున్నాను"

చిత్కళ ఎంత నిగ్రహించుకున్నా కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది...ఛా! తనయినా ముందుగా గమనించి ఉంటే ఎంత బాగుండేది!

"చిత్కళా!" బామ్మ గొంతు బలహీనంగా ధ్వనించింది. "నీకు గుర్తుందా? ఓసారి

గుడికి వెడుతూ నాకు ఒకే ఒక కోరిక ఉందే అని చెప్పాను"

చిత్కళ తల ఊపింది. ఆ సంఘటన తను ఎలా మరిచిపోతుంది?ఆనాడే మొదటి సారిగా తను, చరణ్ ఎదురుగా కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు.

తమ భవిష్యత్తు జీవితంలో చేయాల్సిన వెయ్యి మహత్కార్యాల గురించి చరణ్ ఊహించటం ప్రారంభించింది అప్పుడే!

• "...ఆ రోజు నేను చెప్పింది అబద్ధం"

తనకి ఎంసెట్‌లో మంచి ర్యాంక్ రావాలన్న కోరిక గురించి బామ్మ ఆరోజుచెప్పింది. అది అబద్ధమా?...అయినా బామ్మ ఇప్పుడు ఎందుకు ఆ విషయం చెబుతున్నది?

"నిజానికి నాకు అప్పుడూ ఇప్పుడూ ఉన్నది ఒకటే కోరిక...నీకూ ఆ అబ్బాయి చరణ్‌కి పెళ్ళి జరగాలని" ఆయాసం మూలంగా కాబోలు బామ్మ ఆగింది.

చిత్కళ నిర్ఘాంతపోయింది. అప్రయత్నంగా బామ్మచేయి వదిలేసింది. బామ్మకి తమ ప్రేమాయణం గురించి తెలుసా?...ఆ రోజున...అంటే అప్పటికి తన ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నది...చరణ్ ఇంజనీరింగ్‌లో అప్పుడే చేరాడు. ఆనాడే బామ్మ తమసంగతి పసికట్టిందా?...తమ కుటుంబాల మధ్య కలహాలు ఉన్న ఈ రోజులలో కూడా బామ్మకి అదే కోరిక ఉందా?

శక్తినంతా కూడకట్టుకుని బామ్మ చిత్కళ చేతిని పట్టుకుంది. "మీ అమ్మ చదువుకుంది. నేనేమో పాతకాలపుదాన్ని. వయసు వచ్చిన పిల్లని వెయ్యికళ్ళతో చూసుకోవాలన్న చాదస్తం ఉన్నదాన్ని..." బామ్మ మెల్లగా చెప్పసాగింది.

చిత్కళ ఉన్నట్లుండి ఉయ్యాల అంటే ఆసక్తి చూపించటం, రోజులో ఎక్కువభాగం ఊగుతూ గడపటంతో బామ్మకి అనుమానం వచ్చింది. చాటుగా గమనించింది. చరణ్ కాయితాలు పడేయటం దానికి చిత్కళ జవాబు ఇవ్వటం ఆమె చూస్తూనే ఉంది. అటు చరణ్ బాగా చదువుకోవటం ఇటు చిత్కళా మంచి మార్కులు తెచ్చుకోవటంతో ఆందోళనకి ఆస్కారం లేదని అనుకుంది. చరణ్ మంచి చదువులో చేరాడని తెలిశాక ఇంకొక అడుగు ముందుకువేసి పరోక్షంగా వాళ్ళని ప్రోత్సహించింది. గుడికి తీసుకువెళ్ళమని చిత్కళని అందుకే అడిగింది బామ్మ.

సుధాకర్, మధుసూదన్ పోట్లాట పెట్టుకున్నాక చిత్కళ ఎంత కుమిలిపోయిందో బామ్మకి తెలుస్తూనే ఉంది. కాని ఏమీ చేయలేని అసహాయస్థితి! ఆ వేదన నుండి చిత్కళ ఎలా కోలుకుందో బామ్మకి అంతుపట్టలేదు.కాని ఏదో ఒకవిధంగా చిత్కళ తిరిగి చరణ్‌ని కలుస్తూనే ఉంది అని ఊహించింది.

చిత్కళ ఆశ్చర్యం నుండి తేరుకోవటానికి చాలా సమయం పట్టింది. ఆడవాళ్ళని తక్కువ చేయకు అని చరణ్‌కి ఉత్తరం రాస్తే అతను ఆలస్యంగా జవాబు ఇచ్చాడు.ఆనాడు ఆ జవాబు తనకంటపడేటట్లు చేసింది బామ్మే! అరవిందతో పరిచయం చేసిందికూడా బామ్మే!...చరణ్ గురించి ఏమీ తెలియనట్లు నటించి చరణ్‌కి ఇంజనీరింగ్‌లో సీట్‌రాక ఐఐటి కోర్సు చేస్తున్నాడా అని బామ్మ అడిగితే అమాయకత్వం అనుకుని నవ్వుకుంది తను... అందర్నీ ఇంత పిచ్చివాళ్ళని చేసిన బామ్మ ఎంత గడుసుది!

"అమెరికాలో ఆ భవనాలు కూలినప్పుడు నువ్వు ఎంత కంగారుపడ్డావో చూశాను. అమ్మయ్యా ఇంకా ఇద్దరూ మాట్లాడుకుంటూనే ఉన్నారు అనుకున్నాను. ఇప్పటికీ ఉత్తరాలు రాస్తున్నాడా?...పెళ్ళి ఎప్పుడంటున్నాడు?..."

సంతోషమో దుఃఖమో తెలియదుకాని చిత్కళని కమ్మేసింది.బామ్మ చేయి అందుకుని కళ్ళకి అద్దుకుంది. తన తల్లిదండ్రులు కూడా బామ్మ చూసినవన్నీ చూశారు. కానీ కొంచెం కూడా గమనించలేకపోయారు.

చేతికి తడి తగలటంతో బామ్మ కంగారుపడింది. "చిత్కళా! ఏమయింది. అతను పెళ్ళికి ఒప్పుకోవటంలేదా?"

బామ్మ ఆతృతకి అనుకోకుండా ఫక్కున నవ్వింది చిత్కళ. "బామ్మా! చరణ్ చాలా మంచివాడు...అప్పుడు మా లాబ్‌లో ఉన్న ఆ జంతువులని వదిలిపెట్టేశారు గుర్తుందా? నన్ను ఓదార్చటానికి అంతదూరంనించి వచ్చాడు.పెళ్ళి అంటావా?...నాన్నావాళ్ళు..." మాట మధ్యలో ఆపేసింది చిత్కళ.

బామ్మ కాసేపు మాట్లాడలేదు. "సొంత కొడుకులాగా చూసుకుంటున్నాడు మీ నాన్న. అందుకే వాడికి వ్యతిరేకంగా ఏమీ అనను కాని నువ్వూ చరణ్ పెళ్ళిచేసుకుని హాయిగా ఉండాలని నా కోరిక. నేను బతికి ఉండగా అది చూడలేనని తెలుసు..." బామ్మ కూడా సగంలో ఆపేసింది.

బామ్మ ఏం చదువుకోలేదు. కాని ఎక్కడనుండి వచ్చింది ఆ సంస్కారం?

మత్తుమందు ఇచ్చాక బామ్మ నిద్రలోకి జారుకుంది కాని చిత్కళ ఆ రాత్రంతా బామ్మనే చూస్తూ ఉంది.

రెండు రోజుల తరువాత బామ్మకి నిద్రలోనే సునాయాస మరణం ప్రాప్తించింది.

• • •

ఇంట్లో ఖాళీ మంచం చూస్తే చిత్కళకి బామ్మ గుర్తుకి వచ్చేది. లాబ్‌లో ఎంతగా పనిలో మునిగిపోయినా బామ్మ గుర్తుకివస్తూనే ఉంది. ప్రయోగాలు చేయటం అయిపోయి ఆ ఫలితాలని విశ్లేషించటం, థీసిస్ రాయటం మిగిలింది.

చిత్కళ దీక్షగా పనిచేయసాగింది. రోజూ సాయంకాలం ఇంటికెళ్ళేముందు అలమారలో ఉన్న కాయితాలని, రికార్డ్ పుస్తకాలని తృప్తిగా చూసుకునేది. నాలుగైదేళ్ళ కష్టఫలితం అవన్నీ. మధ్యలో ఇబ్బందులు వచ్చినా చివరికి తను గమ్యం చేరబోతున్నది.

థీసిస్‌ని తనే స్వయంగా టైప్‌చేసి డ్రాఫ్ట్‌కాపీ తన గైడ్‌కి చూపించేది. ఆవిడ సూచించిన మార్పుల ప్రకారం ఎప్పటికప్పుడు సమర్పించేది.

ఓ రోజున చరణ్‌కి మెయిల్ ఇచ్చింది.

చరణ్, వారం...మహా అయితే రెండు వారాలలో నా థీసిస్‌కి మొదటి ఫెయిర్ కాపీ తీసి బైండింగ్‌కి ఇచ్చేస్తాను.

ఇన్నేళ్ళ నా శ్రమ ఇలా ఓ రూపు దిద్దుకోవటానికి ముఖ్యమయిన కారణం, ప్రోత్సాహం, ఇన్‌స్పిరేషన్ నువ్వు.

కాని ఈరోజున నేను నీకు కృతజ్ఞతలు చెప్పేబదులు విస్మరించి ద్రోహం చేశాను.

థీసిస్ ముందున ఉండే ఎక్‌నాలెడ్జ్‌మెంట్స్ పేజీ ఈరోజే టైప్‌చేసి మా గైడ్‌కి చూపించాను. అందులో మా గైడ్‌పేరు, సాయంచేసిన తోటి ఉద్యోగులపేర్లు, అమ్మానాన్న బామ్మల పేర్లు అన్నీ రాశాను కాని నీ పేరు రాయలేకపోయాను చరణ్! నీ పేరు ఉదహరిస్తే అది నాన్నకి తెలియకుండా ఉండదు. చాలా గొడవ అవుతుంది. నిజంగా నేను చాలా కృతఘ్నురాలిని కదూ...నీ చిత్కళ.

ఆ మెయిల్ ఇచ్చిన రాత్రి హఠాత్తుగా చిత్కళకి మెలకువ వచ్చింది...ఛా! నాకు ఇంత బుర్ర లేదేమిటి అనుకుంది.

ఆ మర్నాడు లాబ్‌కి వెళ్ళగానే చరణ్‌కి ఇంకో మెయిల్ ఇచ్చింది.

చరణ్, అయ్యవారు ఏం చేస్తున్నారూ అంటే ఒలకబోసినది ఎత్తుకుంటున్నారు అని ఓ సామెత ఉంది తెలుసు కదా? నాకు అది చాలా బాగా అన్వయిస్తుంది. ఒకపని చేయటం దానికి రెండు సవరణలు చేర్చటం.

నీ పేరు ఉదహరించకుండా ఎక్‌నాలెడ్జ్‌మెంట్స్ రాయటం చాలా చాలా తప్పు అని నాకు తోస్తున్నది. కాని రాస్తే ఇంకో తంటా కదా! అందుకనే ఓ బ్రహ్మాండమైన అయిడియా కనిపెట్టాను. మా నాన్నకి చూపించే కాపీలో నీ పేరు ఉండదు మిగిలిన అన్ని కాపీలలోనూ నీ పేరు ఉంటుంది. ఎలా ఉంది నా అయిడియా? కంప్యూటర్లు, డెస్క్‌టాప్ ప్రింటింగ్‌లు వచ్చాక ఇలాంటివి సులువుగా చేయగలుగుతున్నాం.

నా గుండెలపై నుండి ఓ బరువయిన రాయి తీసేసినట్లుగా ఉంది ఇప్పుడు.

మనం దగ్గరయ్యే రోజు ఇంకా ఇంకా దగ్గరవుతున్నది డియర్. బై...నీ చిత్కళ.

ఆ మెయిల్ ఇచ్చాక నిజంగానే రిలీఫ్ అనిపించింది చిత్కళకి.

ఆ తరువాత చకచకా థీసిస్ చివరి చాప్టర్ కూడా టైప్ చేసేసింది.

అంతవరకు రాసినదంతా విడివిడిగా రెండు ఫ్లాపీలలోకి కాపీ తీసుకుంది చిత్కళ. రెండూ జాగ్రత్తగా కేస్‌లో పెట్టి అలమారలో పెట్టి భద్రంగా తాళంవేసింది.

కంప్యూటర్ షట్‌డౌన్ చేసి కొంతసేపు కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది చిత్కళ. రెండు గంటల నుండి విరామం లేకుండా టైప్ చేస్తున్నది.

పక్కనే ఉన్న చిన్న పుస్తకంలో చెక్ లిస్ట్ చూసుకుంది. లైబ్రరీలో కొంత సమాచారం సేకరించాలి. అలసటగా ఉన్నా లైబ్రరీకి వెళ్ళాలి తప్పదు అనుకుంది.

పావుగంట అనుకున్నది గంటన్నర అయినా పూర్తికాలేదు.కావలసిన జర్నల్ దొరకలేదు. మళ్ళీ లంచ్ తరువాత ప్రయత్నించాలి అనుకుంది. జర్నల్ సెక్షన్ నుండి మెయిన్ హాల్‌లోకి వెళ్ళింది. అప్పుడు గమనించింది...ఉన్నవాళ్ళంతా గుంపులుగా మారి ఎంతో ఎగ్జైటెడ్‌గా మాట్లాడుకుంటున్నారు.

"ఏమయింది?" అడిగింది చిత్కళ.

"లాబ్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ అంటున్నారు. ఇంకా మంటలు తగ్గలేదు"

"ఎక్కడ?..." చిత్కళ అడిగింది కిటికీలోంచి బయటికి చూస్తూ...ఒక పక్కగా నల్లటి పొగలు పైకి వెడుతున్నాయి.

"సెకండ్ ఫ్లోర్..." చెబుతున్న అతను అప్పుడే చిత్కళని గుర్తుపట్టి "...అరే!...మీరు పనిచేసే రూములలోనే అనుకుంటాను"

అతని మాటలు పూర్తికాకుండానే చిత్కళ బయటికి పరిగెత్తింది.

లైబ్రరీకి పావు కిలోమీటర్ దూరంలో మెయిన్ బిల్డింగ్ ఉంది.

లైబ్రరీ పూర్తిగా ఏసి అవటంతో లోపల తెలియలేదుగాని బయటికి రాగానే కాలుతున్న వాసన ముక్కు బద్దలుచేస్తున్నది.

బిల్డింగ్‌లో కింద అంతస్తులోనే చిత్కళకి అందరూ కనబడ్డారు. చిత్కళని చూడగానే ఆమె స్నేహితురాలు లత "అదుగో చిత్కళ...!" అని అరిచింది. "అమ్మయ్యా!...నువ్వు ఇంకా అక్కడ చిక్కుకుపోయావని కంగారుపడుతున్నాం. థాంక్ గాడ్!..." అందరూ చిత్కళ చుట్టూ చేరి భుజం, తల తట్టారు. పరుగు పందెంలో గెలిచిన క్రీడాకారిణిని అభినందిస్తున్నట్లు!

"జంక్షన్ బాక్స్‌లో షార్ట్ సర్క్యూట్ మొదలయి ఆ మంటలకి సాల్వెంట్స్ అంటుకోవటంతో పేలుడులాగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయిట. అందరూ భయకంపితులై పరుగున కిందకు వచ్చేశారుట...ఫైర్ ఇంజన్‌కి ఫోన్‌చేశారు. ఈలోగా కొందరు అందుబాటులో ఉన్న అగ్నిమాపక సామగ్రితో ప్రయత్నించారుట కాని లాభంలేకపోయిందిట. ఫైర్ ఇంజన్ వచ్చాకే మంటలు తగ్గుముఖం పట్టాయిట..."నువ్వు చాలాసేపు కంప్యూటర్ ముందు ఉండటం చూశాను.నువ్వు బయటికి వెళ్ళావని తెలియదు. నువ్వు చాలా లక్కీనే! అక్కడ ఉండి ఉంటే...ఏమాత్రం ఛాన్స్ ఉండేది కాదు..." లత చెప్పుకుపోతున్నది.

ఏదో అర్థం అయీ అవనట్లు ఇబ్బందికరమైన భావన ముల్లులాగా గుచ్చుతుంటే చిత్కళ అడిగింది "అంటే?...అంటే మన రూంలు పూర్తిగా కాలిపోయాయా?" అని.

"...సరిగా తెలియదు కాని అంతేనుట... నాకు అయితే ఎంత భయంవేసిందో తెలుసా? ఎలా పరుగు తీశానో నాకే తెలియదు"

లత ఎలా తప్పించుకుందో వినాలన్న కుతూహలం చిత్కళకి లేనేలేదు. మెట్లవైపు వెళ్ళబోయింది.

"ఎక్కడికి?...ఎవరినీ అటు వెళ్ళనీయటంలేదు. మంటలు తగ్గాయని రూఢి చేసుకున్నాక డామేజి ఎంతజరిగిందోతెలుసుకోవటానికి చిన్నచిన్నగ్రూపులుగా పంపుతారుట"

డామేజీ!...అవును డామేజీనే!...చిత్కళకి కళ్ళు తిరుగుతున్నట్లు ఉన్నాయి. మాట్లాడలేకపోతున్నది. అసలు మాట్లాడాలన్న ఇచ్ఛ కూడా లేనట్టు శక్తిహీనంగా అయిపోయింది.

మాటలు వినబడుతున్నాయి. "రెండు నెలల క్రితం అనుకుంటాను శాంతాక్రజ్‌లో ఉన్న కాలిఫోర్నియా యూనివర్సిటీలో అగ్నిప్రమాదం జరిగింది. ఒక వింగ్ అంతా మళ్ళీ యధాప్రకారం పనిచేయటానికి ఎనిమిది నెలలయినా పడుతుందని అన్నారు"

"అవును...నేనూ చదివాను...ముఖ్యంగా బాగా దెబ్బతిన్నది పిహెచ్‌డి స్టూడెంట్స్‌ట... యూనివర్సిటీవాళ్ళ సమస్య అర్థంచేసుకుని ఫెలోషిప్ కాలపరిమితి పెంచిందిట..."

ఇప్పుడు జరిగినదేమిటో దాని పరిణామాలు తనని ఎంతగా చికాకు పరుస్తాయో చిత్కళకి మెల్లగా అర్థం అవసాగాయి. నాశనం...సర్వనాశనం.

ఆ రూమ్‌లో తను ఉండి ఉంటే బతికి బట్టకట్టటం కష్టం అని అనుకున్నారుట. అంటే...అంటే...అంత భీకరంగా అక్కడ మంటలు చెలరేగాయి అన్నమాట!...ఇక అలమారలో తను భద్రంగా దాచాననుకున్న ఫ్లాపీలు, ఏళ్ళ తరబడీ రాసుకున్న రికార్డ్‌లు, కాయితాలు, ఫలితాలు, వాటిని అర్థమయ్యేటట్లు కూర్చిన పట్టికలు, గీసుకున్న గ్రాఫులు అన్నీ... అన్నీ...తగలబడి ఉంటాయి. ఇక తన శ్రమకి గుర్తుగా ఏం మిగిలి ఉంటుంది?

ఆ...కంప్యూటర్!...అవును...కంప్యూటర్ మెమరీలో ముఖ్యమయిన డేటా, థీసిస్ కాపీ అన్నీ ఉన్నాయి. కాబట్టి ప్రాబ్లెమ్ ఏం ఉండకపోవచ్చు! భగవంతుడా... శక్తిహీనంగా చిత్కళ నేలపైకి వాలిపోయింది.

లత ఎవరినో తీసుకువచ్చి చిత్కళ ఎదురుగా నుంచుంది. చిత్కళ తలెత్తి చూసింది. "చిత్కళా! ఇతను నీ రూమ్‌లోకి వెళ్ళి చూసి వచ్చాడుట..." లత చెబుతున్నది.

చిత్కళ ఒక్క ఉదుటున లేచింది."ఎలా ఉంది?నా కంప్యూటర్ ఎలా ఉంది?"

అతను తల తిప్పుకున్నాడు. "సారీ!...కంప్యూటర్ టేబుల్ పూర్తిగా కాలిపోయింది. దాంతోపాటే కంప్యూటర్ కూడా..."

చిత్కళకి ఇక ఏం వినబడలేదు...నాశనం...సర్వనాశనం...సంపూర్తిగా సర్వం నాశనం అయిపోయింది. ఆమె భోరున ఏడవసాగింది.

చిత్కళని దగ్గరకి తీసుకుంది లత. చిత్కళని సముదాయించటం కష్టం అని ఆమెకి తెలుసు...మౌనంగా చిత్కళ భుజాన్ని తట్టసాగింది.

చిత్కళ సడెన్‌గా "చరణ్...చరణ్..." అంది.

లతకి అర్థం అవలేదు. "ఏమిటి?..." అడిగింది.

"నేను అర్జెంట్‌గా చరణ్‌కి మెయిల్ ఇవ్వాలి"

అగ్నిప్రమాదం జరిగిందని ఆ బిల్డింగ్‌లో కరెంట్ ఆపేశారు. మంటలు తగ్గాక



అప్పుడే మళ్ళీ సప్లయి మొదలయింది.

లత పక్కనే ఉన్న స్నేహితురాలి రూమ్‌కి తీసుకువెళ్ళింది. రూమ్ ఖాళీగా ఉంది. కంప్యూటర్ ఆన్‌చేసి దానిముందు చిత్కళని వదిలి బయటికి వెళ్ళింది.

అంత దుఃఖంలోనూ చరణ్ ఆన్‌లైన్‌లో ఉన్నాడని చిత్కళ గమనించింది. అతనికి అర్థరాత్రి అయి ఉండాలి.అదృష్టం కాకపోతే అతను ఇంకా మెలకువగా ఉండటం ఏమిటి? అంతలోనే దుఃఖం తన్నుకువచ్చింది. అదృష్టమా?...ఏం అదృష్టం?...

చాటింగ్ మొదలుపెడుతూ ఆమె టైప్ చేసిన మొదటి పదాలు 'నాశనం...సర్వనాశనం'

చరణ్ టైప్‌చేసిన సందేశం రెండు సెకన్‌ల తరువాత తెరపైన ప్రత్యక్షమయింది "ఏమిటి? ఏమంటున్నావు చిత్కళా?"

"పెద్ద ఘోరంజరిగిపోయింది.లాబ్‌లో మా రూములు పూర్తిగా కాలిపోయాయి"

"ఓ!...నో...! ఆర్యూ సేఫ్?...నువ్వు ఎలా ఉన్నావు?"

"నాకేం అవలేదు చరణ్. కాని...కాని నేను ఇన్ని రోజులుగా శ్రమించి రూపొందించిన నా థీసిస్‌లో ఒక్క అక్షరం మిగలకుండా కాలిపోయింది. ఏం మిగలలేదు"

"నాకేం అర్థం అవటంలేదు. థీసిస్ కాలిపోవటమేమిటి?"

"అయ్యో! ఎలా చెప్పను? నేను సేకరించిన ప్రతి విషయం, చిన్న వివరం కూడా నా రూమ్‌లోనే ఉన్నాయి. ప్రయోగాల ఫలితాలు, విశ్లేషణ అన్నీ భద్రంగా రెండు ఫ్లాపీలలో దాచాను. ఇప్పుడు నా రికార్డ్ పుస్తకాలు, ఎనలిటికల్ రిపోర్టులు, నేను రాసుకున్న చిత్తుప్రతులు ఆ ఫ్లాపీలు అన్నీ ఇంకా చాలా చివరికి నా కంప్యూటర్ కూడా మాడి మసి అయిపోయింది. నా శ్రమ అంతా బూడిదగా మారిపోయింది చరణ్"

ఈసారి అటునించి సమాధానం రావటానికి సమయం ఎక్కువ పట్టింది. "మరి నువ్వు చేసిన పని అంతా?"

"అంతా నా బుర్రలో తప్ప ఇంక ఎక్కడా మిగలలేదు. కాని నాకు బుర్ర ఉందో లేదో నాకు తెలియటంలేదు"

అలాంటి క్లిష్ట పరిస్థితులలో కూడా జోక్‌చేస్తున్న తనకి నిజంగానే బుర్రలేదు అనుకుంది చిత్కళ.

అటునించి సమాధానం లేదు.

"చరణ్ ఆర్యూ దేర్?..." చరణ్ తన చరణ్...తనని సముదాయించే చరణ్...తన కష్టాలని అర్థంచేసుకుని ఓదార్చే చరణ్...అసలు చరణ్ అన్న పదంలోనే సాంత్వన ఉంది.

సమాధానం లేదు.

"చరణ్...చరణ్...ఉన్నావా?..." తెలుగు మాటని ఇంగ్లీష్‌లో టైప్ చేసింది. అయినా సమాధానం లేదు. అంతలో ఏదో స్ఫురించి లోనుండి ఆవేదన తన్నుకువచ్చింది. చున్నీని

నోటిలో కుక్కుకుంది. తడబడుతూ టైప్ చేసింది. "చరణ్!...చివరికి మొన్న నువ్వు తెచ్చిచ్చిన చాక్‌లెట్స్ కూడా..." థీసిస్ పూర్తి అయిందన్న వార్త విని చరణ్ వచ్చేంతవరకూ అవి ఖర్చు అవకూడదని పిసినారిలాగా ఎవరికీ ఇవ్వకుండా దొంగలాగా ఎవరికీ తెలియకుండా ఒక్కొక్క చాక్‌లెట్ తినేది.

సమాధానం లేదు.

"చరణ్...ఈసారి నువ్వు వేసుకున్న టై బాగాలేదని అన్నాను కదా...క్రితంవారం షాపింగ్‌కి వెళ్ళినప్పుడు ఓ బ్రహ్మాండమయిన టై కనబడితే కొనకుండా నిలవలేకపోయాను. ఇంటికి ఎలా తీసుకువెడతాను?...అదీ నా డ్రాలో దాచాను. అదీ...బహుశా అదీ కాలిపోయి ఉంటుంది"

"చిత్కళా! ఐ యామ్ సారీ!... మధ్యలో ఇంకేదో అటెండ్ అవ్వాల్సి వచ్చింది. డోంట్ వర్రీ!... ఇప్పుడు బిజీగా ఉన్నాను. ఐ విల్ కాల్ యూ లేటర్. బై..." అతను ఆఫ్‌లైన్ అయిపోయాడు.

'బై...' అని టైప్ చేయబోయి ఆగిపోయింది. ఏం లాభం?...అతను ఎలాగూ చదవలేడు...ఎవరికోసం?

కంప్యూటర్ ఆఫ్‌చేసి చక్రాల కుర్చీని వెనక్కి తోసి లేవబోయింది.అప్పుడు తట్టింది... 'ఐ విల్ కాల్‌యూ లేటర్' ట...ఎలా? తనకి ఏ నెంబరూ లేదే?...ఇంటికి ఫోన్ చెయ్యడే?... ఎక్కడికి ఫోన్‌చేస్తాడు?...మరి కాల్యూ లేటర్ అంటే? కుర్చీలో కూలబడింది.తప్పు కోణంలో కూర్చుందేమో కుర్చీ గిర్రున తిరిగింది. 'కాల్ యూ...' అంటే? 'లేటర్...' అంటే?

రెండు కాళ్ళతో నేలను తోస్తూ కుర్చీని మళ్ళీ కంప్యూటర్ టేబుల్ దగ్గరికి లాక్కు వెళ్ళింది. కంప్యూటర్ ఆఫ్‌చేసి ఉన్నా ఉన్మాదంగా టెల్‌మి చరణ్. టెల్‌మి...కాల్ యూ లేటర్ అంటే అర్థం ఏమిటి?...చెప్పు...చెప్పు...ప్లీజ్...చెప్పు..చెప్పు...చెప్పు...చెప్పు...అని టైప్ చేయసాగింది.

• • •

చాటింగ్‌లో ఉన్నట్లుండి బై చెప్పేసి చరణ్ సైన్ ఆఫ్ చేశాక కూడా చిత్కళ మనసు లోపల ఎక్కడో కాసింత ఆశ మిణుకుమిణుకుమంటూ ఉండేది. చరణ్‌కి నాలుగు మెయిల్స్ ఇచ్చింది. జవాబుకోసం అయిదు రోజులు చూసింది. నమ్మకం కుదరకపోయినా బిజీగా ఉన్నాడేమో అన్నదాన్ని పదేపదే చెప్పుకుంది. అతనినుండి జవాబు రాకపోయేసరికి లోకం మీదా, మంచితనం మీదా అనుమానం మొదలయింది.

ఏమీ తెలియని అమాయకత్వంలో ఎన్నెన్ని చిన్నచిన్న ఉత్తరాలు రాసుకున్నారు?... ఎన్నెన్ని కబుర్లు చెప్పుకున్నారు? సినిమా హాలులో మొదటిసారి అతను తన చేయి పట్టుకున్నప్పుడు రాత్రంతా నిద్రపోకుండా ఎన్ని ఊహించుకుందో?

హోటల్‌రూమ్‌లో శారీరకంగా కలిసినప్పుడు అతన్ని కన్న తల్లిదండ్రులకి లేని అధికారాన్ని తాను సంపాదించుకున్నట్లు అనిపించింది. అతనితో బాల్యాన్ని పంచుకుని కలిసి పెరిగిన చెల్లెలికంటే తానే దగ్గర అయినట్లు భావించింది. అప్పుడు తనని సముదాయించటానికి అన్ని సముద్రాలు దాటి వచ్చిన చరణ్ ఎందుకిలా పాషాణుడయ్యాడు?

ఆమెకి ఓ సంగతి గుర్తుకొచ్చింది తనతో సినిమా చూద్దామని ముచ్చటపడ్డ అమెరికా పెళ్ళికొడుకు యానిమల్ హౌస్‌లో జరిగిన గలబావల్ల తన పిహెచ్‌డి పూర్తి అవటానికి చాలా సమయం అవుతుందని చెప్పగానే...ఓకె...ఐ విల్ కాల్ యూ లేటర్ అన్నాడు. చరణ్ కూడా అదేమాట అన్నాడు కదూ!...పిచ్చి నవ్వు ఆమె పెదవులపైన మెరిసింది.

ఆమె రీసెర్చ్ గైడే కాదు లాబ్ డైరెక్టర్‌కూడా ఎంతో సానుభూతి చూపించారు.ఆమె చేసిన ప్రయోగాల తాలూకు డేటా అంతా ఆమె దగ్గరే రికార్డ్ అయి ఉండేది. అంతా మంటల పాలయింది. అలా కాకుండా యానిమల్ హౌస్ రికార్డ్‌లలో యనలిటికల్ డివిజన్ రికార్డ్‌లలో ఆమె ప్రయోగాల గురించి ఉన్న సమాచారాన్ని సేకరించి అందులోంచి ఏమన్నా ఉపయోగపడే వివరాలని వెలికి తీయవచ్చా అన్నది ప్రయత్నించమన్నారు, సాధ్యమయినంత సాయంచేస్తామని చెప్పారు.

వారం రోజులు...పది రోజులు...అప్పటికి కూడా చరణ్ నుండి ఏ కబురూ లేదు!

• • •

"మేడమ్! మేడమ్!..." ప్రభాకర్ పిలిచాడు.

చిత్కళ ఇంకా గతస్మృతులలోనే ఉంది.

"చిత్కళగారూ..."

త్రుళ్ళిపడి ప్రస్తుతంలోకి వచ్చింది చిత్కళ. స్టూడియోలో ఉన్న గోడగడియారం చూసి ఆశ్చర్యపోయింది. అయిదు నిముషాలు...జస్ట్ అయిదు నిముషాలలో తను ఎన్నో సంగతులు గుర్తుచేసుకుంది.

ప్రభాకర్ అందర్నీ ఉద్దేశించి మాట్లాడుతున్నాడు. "ముందుగా మేము అనుకున్న పానెల్‌లో రచయిత చైతన్యగారు కూడా ఉన్నారు. అయితే ఆయన అర్జంట్ పనివల్ల ఈ రోజు రాలేకపోయారు. అప్పుడు నేను చరణ్ గారిని ఆహ్వానించాను. ఆయన ఓ కారణం వల్ల రాలేనని అన్నారు. ఆ కారణం వల్లనే ఆయన వస్తే ప్రోగ్రామ్ బాగుంటుందని నాకు తోచింది. ఆయనని ఒప్పించాను. మా ఆహ్వానాన్ని మన్నించినందుకు అందరికీ కృతజ్ఞతలు. అయితే తక్కువ వ్యవధిలో ఒప్పుకున్నందుకు చరణ్ గారికి స్పెషల్ థాంక్స్!...ఇక మనం మొదలుపెడదామా?"

ప్రభాకర్ అందర్నీ పరిచయం చేశాడు.

చరణ్ గురించి చెబుతూ "ఈయన చరణ్. అమెరికాలో చదివి ఇప్పుడు హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్నారు. ప్రత్యేకత ఏమిటంటే అందులో పనిచేసే ఉద్యోగులలో అరవై శాతంవరకూ మహిళలే" అన్నాడు.

చరణ్ చర్చ మొదలుపెడుతూ "మా కంపెనీలో ఎక్కువమంది మహిళలే ఉండటం అన్న క్వాలిఫికేషన్‌వల్ల నన్ను ఈ చర్చకి పిలిచినట్లు స్పష్టమయింది. కాని నాకు అంతకంటే పెద్ద క్వాలిఫికేషన్ ఉంది. నేను ఒక స్త్రీకి భర్తని...మగవాడ్ని అన్న అహంకారం చూపించినప్పుడల్లా నన్ను కంట్రోల్ చేసే స్త్రీని భార్యగా పొందినవాడ్ని...అయితే నాకు అర్థం అవనిది ఒకటి ఉంది. సంవత్సరానికి ఒకరోజు మహిళాదినోత్సవంగా ప్రకటిస్తే దాని అర్థం ఏమిటి? మిగిలిన రోజులన్నీ మగవాళ్ళవే అని అంగీకరించినట్లేనా?..."

చిత్కళ వెంటనే అందుకుంది."అది చాలా పొరపాటు అభిప్రాయం. ఏడాదికి ఒక్క రోజు స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటాం... అంటే మిగిలిన రోజులన్నీ బానిసలమని అర్థంకాదు కదా!"

ప్రభాకర్ చిత్కళవంక ప్రశంసాపూర్వకంగా చూశాడు.

చర్చ పట్టుగా నడవసాగింది.

• • •

చరణ్ నుండి ఏ మెయిల్ రాకపోవటంతో చిత్కళ మనసు రాయిచేసుకుంది.

అతనికి ఇంకో మెయిల్ ఇచ్చే ప్రయత్నం కూడా చేయలేదు. ఎందుకంటే ఏ బాధ వచ్చినా అతనితో చెప్పుకుంటే ఉపశమనం కలిగేది. అతనే బాధ కలిగిస్తే ఏం చేయాలి? చివరికి మెయిల్ చూడటం కూడా మానేసింది.

ఫైర్ యాక్సిడెంట్‌వల్ల చిత్కళ కుమిలిపోతున్నది అనుకున్నారే కాని ఆమె ఏం పోగొట్టుకుందో తెలుసుకుని ఓదార్చేవాళ్ళు ఎవరున్నారు? బామ్మ ఉంటే ఎంత బాగుండేది!... ఆగని కన్నీళ్ళని చూసి అంత బేలగా అయినందుకు తనని తానే తిట్టుకునేది చిత్కళ.

దాదాపు రెండువారాల తరువాత ఓ రోజున మెయిల్ చెక్ చేసుకుంటుంటే చరణ్ నుంచి మెయిల్!...అదీ రెండు రోజుల క్రితం ఇచ్చినది.

ఓపెన్ చేయాలా వద్దా?...ఏం రాశాడు? ఇంత ఆలస్యం ఎందుకు చేశాడు?

ఏం చేయాలో తేల్చుకోలేక మానిటర్ స్విచ్ ఆఫ్ చేసింది చిత్కళ. నల్లగా ఉన్నతెర వంక అలా చూస్తూ ఉండిపోయింది.

రెండు రోజుల నుంచి తను జవాబు ఇవ్వకపోతే మామూలుగా అయితే అతను ఇంకో మెయిల్ ఇచ్చేవాడు. అలా ఇవ్వలేదూ అంటే ఈ మెయిల్ శాశ్వతంగా బై చెప్పేందుకు ఇచ్చి ఉండాలి.

అలాంటి మెయిల్ ఎందుకు ఓపెన్ చేయాలి? అయినా ఆస్ట్రిచ్‌లాగా ఇసుకలో తల దాచుకుంటే పరిస్థితులు మారిపోతాయా?

మానిటర్ ఆన్ చేసింది. క్రమంగా జీవం పోసుకుంటున్న తెరవంక ముభావంగా చూసింది. వణుకుతున్న చేతులతో మెయిల్ ఓపెన్ చేసింది.

మెయిల్‌లో ఏం లేదు. కాని దానికి ఓ ఎటాచ్‌మెంట్ ఉంది.



ఆ ఎటాచ్‌మెంట్ తెరుచుకోవటానికి కొంత టైమ్ పట్టింది.

స్క్రీన్‌పైన ఆ ఎటాచ్‌మెంట్ ప్రత్యక్షమవగానే చిత్కళ గుండె గొంతులోకి గెంతినట్లయింది.

ఓ కాయితం పైన పొందికగా సారీ...సారీ...సారీ...సారీ అని రాసి దాన్ని స్కాన్ చేసి ఎటాచ్‌మెంట్‌గా పంపాడు చరణ్.

చరణ్ దస్తూరి చూస్తుంటే అతనే కళ్ళముందు కనబడినట్లయి ఉక్కిరిబిక్కిరి అయింది చిత్కళ.

ఏమీ తెలియని అమాయకపు వయసులో రాసుకున్న ఊసులన్నీ మళ్ళీ మళ్ళీ చదువుతున్న మధురభావన కలిగింది.

అయితే చరణ్ ఇంత ఆలస్యంగా ఎందుకు ప్రతిస్పందించాడు?...దానికి జవాబు తెలియకుండా అతని మెయిల్‌కి సమాధానం ఎలా ఇస్తుంది?...తాను ఇంకా రిప్లయి ఇవ్వలేదన్న ఆతృత అతనికి ఎందుకు కలగలేదు? అతని ఉద్దేశం ఏమిటో అవగతం చేసుకునేంత వరకూ తాను అతనితో మాట్లాడకూడదు!

ఆ నిర్ణయం బాధాకరంగా ఉన్నా మునిపంట పెదవిని నొక్కి మరీ కంప్యూటర్ ఆఫ్‌చేసింది చిత్కళ.

ఆ రోజు ఇంటికి వెళ్ళేసరికి బాగా ఆలస్యం అయింది.

రోహిణి చివాట్లు వేసింది. "నీకు ఆ రీసెర్చ్ అచ్చిరాలేదు కళా! ఇంకెన్ని రోజులు అవస్థపడతావు. ఇప్పుడు టైమెంత అయిందో తెలుసా? ఎనిమిది దాటుతున్నది"

"అమ్మా! ప్లీజ్!" రెండు చేతులూ శబ్దం వచ్చేలాగా జోడించి అంది చిత్కళ. "ప్లీజ్! ప్లీజ్! ప్లీజ్! నన్ను వదిలెయ్యండి"

రోషంతోనే రోహిణి కూతురికి టీ ఇచ్చింది.

కప్ అందుకుంటూ చిత్కళ తల్లి చేయి సుతారంగా తట్టింది. "అమ్మా! సారీ...ఒక్క నెల రోజులు ఓపిక పట్టండి. నేను మళ్ళీ పాత చిత్కళని అవుతాను" అలా చెబుతుంటే అనిపించింది...చరణ్ నుండి మెయిల్ రాకపోతే ఈ రకమయిన సమాధానం ఇవ్వగలిగేదా?

చిత్కళ టీ తాగుతుండగానే ఫోన్ మోగింది. ఎస్‌టిడి కాల్!

రోహిణి ఫోన్ ఎత్తి "కళా! నీకే!"...అంటూ కార్డ్‌లెస్ అందించింది.

ఢిల్లీలో ఉన్న లావణ్య ఒక్కత్తే ఫోన్‌చేసి సానుభూతి చెప్పలేదు...లావూ కాబోలు అనుకుంది చిత్కళ. "హలో..." అంది మెల్లగా.

"హలో! చిత్కళా! నేను చరణ్‌ని. అన్ని సారీలు చెప్పినా కోపం పోలేదు కదూ... ఇప్పుడు స్వయంగా చెబుతున్నాను. అయామ్ సారీ..."

నేను నోరు విప్పను అనుకుంది చిత్కళ.

"నాపైన నీకు ఆకాశం అంత కోపం, సాగరం అంత ఆగ్రహం, కొండంత క్రోధం

ఉన్నా అదంతా నా తప్పువల్లనేకాని ఇప్పటికయినా క్షమించవచ్చు కదా?''

అసలు సంగతి తెలియకుండా నోరు విప్పటమా? నెవర్!

"నా టికెట్ కన్‌ఫర్మ్ అయింది. వారం రోజులలో వస్తున్నాను''

బెట్టు ఎగిరిపోయింది. నిర్ణయం కరిగిపోయింది. కోపం ఎగిరిపోయింది. "నువ్వు వస్తున్నావా?...ఎప్పుడు? నిజంగా?''

"అమ్మయ్య!'' చరణ్ గొంతులో ఎంతో రిలీఫ్ వినబడింది."నేను చేసిన తప్పుకి ఎంత పెద్ద పరిహారం చెల్లించాల్సి వస్తుందో అనుకున్నాను. నా అంత బుద్ధిలేనివ్యక్తి, బుర్ర పనిచేయని మనిషి, చెదలు తినేసిన గుండె ఉన్న శాల్తీ ఈ భూ ప్రపంచంలో ఉండి ఉండడు. అయితే నా అదృష్టమేమిటంటే నువ్వు...నీ కంపానియన్‌షిప్ నాకు లభించటం''

అప్రయత్నంగా చిత్కళ నవ్వింది.

"అమ్మయ్యా! నువ్వు నిజంగానే నన్ను క్షమించేశావు''

"నన్ను ఇన్ని రోజులు ఎందుకు టార్చర్ చేశావు చరణ్?'' చిత్కళ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని మాట్లాడటంతో ఆ సంభాషణ అంతా రోహిణి చెవిన పడుతూనే ఉంది. కూతురు చరణ్ అని, టార్చర్ అని అనటంతో రోహిణీ చేస్తున్న పని ఆపి వచ్చి చిత్కళ పక్కన నిలబడింది.

చిత్కళ ఖాతరు చేయదల్చుకోలేదు. "చెప్పు చరణ్!...నేను ఎటువంటి దైన్యస్థితిలో ఉండి ఉంటానో తెలిసీ మౌనంగా ఉండిపోవటానికి నీకు మనసు ఎలా వచ్చింది? సానుభూతి హస్తం చాచి కన్నీరు తుడవాల్సినవాడివి చేతులు ముడుచుకుని ఎందుకు కూర్చున్నావు? పగిలి ముక్కలవుతున్న నా తలకి ఊరట కలిగించటానికి నీ భుజాన్ని ఆఫర్ చేయాల్సింది పోయి నీకేం పట్టనట్లు రాయిలాగా ఎలా ఉండగలిగావు?''

రోహిణి నివ్వెరపోయి కూతురివంక చూస్తున్నది. ఆమెకి ఏం అర్థం అవటంలేదు. దగ్గరయి రిసీవర్ అందుకోబోయింది. చిత్కళ వద్దు అన్నట్లు తల ఊపింది.

అటునించి చరణ్ బోలుగా నవ్వాడు. "అన్నీ సముఖంలో చెబుతాను...ప్లీజ్ అర్థం చేసుకో...నేను ఫూలిష్‌గా చేశానని నువ్వు తొందరపడకు...ప్లీజ్! నాకు వారంరోజులు అవకాశం ఇవ్వు...ప్లీజ్!''

"సరే!...'' అంది చిత్కళ.

"థాంక్ యూ...'' చరణ్ అన్నాడు.

రిసీవర్ ఆఫ్‌చేయగానే రోహిణి వెంటనే అడిగింది."ఎవరు?...ఎవరా చరణ్? నీకు ఆ పేరుతో ఫ్రెండ్ ఉన్నాడని ఎప్పుడూ చెప్పలేదే?''

"చరణ్ అంటే వెనకాల ఇంటి అబ్బాయి...''

రోహిణి అప్రయత్నంగా నోరు తెరిచింది.

"అమ్మా! నాకు ఓ సాయం చేస్తావా?'' చిత్కళ ప్రాధేయపూర్వకంగా అంది. "ఈ



సంగతి నాన్నకి చెప్పకు...వచ్చేవారం అతను ఇండియా వస్తున్నాడు. ఎప్పుడో చెప్పలేను కాని ఇద్దరం పెళ్ళిచేసుకుంటాం!...''

రోహిణి బిత్తరపోయింది.

• • •

చరణ్ వచ్చాడు.అన్నట్లుగానే చరణ్ ఏం జరిగిందో దాచకుండా చెప్పాడు.

"నీ పిహెచ్‌డి ఇంకోసారి మూలపడింది అనగానే నాకేం తోచలేదు. రీసెర్చ్ పూర్తి కాకుండా నువ్వు అమెరికా రాలేవు. ఇంకో నాలుగేళ్ళు ఆగే ఓపిక నాలోలేదు. అంటే ఈ సమస్యకి పరిష్కారం లేదన్నమాట! అందుకనే మౌనంగా ఉండిపోయాను. పరాయి దేశంలో ఉన్నది నేను కాని నువ్వు కాదుకదా...నీకు సాంత్వన చెప్పేవాళ్ళు, ఊరడించేవాళ్ళూ ఉండే ఉంటారులే అని నాకు నేను నచ్చచెప్పుకున్నాను.

మగవాళ్ళు మెదడుతో ఆలోచిస్తారు ఆడవాళ్ళు హృదయంతో ఆలోచిస్తారు అని నువ్వు ఒకసారి అన్నావు గుర్తుందా? మగ అయినా ఆడ అయినా కొన్ని పరిస్థితులలో మెదడు ఉపయోగించాలి. ఇంకొన్ని సిట్యుయేషన్స్‌లో హృదయాన్ని వాడాలి అని నాకు జ్ఞానోదయం అయ్యేసరికి కాస్త ఆలస్యమయింది. వెంటనే నీకు మెయిల్ ఇచ్చాను''

"మరి ఇప్పుడు సమస్య ఎలా పరిష్కారం అవుతుందనుకున్నావు?'' చిత్కళ గొంతులో ఏ భావం ఉందో చరణ్ కనిపెట్టలేకపోయాడు.

"అప్పుడు మెదడుతో ఆలోచించి అది నీ సమస్య అనుకున్నాను కాబట్టి పరిష్కారం లేదనుకున్నాను. ఇప్పుడు నా హృదయం అది మన సమస్య అంటున్నది. ఏదో పరిష్కారం దొరుకుతుందని భరోసా ఇస్తున్నది...'' చరణ్ అన్నాడు.

"ఎలా దొరుకుతుంది?''

"అదే ఇద్దరం కలిసి ఆలోచించాలి!...ఎందుకంటే ఇది మన సమస్య కాబట్టి''

చరణ్, చిత్కళ రకరకాలుగా ఆలోచించారు...చరణ్ తన స్నేహితులతో కూడా చర్చించాడు. ఎవరెవరికో మెయిల్స్ పంపాడు.

చిత్కళతో పాటు చరణ్ కూడా లాబ్‌కి వెళ్ళాడు. చిత్కళ గైడ్‌ని కలిశాడు. ఆవిడ సానుభూతి చూపించింది.

లాబ్‌లో తను పనిచేసిన ప్రదేశాలన్నీ చిత్కళ అతనికి చూపించింది.

ప్రయోగాలలో తమ ప్రాణాలని కోల్పోయిన జంతువుల గుర్తుగా చిత్కళ నాటిన మొక్క బాగా పెద్దదయ్యింది.

ఇప్పుడు చిత్కళతోపాటు చరణ్ కూడా ఆ మొక్క దగ్గర మౌనంగా కళ్ళు మూసుకుని రెండు నిముషాలు గడిపాడు.

చిత్కళకి ఆ పరిసరాలు చూస్తుంటే ఆవేదనగా ఉంది. ఇంకొన్ని రోజులు మళ్ళీ ఇక్కడే పనిచేయాలి. ఓ మెయిల్‌లో చరణ్‌కి చెప్పినట్లు అయ్యవారులాగా ఒలకపోసుకోవ

టం మళ్ళీ ఎత్తుకోవటం!... కళ్ళల్లో సన్నగా నీటితెర కమ్ముకుంది. చరణ్ కూడా మసక మసకగా కనబడుతున్నాడు.

అందుకనే కాబోలు చరణ్ మొహం వెలిగిపోవటం ఆమె గమనించలేదు.

"యురేకా..."అన్నాడు చరణ్. "నువ్వు నాటిన మొక్క ఇంకా పెద్దదయి బోధివృక్షం అవుతుంది"

చిత్కళ అయోమయంగా అతనివంక చూసింది.

"కాదు చరణ్!... అది మామిడి చెట్టు..."

"పిచ్చిపిల్లా!... హార్వర్డ్ బిజినెస్ జర్నల్‌లో ఎప్పుడో చదివినది ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. బుద్ధుడికి బోధిచెట్టులాగా నాకీ మొక్క అన్నమాట!"

"చరణ్! ప్లీజ్ సూటిగా చెప్పు...నా బుర్ర అసలు సరిగా పనిచేయటంలేదు"

చరణ్ నవ్వాడు. "నా అయిడియా పనిచేస్తుందో లేదో తెలియాలంటే ముందు కాలిపోయిన నీ కంప్యూటర్ చూపించు"

చిత్కళని నిరాశ ఆవరించింది. ఇదా చరణ్‌కి తట్టిన ఆలోచన?...కంప్యూటర్ అసలు పనికిరాకుండా కాలిపోయిందని ఎప్పుడో నిర్ధారణకి వచ్చారు. "కంప్యూటర్‌లో ఏ పార్టూ పనిచేయటంలేదని అన్నారు..." చిత్కళ అంది.

"నన్ను చూడనియ్యి..." అన్నాడు చరణ్.

అనుమతి తీసుకుని ఆ కంప్యూటర్ చరణ్‌కి చూపించింది చిత్కళ. పైనున్న క్యాబినెట్ అంతా పూర్తిగా కాలిపోయి లోపల ఉన్న భాగాలు కనబడుతున్నాయి. లోపల కూడా కొంత డామేజీ జరిగింది.

చరణ్ సన్నగా ఈల వేశాడు. చిత్కళ భుజం తట్టాడు. "వరల్డ్ ట్రేడ్ సెంటర్ కూలిపోయినప్పుడు మొదటిసారిగా డిజాస్టర్ రికవరీ ఆపరేషన్స్ గురించి అందరికీ తెలిసింది. అప్పుడే ఈ రికవరీ ఆపరేషన్స్ బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయిట.

పైనున్న క్యాబినెట్ కాలిపోయి కంప్యూటర్ సర్వనాశనం అయినా కంప్యూటర్ హార్డ్‌డిస్క్ నుండి ఎలక్ట్రానిక్ డేటాని తిరిగి సంపాదించే అవకాశం ఉందని తెలిసింది. అక్కడ ఉన్న కొన్ని కంప్యూటర్‌లని నేను టీ.వీలో చూశాను. వాటితో పోలిస్తే నీ కంప్యూటర్ తళతళలాడుతున్న కొత్త దానిలా ఉంది. వాటినుంచే డేటా సంపాదించారుట. నీ హార్డ్ డిస్క్ నుండి నీ థీసిస్ మొత్తం రాబట్టటం అంత కష్టం కాకపోవచ్చు. అయితే నైపుణ్యం ఉన్నవాళ్ళు జాగ్రత్తగా చేయాలి"

"నిజమా?" ఆ మూడు అక్షరాలు పలకటానికి చిత్కళ చాలా కష్టపడింది. "చరణ్! అదే నిజమయితే ఇంకా మనకు కావలసినది ఏముంది?"

"కనీసం వెయ్యి ఉన్నాయి అని మనం లిస్ట్ రాసుకున్నాం మరిచిపోయావా?" అల్లరిగా అన్నాడు చరణ్.



చరణ్ ఊహించినది నిజమని రుజువయింది.

చిత్కళ శాశ్వతంగా పోయిందనుకున్న డేటా నెల తరువాత అంతా రికవర్ చేయగలిగారు. చిత్కళకి అదో అద్భుతంలాగా తోచింది. ప్రాణంపోయిన మనిషి తిరిగి జీవించటంలాగా ఇది ఒక మహాద్భుతం అనుకుంది.

ఇంకో వారంరోజుల తర్వాత చిత్కళ థీసిస్ బైండింగ్‌కి ఇచ్చింది. ముందుగా అనుకున్నట్లు కాక ప్రతికాపీలో ఉన్న ఎక్‌నాలెడ్జ్‌మెంట్‌లో చరణ్ పేరు ఉదహరించింది.

• • •

చర్చ పట్టుగా సాగుతున్నది.

ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటే స్త్రీలు చాలా సమస్యలని పరిష్కరించుకుంటారు అంటున్నది మహిళా పారిశ్రామికవేత్త.

అది పూర్తి సత్యంకాదు అంది చిత్కళ. "మా కాలనీలో ఉన్న పనిమనుషులంతా నెలకి రెండువేల వరకూ సంపాదిస్తారు. వాళ్ళని తన్ని ఆ డబ్బులు లాక్కుని వాళ్ళ భర్తలు తాగుతారు. ఆర్థికంగా వాళ్ళ కాళ్ళపైన వాళ్ళు నిలబడగలిగినా అణచివేతకి గురి అవుతూనే ఉన్నారు"

అహంకారంతో పురుషులు ఏం చేస్తున్నారని ఆరోపణ చేస్తున్నారో అవే చేయటం స్వాతంత్ర్యానికి నిదర్శనం అని స్త్రీవాదులు భావించటంతో ఉద్యమం దెబ్బతింటున్నది అంటాడు సర్జన్.

అలా చేస్తున్న కొద్దిమందిని విస్మరించి మెజారిటీ మహిళల సమస్యలని అర్థం చేసుకోవచ్చు కదా అని చిత్కళ అంది.

చిత్కళని చూస్తుంటే చరణ్‌కి ఎప్పుడూ ఆశ్చర్యంగా ఉంటుంది. సౌమ్యంగా కనబడుతూనే ఉంటుంది కాని కొన్ని విషయాలలో ఖచ్చితంగా ఉంటుంది!

చర్చ మొత్తాన్నీ డామినేట్ చేసింది చిత్కళ.

అలా చర్చ బాగా సాగింది.

"స్త్రీలలో చైతన్యం మగవారిలో అవగాహన తీసుకువచ్చే దిశగా ముఖ్య ఆశయాన్ని మరల్చుకుంటే మహిళా దినోత్సవాలు విజయవంతమవుతాయి అన్నది అందరి అభిప్రాయం..." అంటూ చర్చని ముగించాడు ప్రభాకర్.

"ముందుగా ఆహ్వానించినవారిలో చిత్కళగారు ఉన్నారు. చైతన్యగారు రావటం లేదని చరణ్‌గారిని ఆహ్వానిస్తే తన శ్రీమతి ఆల్రెడీ పానెల్‌లో ఉందని చెప్పారు. వారిరువురూ భార్యాభర్తలని నాకు అప్పుడే తెలిసింది. తమకు [illegible] సబబుగా ఉండదేమో అన్నారు చరణ్‌గారు...విపిసింగ్‌గారు ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు టీ.వీలో ప్రజల సమస్యలకి సమాధానం ఇస్తున్నప్పుడు ఆయన భార్య సామాన్య గృహిణిలాగా ఆ కార్యక్రమంలో పాల్గొనటం నాకు గుర్తుకి వచ్చి చరణ్‌గారిని ఒప్పించాను. భార్యాభర్తలు ఇద్దరూ ఈ

[illegible]

చర్చలో పాల్గొనటం వినూత్నంగా ఉంది అని నేను అనుకుంటున్నాను" అన్నాడు ప్రభాకర్ షూటింగ్ అయ్యాక.

అవును అన్నట్లు తల ఊపారు మిగిలిన ఇద్దరు పార్టిసిపెంట్స్.

ఇంటికి వెడుతుంటే చిత్కళ "ఈ రోజున ఇద్దరం త్వరగా రావటం చూసి పిల్లలు సంబరపడతారు..." అంది.

"అవును..." అన్నాడు చరణ్. "ఇందాక నువ్వు ఆవేశంగా మాట్లాడుతుంటే నాకు భయం, ఆశ్చర్యం రెండూ కలిగాయి"

"భయం ఎందుకు?...ఆశ్చర్యం ఎందుకు?..." చిత్కళ అడిగింది.

"నా శ్రమ అంతా బూడిదయ్యి నాకు ఇంత కష్టం వస్తే రెండు వారాలు మూగగా గడుపుతావా అని అదే ఆవేశం చూపించి నన్ను తిరస్కరిస్తే నా బతుకు ఏమయ్యేదో అన్న భయం, నువ్వు అలా స్పందించనందుకు ఆశ్చర్యం!"

చిత్కళ నవ్వింది. "సమస్య మనది అనుకున్నాను కాబట్టి పరిష్కారం దొరుకుతుందన్న నమ్మకం ఉంది అన్నావు...గుర్తుందా? ఆ దృక్పథం నాకు బాగా నచ్చింది.అదేవిధంగా... ఆకాశంలో సగం నాది అని అనుకుంటే నిన్ను తిరస్కరించేదాన్ని. ఇద్దరిదీ అనుకున్నాను కాబట్టి అర్థంచేసుకున్నాను".

ఇంట్లోకి వస్తున్న చరణ్ చిత్కళలని చూసి ఆరేళ్ళ పిల్లలు ఇద్దరు "హాయ్!..." అని గెంతసాగారు.

"ఈ పుస్తకాలన్నీ చింపింది ఎవరు?" చిత్కళ కోపం నటిస్తూ అడిగింది. "అభిషేక్ నువ్వు కదూ..."

అభిషేక్ "నేను కాదమ్మా!..." అన్నాడు.

"అర్చనా...మరి నువ్వా?"

"నేను కాదమ్మా!..."

"మరి ఎవరు?"

"మేం ఇద్దరం కల్సి చింపాం..." కవలలు ఇద్దరూ అమాయకంగా చెప్పారు.

"ఆకాశం మన ఇద్దరిదీ...అల్లరి చేసేందుకు ఈ భూమి వీళ్ళిద్దరిదీ..." అన్నాడు చరణ్ నవ్వుతూ.

చిత్కళతో పాటు పిల్లలు కూడా నవ్వారు.

-: అయిపోయింది :-